
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 233
సోమవారం 8-5-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



'సూపర్' రైజర్స్..
ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్తాన్‌పై ఆఖరి బంతికి గెలిచిన హైదరాబాద్ - 12లో



రాబడులు చూసి మోసపోవద్దు
పెట్టుబడులపై నిర్ణయం తీసుకునేముందు పాటించాల్సిన జాగ్రత్తలపై కథనం - 13లో



కర్ణాటకను వేరు చేసే కుట్ర
భారత్ నుంచి కర్ణాటకను వేరు చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు.
వివరాలు 6లో ▸



నారీ శక్తితో గణతంత్రం
గణతంత్ర దినోత్సవ పెరేడ్‌ను వచ్చే ఏడాది మహిళా శక్తితోనే నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.
వివరాలు 6లో ▸



21లోగా అరెస్ట్ చేయాలి
బ్రిజ్‌ను అరెస్టు చేసి.. రెజ్లర్ల సమస్యను పరిష్కరించకపోతే 21న కీలక నిర్ణయం తీసుకుంటామని రైతు సంఘాల నేతలు హెచ్చరించారు.
వివరాలు 6లో ▸



అమెరికా మాల్‌లో కాల్పులు
టెక్సాస్ రాష్ట్రం అల్లెన్‌లోని ఓ మాల్‌లో జరిగిన కాల్పుల్లో అనుమానితుడు సహా 9 మంది చనిపోయారు. ముగ్గురి పరిస్థితి విషమం.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ముగిసిన 'నీట్'



ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య విద్య యూజీ కోర్సుల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్–యూజీ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఏడాది ప్రశ్నపత్రం మధ్యస్తం నుంచి కఠినంగా ఉన్నట్టు విద్యార్థులు అభిప్రాయపడ్డారు.
వివరాలు 14లో ▸

సంప్రదాయబద్ధంగా 'ఇంద్ర' పతాకావిష్కరణ


రాష్ట్ర సంక్షేమం కోసం దేవదాయ శాఖ తలపెట్టిన అష్టోత్తర శతకుండాత్మక చండి, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిమిత్తం ఆదివారం ఇంద్ర పతాకావిష్కరణ ఘనంగా జరిగింది.
వివరాలు 2లో ▸

రాజు చుట్టూ ని'బంధనాలు'


ఒక దేశానికి రాజుగా కిరీటధారణ జరిగితే ఇక ప్రతీ రోజూ రాజభోగాలు అనుభవించడమే అనుకుంటే పొరపాటే. చుట్టూ వంది మాగధులు, ఏ చిన్న పనికైనా జీ హుజూర్ అనే సేవకులు ఉన్నప్పటికీ ఆంక్షల చట్రంలో బతకాల్సి ఉంటుంది.
వివరాలు 6లో ▸

'యురేనస్'పై సముద్రాలు


విశ్వంలో భూమిపైనే కాకుండా ఇంకెక్కడైనా జలరాశి ఉందా? అనేదానిపై శాస్త్రవేత్తలు శతాబ్దాలుగా అన్వేషణ కొనసాగిస్తున్నారు. సౌర వ్యవస్థ అంచుల్లోనూ జల అన్వేషణ సాగుతోంది. తాజాగా 'నాసా' శాస్త్రవేత్తలు పురోగతి సాధించారు. యురేనస్‌కు చెందిన ఉపగ్రహాలపై మహా సముద్రాలు ఉన్నాయని చెప్పడానికి ఆధారాలు కనిపెట్టారు.
వివరాలు 6లో ▸



బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని జగనన్న కాలనీలో ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు

ఇదీ మార్పు అంటే..

వెలుగులు నింపిన 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం

- దశాబ్దాలుగా కాలువ గట్టుపైనే పాకల్లో నివాసాలు
- మురికి కూపంలో మగ్గిన నిరుపేద కుటుంబాలు
- దైన్యంగా గడిపిన చోటే ఆత్మ గౌరవంతో జీవిస్తున్న అక్క చెల్లెమ్మలు
- రాష్ట్రవ్యాప్తంగా 17 వేల జగనన్న కాలనీలతో ఏకంగా కొత్త ఊర్లు నిర్మాణం
- రూ.1.06 లక్షల కోట్ల వ్యయంతో 30 లక్షల మందికిపైగా గృహ యోగం

2లో

ఈ ఫొటోలో సొంతింటి ముందు సంతోషంగా సెల్ఫీ తీసుకుంటున్న టి.తిరుపతిస్వామి, వేశంగిణి కుటుంబం ఏడాది క్రితం వరకు బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరులో కృష్ణా కెనాల్ పిల్లకాలువ గట్టుపై పూరి గుడిసెలో నివసించింది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ దశాబ్దాల పాటు దుర్భర జీవితాన్ని అనుభవించాయి. గత ప్రభుత్వంలో ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకున్నా ఇంటి స్థలం మంజూరు కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నవ రత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద వేశంగిణికి ఇంటి స్థలంతో పాటు ఇంటిని కూడా నిర్మించి ఇచ్చింది. దీంతో గత ఏడాది సెప్టెంబర్‌లో ఈ కుటుంబం గృహ ప్రవేశం చేసింది. 'నా చిన్నప్పటి నుంచి కాలువ గట్టుపై మురికి కూపంలో గుడిసెల్లోనే బతికా. దీపం వెలుతురు మినహా కరెంటు కనెక్షన్ లేదు. వర్షాలు పడితే గుడిసె వరదనీటిలో మునిగిపోయేది. మురికి నీటి కారణంగా



దోమలు బెడద తీవ్రంగా ఉండేది. పాములు, తేళ్లు, కీటకాలు గుడిసెలోకి వచ్చేవి. సీఎం జగన్ ప్రభుత్వం మా గోడును ఆలకించింది. మాకంటూ ఓ సొంతిల్లు ఉంది. ఇప్పుడు కంటి నిండా నిద్ర పోతున్నాం' అని వేశంగిణి కృతజ్ఞతలు తెలిపింది.

ఉన్నత విద్యే లక్ష్యం

పది తర్వాత చదువు మానేయకుండా చూడటమే ప్రభుత్వ ధ్యేయం

ఇంటర్, డిగ్రీ చదువులకు అడుగడుగునా ప్రోత్సాహం

- నాలుగేళ్లుగా వినూత్న పథకాలు, కార్యక్రమాలతో ఊతం.. అందరూ డిగ్రీ చదివేలా సూక్ష్మ స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక
- ఫలితంగా ఉన్నత విద్యలో గుణాత్మకంగా చేరికల్లో పెరుగుదల
- బాబు హయాంలో సెకండరీ విద్యలో చేరే వారి సంఖ్య తక్కువ.. సీఎం వైఎస్ జగన్ హయాంలో ఏటేటా పెరుగుదల
- 2022–23లో ఏకంగా 89.63 శాతానికి చేరికలు
- గతంలో ఉన్నత విద్యలో చేరికలు కేవలం 46.88 శాతమే
- 2022–23లో 69.87 శాతానికి పెరుగుదల
- పది తర్వాత తదుపరి విద్యలో చేరే వారిపై వలంటీర్లతో సర్వే
- చేరకపోతే కారణాలు గుర్తించి పరిష్కార మార్గాల సూచన
- ఈ దిశగా నిర్ణీత ప్రొఫార్మాతో సర్వే చేపట్టాలని సీఎస్ ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ఇస్తున్న ప్రాధాన్యత సత్ఫలితాలిస్తోంది. పాఠశాల విద్యతోనే పిల్లలు చదువు మానేయకుండా ఉన్నత విద్య వైపు దృష్టి సారించేలా పలు పథకాలు, కార్యక్రమాలు చేపడుతోంది. బడి ఈడు పిల్లలందరినీ ఒక పక్క బడిబాట పట్టిస్తూనే మరో పక్క ఆ పిల్లలందరూ సెకండరీ, ఉన్నత విద్యను అభ్యసించేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. తద్వారా పరిమాణాత్మక, గుణాత్మక మెరుగుదల కళ్లకు కొట్టొచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సెకండరీ, ఉన్నత విద్య ఎన్‌రోల్ మెంట్‌పై సమీక్షలో చర్చకు వచ్చిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో 2019–20 నుంచి 2022–23 వరకు ఏటేటా ఉన్నత విద్యలో చేరుతున్న వారి సంఖ్య
మిగతా 2వ పేజీలో ▶

ఫలించిన సీఎం జగన్ యత్నం

మణిపూర్ నుంచి రెండు ప్రత్యేక విమానాల ఏర్పాటు

ఒకటి హైదరాబాద్‌కు.. మరొకటి కోల్‌కతాకు నేడు రాక

- అక్కడి నుంచి ఏపీలోని స్వస్థలాలకు విద్యార్థులను చేర్చేందుకు ఏర్పాట్లు
- మణిపూర్‌లో చిక్కుకుపోయిన వారిని తీసుకొచ్చేందుకు ముమ్మర కసరత్తు
- హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా ఇప్పటి వరకు 157 మంది విద్యార్థుల గుర్తింపు.. ఒక్కో విద్యా సంస్థలో ఒక్కో విద్యార్థి నోడల్ పాయింట్‌గా ఎంపిక
- వారి ద్వారా మిగిలిన విద్యార్థులందరి వివరాల సేకరణ
- వారిని కట్టుదిట్టమైన భద్రత మధ్య విమానాశ్రయానికి తరలించేలా చర్యలు
- రాష్ట్ర ప్రభుత్వ లేఖలకు స్పందించిన మణిపూర్ సీఎస్, పౌర విమానయాన కార్యదర్శి


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి బొత్స. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయనగరం/వెంకటాచలం/దేవరాపల్లి: మణిపూర్‌లో చిక్కుకుపోయిన ఏపీ విద్యార్థుల విషయంలో సీఎం జగన్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు రెండు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేశారు. సొంత ఖర్చులతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విమానాలను ఏర్పాటు చేసింది. ఒక విమానంలో హైదరాబాద్‌కు, మరో విమానంలో కోల్‌కతాకు తీసుకు వచ్చి, అక్కడి నుంచి వారిని స్వస్థలాలకు పంపేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం ఉదయం 9.35 గంటలకు
మిగతా 3వ పేజీలో ▶

ఆర్థిక నేరాలకు మార్గదర్శితో ముగింపు!

- నాడు రిజిస్టర్ చేయకుండా చిట్‌ఫండ్ నడిపిన కేసులో 4 రోజుల పాటు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో రామోజీ: మాజీ ఎంపీ ఉండవల్లి
- కోర్టుల్ని తప్పుదారి పట్టించేలా లెక్కలు చూపించారు
- ఫిర్యాదులు రాకున్నా న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- రామోజీ కేసు ముగిసిందనుకున్నాం.. సీఎం జగన్ ఎస్‌ఎల్‌పీ పిటిషన్ వేయడంతో కేసుకు ఊపిరి వచ్చింది.. విశాఖ సదస్సులో వక్తలు

సాక్షి, విశాఖపట్నం: రిజిస్టర్ చేయకుండా చిట్‌ఫండ్ నిర్వహించిన కేసులో మార్గదర్శి చైర్మన్ చెరుకూరి రామోజీరావు గతంలో నాలుగు రోజుల పాటు హైదరాబాద్ అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని, అప్పటి నుంచి ఆయన మోసాలు కొనసాగుతూనే ఉన్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వెల్లడించారు. మార్గదర్శి కేసుతోనైనా దేశంలో ఆర్థిక నేరాలకు ఫుల్‌స్టాప్ పడాలని వ్యాఖ్యానించారు. 17 ఏళ్లగా కొనసాగుతున్న మార్గదర్శి కేసు ఇక ముగిసిన అధ్యాయం అనుకున్న తరుణంలో డిపాజిట్‌దారుల ప్రయోజనాలను కాపాడుతూ సీఎం వైఎస్ జగన్ వేసిన ఎస్‌ఎల్‌పీ పిటిషన్‌తో కొత్త ఊపిరి వచ్చిందని, లక్షల మంది ఖాతాదారులకు ధైర్యం వచ్చిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. విశాఖలోని ఓ హోటల్‌లో
మిగతా 10వ పేజీలో ▶

పిడుగుల కాలం.. 'వాహకం'తో దూరం
కనీస జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుల బారినుంచి సునాయాసంగా రక్షించుకోవచ్చని విద్యుత్ భద్రత డైరెక్టర్ జి.వి జయలక్ష్మి చెప్పారు. ప్రతి ఇంటిపైనా 'పిడుగు వాహకం' అమర్చుకోవాలన్నారు. అలాగే పిడుగుల శబ్దం వినిపిస్తూ.. వర్షం పడుతుంటే ఎలక్ట్రిక్ పరికరాలు వినియోగించొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కిందకు పోవద్దని.. విద్యుత్ తీగల కింద, టవర్ల దగ్గరలో ఉండొద్దని సూచించారు.
- వివరాలు 5లో

నిద్రపోయినా.. ఏడ్చినా జీతమిస్తారు!
పని చేస్తే జీతమిస్తారు ఎక్కడైనా. కానీ.. పరుపులపై నిద్రపోవడం.. క్యూలైన్‌లో నిలబడటం.. శవం దగ్గర ఏడ్వటం లాంటి పనులు చేస్తే కాసుల వర్షం కురుస్తోంది. వివిధ దేశాల్లో ఇలాంటి చిత్ర విచిత్రమైన పనులెన్నో చేసేస్తూ డబ్బులు గడిస్తున్న వారు చాలామందే ఉన్నారు.
- వివరాలు 14లో

సోషల్ మీడియా 'కట్'.. వినోదానికే 'నెట్'
దేశంలో అత్యధిక వినియోగదారులు ఇంటర్నెట్‌ను వినోద కార్యక్రమాల వీక్షణకే ఉపయోగిస్తున్నారు. అలాగే ఆన్‌లైన్ షాపింగ్ కోసం ఇంటర్నెట్ వినియోగం పెరుగుతుండగా.. సోషల్ మీడియాపట్ల నెమ్మదిగా ఆసక్తి సన్నగిల్లుతోంది. ఈ విషయాలను 'ఇండియా ఇంటర్నెట్ రిపోర్ట్–2022' వెల్లడించింది.
- వివరాలు 3లో

వాట్సాప్‌లో చీటింగ్!

- సైబర్ నేరగాళ్ల సరికొత్త దోపిడీ పంథా
- అంతర్జాతీయ నంబర్లతో వాట్సాప్ కాల్స్
- సాధారణ స్పామ్ కాల్స్‌ను నిరోధించే 'ఏఐ'ను దాటుకుని కొత్త మోసం
- 'మనీ ఫర్ లైక్స్' పేరుతో టోకరా



వీడియో కాల్స్‌తో బ్లాక్ మెయిల్
మోసగాళ్లు బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దండుకునేందుకు వాట్సాప్ వీడియో కాల్స్‌ను ఉపయోగిస్తున్నారు. అజ్ఞాత వ్యక్తులు రకరకాల నంబర్ల నుంచి వీడియో కాల్ చేస్తారు. కాల్ లిఫ్ట్ చేయగానే అవతల మహిళ అశ్లీలంగా కనిపిస్తుంది. కాల్ డిస్‌కనెక్ట్ చేసేలోగా నేరగాళ్లు స్క్రీన్ రికార్డింగ్, స్క్రీన్ షాట్ తీస్తారు. ఆ తర్వాత బాధితుడికి పంపి బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. మరికొన్ని ఘటనల్లో వీడియో కాల్స్ వస్తున్నప్పటికీ యూజర్ స్క్రీన్‌పై ఎటువంటి ఆడియో లేకుండా ఖాళీ వీడియో కనిపిస్తుంది. చూస్తుండగానే కాల్ అకస్మాత్తుగా కట్ అవుతుంది. కొన్ని నిమిషాల తర్వాత మార్ఫింగ్ చేసిన అశ్లీల వీడియోను పంపి డబ్బులు ఇవ్వకుంటే యూజర్ కాంటాక్ట్‌లకు పంపిస్తామంటూ బెదిరించి డబ్బులు గుంజుతారు.

సాక్షి, అమరావతి: సైబర్ నేరగాళ్లు సరికొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్థిక మోసాలను అరికట్టేందుకు టెలికాం సంస్థలు తీసుకుంటున్న భద్రతా చర్యలకు పైఎత్తులు వేస్తున్నారు. సాధారణ స్పామ్ కాల్స్ కట్టడికి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్) ఫిల్టర్లను ప్రవేశపెట్టినప్పటికీ అంతకు మించి దోపిడీ మార్గాలను అన్వేషిస్తున్నారు. అంతర్జాతీయ నంబర్ల వాట్సాప్ కాల్స్‌తో నేరాలకు పాల్పడుతున్నారు. దేశంలో సుమారు 480 మిలియన్ల వాట్సాప్ వినియోగదారులుండటం, ప్రపంచంలోనే అతిపెద్ద వాట్సాప్ కేంద్రం కావడంతో సైబర్ నేరగాళ్ల దృష్టి మనపై పడింది.

అంతర్జాతీయ నంబర్లతో..
వాట్సాప్ వినియోగదారులకు ఎక్కువగా ఇథియోపియా (+25), మలేషియా(+60), ఇండోనేషియా (+62), కెన్యా (+254), మాలి (+223), గినియా (+224) వియత్నాం (+84)తో పాటు మరికొన్ని దేశాల నుంచి అంతర్జాతీయ నంబర్లతో పదేపదే వాట్సాప్ కాల్స్ రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో ఎక్కువ భాగం ఆగ్నేయాసియా దేశాల ఐఎస్‌డీ కోడ్‌లతోనే కాల్స్ వస్తున్నాయి.

కనిపెట్టడం కష్టం..
అంతర్జాతీయ నంబర్లతో వస్తున్న వాట్సాప్ కాల్స్ ఉనికిని కనిపెట్టడం చాలా కష్టం. ఒక ఐఎస్‌డీ కోడ్‌తో వచ్చే వాట్సాప్ కాల్‌ను మోసగాళ్లు అదే దేశం నుంచే చేస్తున్నట్లు నిర్ధారించలేం. విదేశాల్లో ఉండే వారి ద్వారా అక్కడి నంబర్ తీసుకుని వేరే దేశంలో ఉంటూ వాట్సాప్ యాక్టివేట్ చేసుకుని మోసపూరిత కాల్స్ చేయవచ్చు. బయట మార్కెట్‌లో చాలా ఏజెన్సీలు నేరగాళ్లకు
మిగతా 2వ పేజీలో ▶

అల్లూరికి సీఎం జగన్ ఘన నివాళి



సాక్షి,అమరావతి: అల్లూరి సీతా రామరాజు వర్ధంతి సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఆయనకు ఘన నివాళు లర్పించారు. అల్లూరి సేవలను స్మరించుకుంటూ సీఎం ట్వీట్ చేశారు. ''స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అలుపెరుగని పోరాటం చేసిన వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు గారు. ఆయన త్యాగాన్ని ఎల్లప్పుడూ స్మరించుకునేలా మన ప్రభుత్వంలో ఆయన పేరు మీద జిల్లాను ఏర్పాటు చేశాము. నేడు ఆ మహనీయుడి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి'' అని ట్వీట్ చేశారు.

వాట్సాప్‌లో చీటింగ్!

▶ మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయ నంబర్లను విక్రయిస్తున్నాయి.

'మనీ ఫర్ లైక్స్' స్కామ్

వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా జాబ్ ఆఫర్లను పంపడం కొత్త రకం స్కామ్. ఇంటి నుంచి పార్ట్‌టైమ్ ఉద్యోగ అవకాశం కల్పిస్తామంటూ వాట్సాప్‌లో మెసేజ్ పంపుతారు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని, టెలిగ్రామ్ చానెల్‌లో చేరాలని నమ్మబలుకుతారు. యూట్యూబ్ వీడియోల లైక్ బటన్ నొక్కడం, పోస్టులపై కామెంట్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో కంటెంట్‌ను ప్రచారం చేయడం లాంటి పనులు చేయాలని చెబుతారు. బాధితుడిని నమ్మించడానికి తొలుత చిన్న చిన్న టాస్క్‌లు అప్పగించి చెల్లింపులు జరుపుతారు. ఆ తర్వాత నెమ్మదిగా అధిక మొత్తంలో చెల్లిస్తామంటూ టాస్క్‌లను కేటాయిస్తారు. అయితే ఈసారి ముందస్తుగా భారీగా డిపాజిట్ చేయాలని కోరతారు. ఇక్కడే బాధితులు మోసపోతున్నారు. డిపాజిట్లు వసూలు చేసుకున్నాక నేరగాళ్లు పత్తా లేకుండా పోతున్నారు.

బ్యాంకర్ల పేరుతో..

నేరగాళ్లు 'ఏఐ' చాటున స్పూఫింగ్ ద్వారా బ్యాంకులు/ప్రభుత్వ ఏజెన్సీల నుంచి మెసేజ్ కాల్ వస్తున్నట్టు చిత్రీకరిస్తున్నారు. బ్యాంకు ప్రతినిధిగా నటిస్తూ క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు సేకరించి ఫోన్ మాట్లాడుతుండగా ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరిపి మోసాలకు పాల్పడుతున్నారు.

లైక్ చేస్తే అంతే..

యూట్యూబ్ టాస్క్‌లు, వాట్సాప్‌కు వచ్చే లింక్‌లను లైక్ చేస్తే సదరు యూజర్ డేటా మొత్తం సైబర్ నేరగాళ్లకు చేరిపోతుంది. ఫేస్‌బుక్‌లో యూజర్ ప్రొఫైల్‌ను బట్టి రకరకాల మోసపూరిత ఆఫర్లతో ప్రలోభపెడతారు. ఆ లింక్‌లపై క్లిక్ చేసి నగదు చెల్లిస్తే వస్తువులు డెలివరీ కావు. కొన్నిసార్లు అశ్లీలతను జొప్పించి ట్రాప్ చేసే అవకాశముంది.

ఆ కాల్స్ బ్లాక్ చేయండి

వాట్సాప్‌లో అవాంఛిత, అంతర్జాతీయ కోడ్‌లతో ఫోన్లు వస్తే తిరస్కరించాలి. ఎటువంటి లింక్‌లపై క్లిక్ చేయకూడదు. సైబర్ మోసాలకు గురైన బాధితులు నేషనల్ పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలి.

– అమిత్ బర్దార్, ఎస్పీ, సైబర్ క్రైమ్

'జోసా'లో సీట్ల జోష్

ఐఐటీ, ఎన్ఐటీలలో భారీగా పెరిగిన సీట్లు

- ఐదేళ్లలో అదనంగా 18 వేలకు పైగా పెరుగుదల
- 2019లో ఐఐటీ, ఎన్ఐటీ తదితరాల్లో మొత్తం సీట్లు 38,704 మాత్రమే
- 2023 నాటికి జోసాలో 56,900 సీట్లు అందుబాటులోకి..
- 2020లో 50,822కు సీట్ల సంఖ్యను పెంచిన కేంద్రం
- కొత్త ఐఐటీలు, ఎన్ఐటీల ఏర్పాటుతో పెరిగిన సీట్లు
- మహిళలకు 20 శాతం సూపర్ న్యూమరరీ కోటా కూడా..
- ఆ తర్వాత నుంచి ఏటా అదనంగా రెండేసి వేల చొప్పున పెంపు



సాక్షి, అమరావతి: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) తదితర జాతీయ స్థాయి విద్యాసంస్థలలో సీట్ల సంఖ్య భారీగా పెరగడంతో విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్యావకాశాలు మరింత మెరుగవుతున్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీలతో పాటు ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే జీఎఫ్టీఐలలో 56,900ల వరకు సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీలలో సీట్ల కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన ప్రాథమిక కసరత్తును చేపట్టింది. జూన్ 19 నుంచి ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్ల భర్తీ ప్రక్రియను చేపట్టనుంది.

ఐదేళ్లలో 18వేలకు పైగా పెరిగిన సీట్లు

గడచిన ఐదేళ్లలో ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీల్లో సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతుండడం, యువతకు ఉపాధి మార్గాలు అత్యధికంగా అందులోనే లభిస్తుండడం వంటి కారణాలతో సాంకేతిక విద్యకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. 2019కు ముందువరకు ఈ సంస్థల్లో సీట్ల సంఖ్య నామమాత్రంగానే ఉండడంతో ఉన్నత ప్రమాణాలు గల సాంకేతిక నిపుణుల అందుబాటూ అంతంత మాత్రంగానే ఉండేది. ఈ విద్యకోసం ఏటా దాదాపు 8లక్షల మంది విద్యార్థులు వివిధ దేశాలకు వెళ్లేవారు. ఇందుకు లక్షలాది రూపాయలను వారు వెచ్చించాల్సి వచ్చేది. దీన్ని నివారించి దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను వారికి అందుబాటులోకి తెచ్చేలా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. 2024 నాటికి ఐఐటీ తదితర జాతీయ విద్యాసంస్థల సంఖ్యను పెంచడంతో పాటు సీట్ల సంఖ్యను 50% మేర పెంచేలా చర్యలు తీసుకుంది. అలాగే, 20 ప్రముఖ ఐఐటీ, ఇతర సంస్థలను ఇని స్టిట్యూట్స్ ఆఫ్ ఎమినెన్స్ (ఐఓఈ)లుగా తీర్చిదిద్ది అత్యధిక నిధులు కేటాయించింది.

మహిళలకు 20 శాతం కోటా..

ఇక ఐఐటీల్లో మహిళల చేరికలు నామమాత్రంగా ఉండడంతో వారి సంఖ్యను పెంచేందుకు వీలుగా అన్ని ఐఐటీల్లో 2018–19 నుంచి 20% మేర అదనపు కోటాను పెంచి సూపర్ న్యూమరరీ సీట్లను కేంద్రం ఏర్పాటుచేయించింది. మూడేళ్లపాటు దీన్ని తప్పనిసరిగా అన్ని సంస్థల్లో కేంద్రం కొనసాగించింది. దీంతో 2021 నాటికే ప్రముఖ ఐఐటీల్లో మహిళల చేరికలు 20 శాతానికి పైగా పెరిగాయి. తరువాత మహిళలకు సూపర్ న్యూమరరీ సీట్లపై ఆయా ఐఐటీలే నిర్ణయం తీసుకునేలా చేసింది.

సంస్థలు, సీట్ల సంఖ్యను పెంచిన కేంద్రం

ఇదిలా ఉండగా.. డీపీ సింగ్ ఇచ్చిన నివేదిక మేరకు కేంద్ర ప్రభుత్వం ఐఐటీలు, ఎన్ఐటీలు ఇతర సంస్థలు, సీట్ల సంఖ్యను 2020లో ఒక్కసారిగా పెంచింది. 2019లో దేశవ్యాప్తంగా ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో, జీఎఫ్టీఐలలో 38,704 సీట్లు ఉండగా దాన్ని 2020లో ఒకేసారి 50,822కు పెంచింది. వివిధ రాష్ట్రాల్లో కొత్త విద్యాసంస్థల ఏర్పాటుతో పాటు అప్పటికే ఉన్న ఐఐటీ, ఎన్ఐటీల్లో సదుపాయాలను మెరుగుపరచి సీట్ల సంఖ్యను పెంచింది. ఆ తరువాత కూడా ఏటేటా అయా సంస్థల్లో రెండేసి వేల చొప్పున సీట్లను పెంచుకునేలా చేసింది. 2021లో 52,453 సీట్లు, 2022లో 54,477 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 2024 నాటికి 50 శాతం మేర సీట్లు పెంచాలన్న లక్ష్యం మేరకు 2023–24లో కూడా సీట్ల సంఖ్య పెరిగి 56,900 వరకు అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు.

ఈసారీ జోసా కటాఫ్ స్కోర్..

ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల ప్రక్రియను జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) చేపడుతుంది. జేఈఈ మెయిన్, అడ్వాన్సుడ్‌లో అత్యధిక స్కోరుతో మెరిట్ ర్యాంకులు సాధించిన వారికి వీటిల్లో ప్రవేశాలు కల్పిస్తారు. 2023 ప్రవేశాలకు సంబంధించి జేఈఈ మెయిన్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, జనవరి, ఏప్రిల్ నెలల్లో పూర్తిచేసి ఇటీవల తుది ర్యాంకులను కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. మెయిన్‌లో అర్హత సాధించిన టాప్ 2.5 లక్షల మందికి జేఈఈ అడ్వాన్సుడ్‌ను నిర్వహించనున్నారు. అడ్వాన్సుడ్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 30 నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ దరఖాస్తులను మే 7 వరకు స్వీకరిస్తారు. జూన్ 4న జేఈఈ అడ్వాన్సుడ్ పరీక్ష జరుగుతుంది. ఈ ఫలితాలు జూన్ 18న విడుదలవుతాయి. అనంతరం జూన్ 19 నుంచి జోసా రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయి. ఈసారి కూడా గతంలో మాదిరిగానే ఆరు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించే అవకాశముందని తెలుస్తోంది. ఇందుకు జోసా కటాఫ్ ర్యాంకులు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

2022లో జోసాలో పాల్గొన్న సంస్థల్లోని సీట్లు ఇలా.. (మహిళల అదనపు కోటాతో కలిపి)

కేటగిరీ	ఐఐటీ	ఎన్ఐటీ	ఐఐఐటీ	జీఎఫ్టీఐ
ఓపెన్	6,383	9,178	2,822	3,149
ఓపెన్ పీడబ్ల్యూడీ	346	469	129	171
జనరల్ ఈడబ్ల్యూఎస్	1,568	2,264	658	640
జనరల్ ఈడబ్ల్యూఎస్ పీడబ్ల్యూడీ	84	133	30	33
ఎస్సీ	2,370	3,366	1,006	922
ఎస్సీ పీడబ్ల్యూడీ	122	190	49	51
ఎస్టీ	1,179	2,032	512	557
ఎస్టీ పీడబ్ల్యూడీ	61	106	18	27
ఓబీసీ	4,259	5,939	1,810	1,155
ఓబీసీ పీడబ్ల్యూడీ	226	317	92	54
మొత్తం సీట్లు	16,598	23,994	7,126	6,759

సంప్రదాయబద్ధంగా 'ఇంద్ర' పతాకావిష్కరణ

- రాజశ్యామల యజ్ఞ నిర్వహణలో కీలక ఘట్టం పూర్తి
- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి దంపతులు



ఇంద్ర పతాకావిష్కరణ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర సంక్షేమం, సర్వతోముఖాభివృద్ధి కోసం, సీఎం వైఎస్ జగన్ సర్కారు అమలుచేస్తున్న సంక్షేమ పాలన మరింత బలోపేతం కావాలని కాంక్షిస్తూ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిమిత్తం ఆదివారం ఇంద్ర పతాకావిష్కరణ ఘనంగా జరిగింది. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు ధ్వజానికి పూజలు నిర్వహించి యజ్ఞ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేశారు. యజ్ఞ నిర్వహణలో ఇదో కీలక ఘట్టమని.. ఈ పతాకావిష్కరణ అనంతరమే హోమ కుండాల ఏర్పాటు, అందుకు అవసరమైన ద్రవ్యాలు సమకూర్చుకోవడం తదితర ముఖ్య కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వేద పండితులు వివరించారు. యజ్ఞ కార్యక్రమం సజావుగా పూర్తికి, ఇంద్రుని ప్రసన్నం చేసుకోవడానికి.. ఆయన ఆశీస్సులు పొందేందుకు ఈ పతాకావిష్కరణ నిర్వహణ అన్నది సంప్రదాయంగా కొనసాగే ప్రక్రియ అని వారు తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఉ.5 గంటలకు యజ్ఞం ప్రారంభమవుతుందని వెల్లడించారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాబును చూసి రైతులు నవ్వుకుంటున్నారు

అనంతరం, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. సీఎంగా ఉన్నప్పుడు రైతుల బాగోగులు ఏమీ పట్టించుకోని టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పుడు ఆయన రాజకీయాలకు అకాల వర్షాలు ఒక సాకుగా దొరికాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వస్తుంటే రైతులు నవ్వుకుంటున్నారన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండి వ్యవసాయం దండగ అన్నారని.. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడాన్ని ఎగతాళి చేశారని గుర్తుచేశారు. 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్నప్పుడు ఆయన రైతులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకి ఏ కష్టమొచ్చినా సీఎం జగన్ ప్రభుత్వం ఆదుకుంటోందని, రైతుల తరఫున ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టి వారికి బీమా ఇప్పించే బాధ్యతను తీసుకుంటున్నామని చెప్పారు. తమ ప్రభుత్వ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో నష్టపోయిన రైతాంగానికి అదే సీజన్‌లో చంద్రబాబు ఎప్పుడైనా నష్టపరిహారం ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. అందువల్ల చంద్రబాబుకి రైతులను పరామర్శించే అర్హతలేదన్నారు.

కోటి మహిళల కాంతి

- విద్యుత్ పొదుపులో కోటి మంది మహిళల భాగస్వామ్యం
- రాష్ట్రంలోని పాఠశాలల్లో ఎనర్జీ క్లబ్ ల ఏర్పాటు
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు బీఈఈ ప్రశంసలు



అభయ్ బాక్రే

సాక్షి, అమరావతి: విద్యుత్ పొదుపు ఉద్యమంలో ఏపీలోని కోటి మంది స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేసేందుకు ఇంధన శాఖ రూపొందించిన ప్రణాళికపై బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే ప్రశంసలు కురిపించారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ అధికారులతో ఆదివారం జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్ఈఆర్పీ), విద్యా శాఖ మద్దతుతో రాష్ట్రంలోని 150కి పైగా పాఠశాలల్లో ఎనర్జీ క్లబ్‌ల ద్వారా విద్యార్థులను విద్యుత్ పరిరక్షణ, సమర్థ వినియోగం వంటి కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేస్తోన్న ఏపీ చర్యలను బాక్రే అభినందించారు. ఏపీలో బిల్డింగ్, ఇండస్ట్రీ, ఎంఎస్ఎంఈ, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, ఉద్యోగులు, రైతులు, సాధారణ ప్రజలు విద్యుత్ పొదుపు ఉద్యమంలో పాల్గొనడం శుభపరిణామమని కొనియాడారు. పాఠశాలల్లోని ఎనర్జీ క్లబ్‌ల్లో అవగాహన కార్యకలాపాలను అమలు చేయడానికి నోడల్ అధికారిని నామినేట్ చేయాలని ఇంధన శాఖను కోరారు. నీటి సంరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, స్థిరమైన ఆహార వ్యవస్థ, స్వచ్ఛతా చర్యలు, ఆరోగ్యకరమైన జీవనశైలి, ఈ–వ్యర్థాల తగ్గింపు అనే విభాగాల్లో ప్రచారం కల్పించడం ద్వారా వాతావరణంలో 2028 నాటికి 50% కర్బన ఉద్గారాలను తగ్గించాలనేది లక్ష్యమని తెలిపారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యే లక్ష్యం

▶ మొదటి పేజీ తరువాయి

భారీగా పెరుగుతోంది. 2018–19లో చంద్రబాబు హయాంలో సెకండరీ విద్యలో (9వ తరగతి నుంచి 10వ తరగతి వరకు) చేరికలు బాగా తక్కువగా ఉండగా, సీఎం జగన్ హయాంలో 2019–20 నుంచి ఏటేటా పెరుగుతూ 2022–23 నాటికి 89.63 శాతానికి పెరిగాయి. 2018–19లో చంద్రబాబు హయాంలో పదవ తరగతి తర్వాత ఇంటర్ విద్యను అభ్యసించడానికి చేరిన వారి సంఖ్య కేవలం 46.88 శాతమే. సీఎం జగన్ హయాంలో 2019–20 నుంచి ఆ సంఖ్య ఏటేటా పెరుగుతూ 2022–23 నాటికి 69.87 శాతానికి చేరింది.

ప్రతి దశలో పర్యవేక్షణ

- పిల్లలు టెన్త్ తర్వాత ఇంటర్.. ఆ తర్వాత డిగ్రీ అభ్యసించడానికి ప్రధాన కారణం ప్రస్తుత ప్రభుత్వ చర్యలే. అందరినీ బడిబాట పట్టించడంతో పాటు డిగ్రీలు చదివేలా సూక్ష్మ స్థాయిలో ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోంది. టెన్త్ పాస్ అయిన విద్యార్థులందరూ తదుపరి ఉన్నత విద్యలో చేరుతున్నారా లేదా అనే విషయాన్ని వలంటీర్ల ద్వారా సర్వే చేయిస్తోంది. ఇందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఆ యాప్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తోంది.
- ఈ సర్వేను మరింత పకడ్బందీగా నిర్వహించడంలో భాగంగా ప్రత్యేక ఫార్మెట్ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించాలని చెప్పారు. వలంటీర్ల ద్వారా సర్వే కచ్చితంగా ఉండేలా కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.
- 2004 సెప్టెంబర్ 1 నుంచి 2006 ఆగస్టు 31 వరకు పుట్టిన వారి ఆధారంగా 9వ తరగతి, పదో తరగతి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌ను గణించాలని, 2006 సెప్టెంబర్ 1 నుంచి 2008 ఆగస్టు 31 వరకు పుట్టిన వారి ఆధారంగా ఉన్నత విద్య గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ గణించాలని,ఇందు కోసం జనాభా జాతీయ కమిషన్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ జనాభా అంచనాపై విడుదల చేసిన నివేదికను పరిగణలోకి తీసుకోవాలని సీఎస్ చెప్పారు.

ఆ ఆరు పథకాల వల్లే విద్యా ప్రగతి

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో అద్భుత పురోగతి సాధించిందని నాబార్డు ప్రశంసించింది. 2023–24 రాష్ట్ర ఫోకస్ పత్రంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివేలా ఆరు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, దీంతో ప్రాథమిక విద్య నుంచి సెకండరీ, ఉన్నత విద్యలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో భారీగా పెరిగిందని పేర్కొంది. విద్యా రంగంలో అమలు చేస్తున్న మార్గదర్శక కార్యక్రమాల ప్రభావం ప్రతిబింబించిందని తెలిపింది. మన బడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ స్కూళ్ల రూపు రేఖలు మారుస్తూ మౌలిక వసతులను కల్పిస్తోందని చెప్పింది. 94.56 శాతం పాఠశాలల్లో కరెంటు, తాగునీరుతో సహా మౌలిక సదుపాయాలున్నాయని, నూరు శాతం శిక్షణ పొందిన ఉపాధ్యాయులున్నారని పేర్కొంది. ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేలా రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోందని చెప్పింది. జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద, నాడు–నేడు పథకాలు.. విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడానికేనని స్పష్టం చేసింది. ఏపీ జనాభాలో కేవలం 2% కంటే తక్కువ మంది పిల్లలే పాఠశాల విద్యకు దూరమైనట్లు 2021 డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ రిపోర్ట్ పేర్కొందని వివరించింది.

2018-19 నుంచి 2022-23 వరకు ఉన్నత విద్యలో (ఇంటర్) జీఈఆర్ రేషియో పెరుగుదల శాతం

ఆర్థిక సంవత్సరం	గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్)
2018-19	46.88
2019-20	52.19
2020-21	53.37
2021-22	56.70
2022-23	69.87

2022లో సర్వే ఇలా..

2022లో 5,38,038 లక్షల మంది టెన్త్ పాస్ అవ్వగా, వారిలో 4,94,702 మంది తదుపరి కోర్సుల్లో చేరారని వలంటీర్ల సర్వే ద్వారా గుర్తించారు. మిగతా 43,336 మంది ఆరోగ్య సమస్యలు, అకడమిక్ సమస్యలు, వివాహం, ప్రత్యేక అవసరాలు తదితర కారణాల వల్ల తదనంతర కోర్సుల్లో చేరలేదని తేల్చారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ఇతరత్రా సౌకర్యాలు వివరించి వీరిలో కొందరిని తదనంతర కోర్సుల్లో చేర్చారు. ఇకపై ఇలాంటి వారి సంఖ్య ఇంకా తగ్గించేందుకు వలంటీర్ల సర్వేను మరింత శాస్త్రీయంగా చేపట్టనున్నారు.

నాణ్యమైన ఉన్నత విద్యే లక్ష్యం

ఉన్నత విద్యలో చేరికలను మరింతగా ప్రోత్సహించేలా ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. టెన్త్ పాస్ అయిన విద్యార్థులందరూ ఐటీఐ, పాలిటెక్నికల్ లేదా రెగ్యులర్ ఇంటర్ కోర్సుల్లో చేరేలా పర్యవేక్షించాలి. ఏ కోర్సులోనూ చేరని విద్యార్థులుంటే వారిని తదుపరి కోర్సుల్లో చేర్పించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. నాణ్యమైన ఉన్నత విద్యకు సీఎం జగన్ ఏ విధంగా అండగా నిలుస్తున్నారో వారికి వివరించాలి. ఈ విషయాల్లో కలెక్టర్లు చొరవ తీసుకోవాలి.

– ఇటీవల ఉన్నత స్థాయి సమీక్షలో సీఎస్ జవహర్‌రెడ్డి

ఇదీ మార్పు అంటే..

వెల్లటూరులో మారిన బతుకు చిత్రం

వెలుగులు నింపిన 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం

పాకల్లోకి పందులు..



ఇదే కాలనీలో కంతేటి పైడమ్మకు కూడా ఇల్లు మంజూరైంది. ఆమె కుటుంబం కూడా కొన్ని దశాబ్దాలు కాలువ గట్లపైనే మగ్గింది. ఆ కుటుంబానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సొంత ఇంటిని సమకూర్చింది. ప్రతి నెలా ఒకటో తేదీనే పైడమ్మ ఇంటి వద్దే పెన్షన్ అందుకుంటోంది. మీ బతుకు చిత్రంలో ఎలాంటి మార్పు వచ్చిందని పైడమ్మను ప్రశ్నిస్తే ఆమె కళ్లు చెమర్చాయి. 'ఒకప్పుడు కాలువ పక్కన జంతువులతో కలిసి జీవించాం. పని కోసం బయటికి వెళితే పందులు మా పాకల్లోకి దూరి వండుకున్న అన్నం తినేసి కకావికలం చేసిన ఘటనలు కోకొల్లలు. ఆ జీవితం పగోడికి కూడా రాకూడదని దేవుడిని కోరుకుంటా. ఎంత కష్టం చేసినా మేం గజం స్థలం కూడా కొనలేం. అలాంటిది ఈ రోజు మాకంటూ సొంతిల్లు ఉందంటే సీఎం జగన్ చలువే' అని పైడమ్మ చెప్పింది.

(వడ్డే బాలశేఖర్ – వెల్లటూరు వైఎస్సార్, జగనన్న కాలనీ నుంచి సాక్షి ప్రతినిధి)

రూ.లక్ష కోట్లు.. 30 లక్షల మందికిపైగా సొంతింటి యోగం! ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాల కోసం దేశంలోనే తొలిసారిగా భారీ మొత్తంలో వ్యయం చేస్తూ లక్షల మంది అక్క చెల్లెమ్మల ఆకాంక్షలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెరవేరుస్తోంది. వైఎస్సార్ జగనన్న కాలనీల రూపంలో ఏకంగా 17 వేలకు పైగా ఊర్లను, లక్షల్లో గృహాలను నిర్మిస్తోంది. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇప్పటివరకూ రెండు దశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి (టిడ్కో ఇళ్లతో కలిపి) అనుమతులిచ్చింది. ఇందులో 3.40 లక్షల గృహాల ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. 4.67 లక్షల ఇళ్లు రూఫ్ లెవల్ పై దశలో నిర్మాణంలో ఉన్నాయి. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చకచకా నీటి సదుపాయం, కరెంట్ కనెక్షన్లను ప్రభుత్వం సమకూరుస్తోంది.

రూపాయి ఖర్చు లేకుండా..

అద్దెలు కట్టలేక దశాబ్దాల పాటు కాలువ గట్లపై పాకల్లో మగ్గిపోయిన నిరుపేద కుటుంబాలు వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సంతోషంగా జీవిస్తున్నాయి. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా బాపట్ల జిల్లా వెల్లటూరులో రూ.96 లక్షలతో 3.18 ఎకరాలను సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం 115 ప్లాట్లు లబ్ధిదారులకు అందించింది. 28 మంది ఎస్సీలు, 85 మంది ఎస్టీలు, ఒక బీసీ కుటుంబానికి ఇళ్ల స్థలాలను కేటాయించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున నగదు అందచేసింది. అయితే ప్రభుత్వం స్థలంతోపాటు నిర్మాణానికి బిల్లులు ఇచ్చినప్పటికీ సొంతంగా ఇంటిని నిర్మించుకోలేని దీనస్థితిలో ఈ కుటుంబాలు ఉండటంతో విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ (వీఆర్‌వో) ముందుకొచ్చి చేయూత అందించింది. దీంతో నిరుపేదలు ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేకుండా ఇళ్లు సిద్ధమయ్యాయి. స్థలాల మంజూరు, నిర్మాణ బిల్లులు, లేఅవుట్లలో రోడ్లు, మంచినీరు, కరెంట్ సరఫరా లాంటి కనీస వసతుల కల్పన కోసం ఈ ఒక్క లేఅవుట్‌కు రూ.7.46 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. నిరుపేదలకు పక్కా ఇంటిని సమకూర్చడం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.6.73 లక్షల మేర లబ్ధి చేకూర్చింది.



వెల్లటూరులో సకల సౌకర్యాలతో వైఎస్సార్ జగనన్న కాలనీల్లోని ఇళ్లు





వెల్లటూరులో ముురుగు చెంతే నివాసాలు

పేదల ఇళ్ల కోసం వ్యయం ఇలా

- 30.25 లక్షల మందికి 71,811.49 ఎకరాల్లో ఇళ్ల స్థలాల పంపిణీకి రూ.56,102.91 కోట్లు
- వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సదుపాయాల కల్పన కోసం రూ.36,026 కోట్లు (తాత్కాలిక సదుపాయాలకు రూ.3,117 కోట్లు, శాశ్వత సదుపాయాల కోసం రూ.32,909 కోట్లు)
- లబ్ధిదారులకు ప్రభుత్వ వాటా కింద చెల్లింపులు, ఇతర రాయితీల రూపంలో ప్రయోజనం రూ.13,758 కోట్లు

శాశ్వత సదుపాయాల వ్యయం ఇలా రూ.కోట్లలో

నీటి సరఫరా	4,128
విద్యుత్, ఇంటర్నెట్	7,989
డ్రైనేజీ, సీవరేజ్	7,227
రోడ్లు, ఆర్చ్‌లు	10,251
పట్టణ ప్రాంత లేఅవుట్లలో వసతుల కల్పన	3,314

అటు ఇల్లు.. ఇటు చదువులు

నా భర్త కూలి పనులకు వెళ్తే రోజుకు రూ.500 వరకూ వస్తుంది. పిల్లలతో ఇబ్బంది పడుతూ పూరి గుడిసెల్లోనే జీవించాం. ఇప్పుడు ప్రభుత్వం మాకు పక్కా ఇంటిని సమకూర్చడంతోపాటు నా బిడ్డ చదువుకు కూడా సాయం చేస్తోంది.

– జ్యోతి, వైఎస్సార్ జగనన్న కాలనీ, వెల్లటూరు



నాడు కాలువకట్టపై ఉన్న తమ పూరిగుడిసె ముందు భర్త శ్రీనివాసరావుతో జ్యోతి

నేను, చెల్లి ఆడుకుంటున్నాం

మేం గుడిసెలో ఉన్నప్పుడు చుట్టూ ఎప్పుడు బురదే. దోమలు విపరీతంగా కుట్టేవి. వర్షం పడితే గుడిసెలోకి నీళ్లు వచ్చేవి. పైనుంచి వర్షం కారేది. అమ్మానాన్న నన్ను, చెల్లిని ఒళ్లో పడుకోబెట్టుకునే వాళ్లు. ఇప్పుడు కొత్త ఇంట్లోకి వచ్చాం. ఎంత వర్షం వచ్చినా ఇబ్బంది లేదు. ఇక్కడ అంతా బాగుంది. నేను చెల్లి బాగా ఆడుకోగలుగుతున్నాం.

– వెంకట్‌నాథ్ (జ్యోతి కుమారుడు)



నేడు వైఎస్సార్ జగనన్న కాలనీలోని మిద్దె ఇంటి ముందు.. కుమారుడు, కుమార్తెతో జ్యోతి

తరతరాల దుస్థితికి తెర



మా పూర్వీకులు, మేం పూరి గుడిసెల్లోనే పుట్టాం. అక్కడే పెరిగాం. తరతరాలుగా పూరి గుడిసెల్లోనే జీవిస్తున్నాం. మా పిల్లల సగం జీవితం కూడా వాటిల్లోనే గడిచింది. సీఎం జగన్ మా కోసమే ఇళ్ల పథకం తెచ్చినట్లున్నారు. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేశారు. మాతో పాటు మా ఇద్దరు బిడ్డలకు వేర్వేరుగా మూడు ఇళ్లు వచ్చాయి.

– తుమ్మ రాముడు, లక్ష్మి, వైఎస్సార్ జగనన్న కాలనీ, వెల్లటూరు

పక్కా ఇల్లు.. పెన్షన్



నా వయసు 60 పైనే ఉంటుంది. ఇన్నేళ్లలో నాకు, నా పిల్లలకు ఓ చిరునామా అంటూ లేదు. సీఎం జగన్ మాలాంటి వాళ్ల గోడును ఆలకించి పక్కా ఇళ్లను నిర్మించి ఇచ్చారు. ఇవాళ మాకు పక్కా ఇల్లు, శాశ్వత చిరునామా ఉంది.

– ఇళ్ల సాంబ్రాజ్యం, వైఎస్సార్, జగనన్న కాలనీ, వెల్లటూరు

భావి తరానికి విలువైన స్థిరాస్తి



పూరిపాకల్లో బతికిన మాకు ఇది కొత్త జీవితమే. మురికి కుంటల్లో మగ్గిపోతున్న మా తలరాతలను సీఎం జగన్ మార్చారు. పెద్దల నుంచి మాకు ఎటువంటి ఆస్తులు రాలేదు. మా పిల్లలకు విలువైన ఈ ఇంటిని ఆస్తిగా అందిస్తాం.

– కలగంటు జ్యోతి, వైఎస్సార్, జగనన్న కాలనీ, వెల్లటూరు

సోషల్ మీడియా 'కట్'.. వినోదానికే 'నెట్'..

- నెట్టింట పెరుగుతున్న ఆన్‌లైన్ షాపింగ్
- సామాజిక మాధ్యమాల పట్ల క్రమంగా తగ్గుతున్న ఆసక్తి
- సమాచార సాధనంగా 77శాతం మంది వినియోగం
- ఇంటర్నెట్ వినియోగదారుల అభిరుచులు ఇవే
- ఇండియా ఇంటర్నెట్ నివేదిక-2022 వెల్లడి



75.90 కోట్లు 2022, డిసెంబర్ నాటికి దేశంలో ఇంటర్నెట్ వినియోగదారులు

90 కోట్లు ఇండియా ఇంటర్నెట్ నివేదిక ప్రకారం 2025 నాటికి పెరగనున్న వినియోగదారులు

85% వినోదం కోసం ఇంటర్నెట్ వినియోగించేవారు

78% 2021లో సోషల్ మీడియా కోసం...

70% 2022లో సోషల్ మీడియా కోసం...

భారీగా పెరుగుతున్న వినియోగదారులు

ప్రపంచంలో ఇతర దేశాల కంటే భారత్‌లో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య అత్యధికంగా పెరుగుతోంది. 2022 డిసెంబర్ నాటికి దేశంలో 75.90 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారు. అంటే దాదాపు సగం మంది ఏదో ఒక రీతిలో దీనిని వినియోగిస్తున్నారు. 2021 కంటే 2022లో ఇంటర్నెట్ వినియోగదారులు 10శాతం పెరిగారు. 2025 నాటికి ఈ సంఖ్య 90 కోట్లకు పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది.



సాక్షి, అమరావతి: దేశంలో అత్యధిక వినియోగదారులు ఇంటర్నెట్‌ను వినోద మాధ్యమాలను వీక్షించేందుకే ఉపయోగిస్తున్నారు. వారు వినోదమే ప్రధానం అంటున్నారు. సోషల్ మీడియా పట్ల వారిలో నెమ్మదిగా ఆసక్తి సన్నగిల్లుతోంది. అదే సమయంలో ఆన్‌లైన్ షాపింగ్ కోసం ఇంటర్నెట్ వినియోగం క్రమంగా పెరుగుతోంది. మరోవైపు.. దేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య అమాంతంగా పెరుగుతుండటం మార్కెట్‌పై ప్రభావం చూపుతుందన్నది స్పష్టమవుతోంది. 'ఇండియా ఇంటర్నెట్ రిపోర్ట్-2022' నివేదిక భారతీయుల ఇంటర్నెట్ వినియోగ అభిరుచి గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఆ వివరాలు..

ముందు వినోదం.. ఆ తర్వాతే సమాచారం

దేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల అభిరుచుల్లో గణనీయమైన మార్పులు వస్తున్నాయి. అత్యధికులు వినోదం కోసమే దానిని వినియోగిస్తున్నారు. మొత్తం వినియోగదారుల్లో 85 శాతం మంది వినోదం కోసమే నెట్‌ను ఉపయోగిస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. టీవీ చానళ్లు, యూట్యూబ్ చానళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్, క్రీడా కార్యక్రమాల వీక్షణం మొదలైన వాటికే ఇంటర్నెట్‌ను అత్యధికంగా వినియోగిస్తున్నారు. అంతేకాక..

- వినోదం తరువాత రెండో స్థానంలో అత్యధికులు సమాచార సాధనంగా ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. 77శాతం మంది వాట్సాప్, ఫోన్‌కాల్స్, వెబ్‌సైట్లు, తమ ఆఫీసు వ్యవహారాల కోసం ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్నారు.
- 2022లో ఇంటర్నెట్ వినియోగదారుల్లో వచ్చిన గణనీయమైన మార్పు సోషల్ మీడియాపై ఆసక్తి సన్నగిల్లడం. 2021లో 78శాతం మంది సోషల్ మీడియా కోసం ఇంటర్నెట్‌ను వినియోగించేవారు. అదే 2022 నాటికి అది 70 శాతానికి పడిపోయింది. ఇప్పటికీ మొత్తం వినియోగదారుల్లో సోషల్ మీడియా కోసం ఇంటర్నెట్‌ను వినియోగించే వారు మూడో స్థానంలో ఉన్నారు.
- ఇక వాణిజ్య, వ్యాపార లావాదేవీల కోసం ఇంటర్నెట్ వినియోగించే వారు 52% మంది. 2021 కంటే వాణిజ్య అవసరాల కోసం ఇంటర్నెట్ వినియోగించే వారు 14% మంది పెరిగారు. వీరిలో పట్టణ, నగర ప్రాంతాలకు చెందిన వారు 65% మంది.
- ఇక దేశంలో ఆన్‌లైన్ షాపింగ్ పట్ల వినియోగదారుల ఆసక్తి క్రమంగా పెరుగుతోందని ఈ నివేదిక వెల్లడించింది. ఇంటర్నెట్ వినియోగదారుల్లో 34 శాతం మంది ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్ కోసం ఇంటర్నెట్‌ను ఉపయోగించే వారు 2021 కంటే 2022లో 19 శాతం మంది పెరిగారు.
- ఇక ఇంటర్నెట్ వినియోగదారుల్లో 61% మంది పట్టణ, 31% మంది గ్రామీణ ప్రాంతాల నుంచి ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు.

వైభవంగా వసంతోత్సవం



ముగిసిన చినవెంకన్న బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో చిన వెంకన్న వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఆదివారం విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం స్వామివారి కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు అర్చకులు పూజాదికాలు చేశారు. స్వామి, అమ్మవార్లకు వసంతాలను సమర్పించి, చూర్ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారిని కీర్తిస్తూ అర్చకులు, మహిళా భక్తులు వడ్లను దంచారు. అనంతరం రాజాధిరాజ వాహనంపై శ్రీవారికి తిరువీధి సేవను నిర్వహించి, భక్తులకు వసంతాలను అందజేశారు.

ద్వాదశ కోవెల ప్రదక్షిణలు

రాత్రి ఉభయ దేవేరులతో శ్రీవారికి ఆలయంలో 12 ప్రదక్షిణలు, 12 సేవా కాలాలు, 12 రకాల పిండి వంటలతో నివేదనలు జరిగాయి. ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో సేవా కాలాన్ని నిర్వహించారు. అలాగే ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో రకం పిండివంటను ఆరగింపుచేసి స్వామికి హారతులిచ్చారు. అనంతరం శ్రీపుష్ప యాగోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ వేడుకలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

శయన మహావిష్ణువుగా..

శేషపాన్పుపై పవళించిన శ్రీమహావిష్ణువుకు శ్రీదేవి, భూదేవిలు సేవలు చేస్తున్నట్టుగా శయన మహావిష్ణువు అలంకరణలో శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక అలంకరణలు కూడా ముగిశాయి.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడి మృతి

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన వ్యాను

వీరులపాడు(నందిగామ): బైక్, మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో తండ్రి, కుమారుడు మృతిచెందారు. ఈ దుర్ఘటన ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం అల్లూరు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన సయ్యద్ ఖాదర్ (55) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తెలంగాణలోని ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు పెద్ద కుమారుడు జానీబాషా (25)తో కలిసి ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామం నుంచి స్కూటీపై బయలుదేరారు. ఈ క్రమంలో అల్లూరు గ్రామ సమీపంలో ఎర్రుపాలెం వైపు నుంచి అతివేగంగా వచ్చిన మినీ వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఖాదర్‌కు తీవ్ర గాయాలవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జానీబాషా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించటంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న సిబ్బంది జానీబాషాను విజయవాడ తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి జానీబాషా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వ్యాన్ డ్రైవర్ మద్యం తాగి మితిమీరిన వేగంతో వాహనాన్ని నడపటం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఖాదర్‌కు ఇద్దరు కుమారులుండగా, పెద్ద కుమారుడు మృతి చెందాడు. మృతిచెందిన జానీబాషాకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. తండ్రి, కొడుకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. ఖాదర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ప్రకటించారు. నందిగామ ప్రభుత్వాస్పత్రిలో ఖాదర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ముక్కంటికి వెండి కిరీటం వితరణ



కిరీటం అందజేస్తున్న న్యాయమూర్తి సుధా

రేణిగుంట: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధా కుటుంబ సభ్యులతో కలిసి వెండి కిరీటం వితరణ చేశారు. దీనిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఫలించిన సీఎం జగన్ యత్నం

▶ మొదటి పేజీ తరువాయి

మొదటి విమానం (IMF HYD 0935/1235108 ఆంధ్రప్రదేశ్) హైదరాబాద్ బయలుదేరనుంది. అందులో 108 మంది విద్యార్థులను తీసుకురానున్నారు. రెండో విమానం (IMF CCU 1110/122049 ఆంధ్రప్రదేశ్) 11.10 గంటలకు కోల్‌కతా బయలుదేరనుంది. అందులో 49 మంది విద్యార్థులను తీసుకురానున్నారు. మణిపూర్‌లో చిక్కుకున్న మొత్తం 157 మంది విద్యార్థులను ఈ విమానాల్లో రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

విషయం తెలియగానే ముమ్మర కసరత్తు

మణిపూర్‌లో చెలరేగిన అల్లర్ల కారణంగా అక్కడ చిక్కుకుపోయిన రాష్ట్ర విద్యార్థులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్‌కు సహాయం కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్ కాల్స్ చేసి వివరాలు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు కంట్రోల్ రూమ్‌కు వచ్చిన సమాచారం మేరకు మణిపూర్‌లోని నిట్, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సుమారు 157 మంది రాష్ట్రానికి చెందిన విద్యార్థులు చదువుతున్నట్లు గుర్తించారు. మరోవైపు మణిపూర్‌లోని తెలుగు విద్యార్థులున్న కాలేజీల్లో ఒక్కో కాలేజీ నుంచి ఒక్కో విద్యార్థిని నోడల్ పాయింట్‌గా అధికారులు గుర్తించారు. వారి ద్వారా ఆయా కాలేజీల్లోని ఏపీకి చెందిన మిగిలిన విద్యార్థుల వివరాలు సేకరిస్తున్నారు. వీరందరినీ ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి తీసుకొచ్చి, వారి స్వగ్రామాలకు చేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి విద్యార్థులను విద్యాలయాల నుంచి ఎయిర్‌పోర్టుకు సురక్షితంగా చేర్చేలా ఏర్పాట్లు చేయాల్సిందిగా కోరుతూ మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్‌కు ఏపీ రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యనాథ్ దాస్ లేఖ రాశారు. అలాగే విద్యార్థులను సురక్షితంగా తీసుకురావడానికి ప్రత్యేక విమానం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి రాజీవ్ బన్సాల్‌కు కూడా లేఖ రాశారు. మణిపూర్ ప్రభుత్వంతోపాటు కేంద్ర పౌర విమానయాన శాఖ నుంచి సానుకూలంగా స్పందన వచ్చిందని, విద్యార్థులను తరలించడానికి ప్రత్యేక విమానం ఏర్పాటు చేయడానికి కేంద్రం అంగీకరించిందని అధికారులు వెల్లడించారు. ప్రత్యేక విమానం ఏర్పాటు కాగానే విద్యార్థులను సురక్షితంగా రాష్ట్రానికి తరలించనున్నారు. ఈ మేరకు ప్రత్యేక విమానాన్ని ఎన్ని గంటలకు ఏర్పాటు చేస్తామన్న సమాచారంతో పాటు ఏ విమానంలో తరలిస్తామన్నది తెలియజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఒకవైపు పౌర విమానయాన శాఖ అధికారులతో సంప్రదిస్తూనే ప్రయివేటు విమానయాన సంస్థలతోనూ అధికారులు మాట్లాడుతున్నారు. ప్రత్యేక విమానం ఏర్పాటుకు ఇండిగో విమానయాన సంస్థతో అధికారులు సంప్రదిస్తున్నారు. మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం కర్ఫ్యూను సోమవారం నుంచి కొన్ని గంటల పాటు సడలిస్తూ నిర్ణయం తీసుకుంది. నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయడానికి ఉదయం 5 గంటల నుంచి 8 వరకు కర్ఫ్యూను సడలిస్తున్నట్లు ప్రకటించింది.

చురుగ్గా ఏర్పాట్లు : మంత్రి బొత్స

మణిపూర్ నుంచి రాష్ట్ర విద్యార్థులను క్షేమంగా స్వస్థలాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. విజయనగరంలో ఆదివారం సాయంత్రం ఆయన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో అక్కడ మన విద్యార్థుల భద్రతకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, వారికి అండగా నిలిచేందుకు కోఆర్డినేటర్లను పంపామని చెప్పారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో హెల్ప్ లైన్ (88009 25668, 98719 99055) ఏర్పాటు చేశామన్నారు.

విమానాశ్రయానికి వచ్చేశా..



కల్యాణ్‌కుమార్




వేపాడ వెంకటేష్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో తాను మణిపూర్ నుంచి ఇంటికి బయలుదేరానని అక్కడ ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా పొలిచెర్లపాడుకు చెందిన విద్యార్థి కల్యాణ్‌కుమార్ తెలిపాడు. ఈ మేరకు ఆదివారం తన తండ్రి బి.ముసలయ్యకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. ప్రస్తుతం క్షేమంగా మణిపూర్‌లోని విమానాశ్రయానికి చేరుకున్నానని చెప్పాడు. కాగా, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం వాకపల్లికి చెందిన వేపాడ వెంకటేష్ అనే విద్యార్థి మణిపూర్‌లో పరిస్థితిపై ఆందోళన వ్యక్తంచేశాడు. అతను మణిపూర్‌లోని ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ ఫస్టియర్ చదువుతున్నాడు. తమకు సమీపంలో ఆందోళనకారులు భవనాలకు నిప్పు అంటించారని, ఓ జంటను హతమార్చారని స్థానిక విలేకరులకు ఫోన్ ద్వారా తెలిపాడు. తనతో పాటు యలమంచిలికి చెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి కౌశిక్, మరో 25 మంది ఉన్నారని, వెంటనే ఏపీకి తరలించే ఏర్పాట్లు చేయాలని కోరాడు.

మణిపూర్ నుంచి ఏపీ విద్యార్థులను తరలించండి

సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి, అమరావతి: మణిపూర్‌లో చదువుతున్న సుమారు 150 మంది ఏపీ విద్యార్థులను సురక్షితంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కోరారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌కు ఆయన ఆదివారం లేఖ రాశారు. మణిపూర్‌లో పరిస్థితి తీవ్రంగా ఉన్నందున తల్లిదండ్రులు విద్యార్థుల భద్రత గురించి ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. తాను కూడా మణిపూర్ ప్రభుత్వ సీనియర్ అధికారులతో మాట్లాడానని, వాణిజ్య విమానాలు లేదా ప్రత్యేక చార్టర్ విమానాల్లో తిరిగి వచ్చే విద్యార్థులందరినీ సురక్షితంగా తరలించడంలో సహాయం చేస్తామని వారు హామీ ఇచ్చారని తెలిపారు. విద్యార్థుల కోసం ఇంఫాల్ నుంచి విశాఖ, విజయవాడ లేదా తిరుపతికి చార్టర్ విమానాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

దుర్గగుడి దర్శన టికెట్లపై ఏసీబీ, విజిలెన్స్ నిఘా!



ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని దుర్గగుడిపై ఏసీబీ, విజిలెన్స్ విభాగాలు నిఘా పెట్టాయి. ముఖ్యంగా ఇటీవల ఏసీబీ అరెస్ట్ చేసిన దుర్గగుడి సూపరింటెండెంట్ నగేష్ పర్యవేక్షించిన టోల్‌గేట్, ప్రసాదాలు, దర్శన టికెట్ల విక్రయాలు తదితర విభాగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారులు ఆదివారం తెల్లవారుజామున దుర్గగుడి ఘాట్‌రోడ్డు వద్దకు వచ్చి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఫొటోలు తీసుకోవడంతోపాటు కొండపైకి అనుమతిస్తున్న వాహనాల టికెట్ల విక్రయాలపై ఆరా తీశారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలోని ప్రసాదాల కౌంటర్లు, మహామండపంలోని ప్రసాదాల కౌంటర్లతోపాటు దర్శన టికెట్ల విక్రయాలను పరిశీలించారు. కొందరు భక్తుల వద్ద ఉన్న టికెట్లను పరిశీలించి, టికెట్లకు ఎంత డబ్బులు తీసుకున్నారనే వివరాలను సేకరించారు. చెప్పుల స్టాండ్, క్లోక్‌రూమ్‌లలో అదనంగా డబ్బులు తీసుకుంటున్నారా... అని ఆరా తీసినట్లు తెలిసింది. మరోవైపు ఆలయ ప్రాంగణంలో వీఐపీల పేరిట దర్శనాలు ఎవరు చేసుకుంటున్నారు, వారికి ఎవరు దర్శనం కల్పిస్తున్నారనే వివరాలను కూడా నమోదు చేసుకోవడంతోపాటు వారి ఫొటోలనుసైతం గుట్టుచప్పుడు కాకుండా తీసుకున్నట్లు తెలిసింది. ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ అధికారి ఇంట్లో వారం రోజుల కిందట ఏసీబీ అధికారులు తనిఖీలు చేయడం, ఇప్పుడు ఆలయంలోని కీలక విభాగాలపై నిఘా పెట్టడంతో ఎప్పుడు, ఏం జరుగుతుందోనని దుర్గగుడి సిబ్బందితోపాటు అధికారులు ఆందోళన చెందుతున్నారు.

విశాఖలో ఆయిల్ ఫెడ్ కార్యాలయం

- ఉత్తరాంధ్ర కోసం స్టాక్ పాయింట్, భారీ గోదాము
- మధురవాడ వద్ద స్థలాన్ని కేటాయించిన ప్రభుత్వం
- ఏలూరు వద్ద మరో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్-రిఫైనరీ ప్లాంట్

సాక్షి, అమరావతి: 'విజయ' బ్రాండ్ ఉత్పత్తులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీ ఆయిల్ ఫెడ్ ఉత్తరాంధ్రలో సంస్థ కార్యకలాపాలను విస్తృతం చేస్తోంది. ఇందుకోసం విశాఖపట్నంలోని మధురవాడ వద్ద సర్వే నెం.192/2లో 30 సెంట్ల భూమిని ఆయిల్ ఫెడ్‌కు ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమి కేటాయింపు విషయంలో క్షేత్ర స్థాయిలోఉన్న అడ్డంకులను తొలగిస్తూ విశాఖ కలెక్టర్ మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. సాధ్యమైనంత త్వరగా ఈ స్థలాన్ని ఆయిల్ ఫెడ్‌కు అప్పగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ సంస్థ కార్పొరేట్ కార్యాలయ భవన సముదాయంతోపాటు భారీ స్టాక్ పాయింట్, గోదాములు నిర్మించనున్నారు. అలాగే, ఏలూరు జిల్లాలో రూ.230 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ అండ్ రిఫైనరీ ప్లాంట్‌ను నెలకొల్పాలని ఏపీ ఆయిల్ ఫెడ్ సంకల్పించింది. ఇప్పటికే ఏలూరు జిల్లా పెదవేగిలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆధునికీకరించడంతోపాటు కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పెదవేగి ప్రాసెసింగ్ ప్లాంట్ పరిధిలో ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలోని 23,510 ఎకరాల ఆయిల్ పామ్ తోటలు ఉన్నాయి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఆయిల్‌పామ్ గెలల్లో ప్లాంట్ ప్రాసెస్ చేయగా.. ఏటా 15 వేల టన్నులను ప్రైవేట్ కంపెనీలకు కేటాయించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఆయిల్ ఫెడ్ కార్యాచరణ సిద్ధం చేసింది. ప్లాంట్ ఏర్పాటుకు 50 ఎకరాలు, నర్సరీల కోసం మరో 20ఎకరాలు అవసరమని అంచనా వేసింది. ఇందుకోసం స్థలాన్ని అన్వేషిస్తున్నారు. వీలైనంత త్వరగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి 2023-24లోనే శంకుస్థాపన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

త్వరలోనే టెండర్లు

విశాఖలో ఆయిల్ ఫెడ్ కార్యాలయ భవన సముదాయంతో పాటు భారీ గోదాములు నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. మధురవాడ వద్ద గుర్తించిన 30 సెంట్ల స్థలాన్ని అప్పగించగానే టెండర్లు పిలిచి పనులు చేపడతాం. ఏలూరు వద్ద కూడా సాధ్యమైనంత త్వరగా రెండో ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

– చవల బాబూరావు, ఎండీ, ఏపీ ఆయిల్ ఫెడ్

విశాఖ పోర్టుకు అతి పొడవైన నౌక



విశాఖ పోర్టుకు చేరిన ఎంవీ ప్రేగ్ ఎక్స్‌ప్రెస్

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖ పోర్టుకు జర్మనీకి చెందిన అతి పొడవైన నౌక ఎంవీ ప్రేగ్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. విశాఖ కంటైనర్ టెర్మినల్ బెర్త్‌లో నిలిపిన ఈ నౌక పొడవు 335.9 మీటర్లు కాగా, 8,750 కంటైనర్లను మోసుకువెళ్లే సామర్థ్యం కలదు. ఈ నౌక గత నెల 27వ తేదీన దుబాయ్‌లోని పోర్ట్ రషీద్‌లో బయలుదేరి 10 రోజులపాటు ప్రయాణించి ఆదివారం విశాఖ పోర్టుకు చేరుకుంది.



వంద మందిలో వీరుడు పుడతాడు. వెయ్యిమందిలో తెలివైనవాడు కనిపిస్తాడు. కానీ నిష్ణాతుడు లక్షమందిలో కూడా కానరాడు.
– ప్లేటో

సాక్షి

సోమవారం, 8 మే 2023

చావు చిల్లర

రావిశాస్త్రి 'కార్నర్ సీట్' కథ సుప్రసిద్ధం. అందులో ఒకతను రైలు ప్రయాణం చేయబోయి కంపార్ట్‌మెంట్‌లోని కార్నర్ సీట్ ఆశిస్తాడు. కూచునే లోపల ఒక ఆకుపచ్చకోటు వాడు ఆ సీటును ఆక్రమిస్తాడు. అప్పట్నించి ఇతను ఆ ఆకుపచ్చకోటు వాణ్ణి తిట్టుకుంటూనే ఉంటాడు. ఆ ఆకుపచ్చకోటు వాడు ఇదంతా పట్టకుండా ఎటో చూస్తుంటాడు. ఏదో ఆలోచిస్తుంటాడు. మధ్యలో ఒకచోట రైలు ఆగుతుంది. తిరిగి బయలుదేరబోతుంటుంది. ఒక్క క్షణం. ఆకుపచ్చకోటు వాడు ఒక్క ఉదుటున కంపార్ట్‌మెంట్ దిగేస్తాడు. ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ముక్కలైపోతాడు. రెప్పపాటు. అంతవరకూ అతణ్ణి తిట్టుకున్న ఇతను నిశ్చేష్టుడవుతాడు. అతనికీ ఇతనికీ ఏ సంబంధమూ లేదు– కార్నర్ సీటుతో తప్ప. కాని ఇతనికి ఏడుపు వస్తుంది. దుఃఖం కలుగుతుంది. ఈ లోకంలో ఎంతో ఎండా నీడా గాలి నీరూ వర్షం ఉన్నాయి. వాటిని అనుభవించకుండా ఏదో ఒక సూర్యోదయాన్ని సూర్యాస్తమయాన్ని చూసి ఊరట చెందకుండా ఏ కష్టానికి ఎందుకు చనిపోయాడో అని వెక్కివెక్కి ఏడుస్తాడు. ఎదుటివాడి చావు పట్ల మనకు ఉండాల్సిన వేదన, సహానుభూతి గురించి రావిశాస్త్రి రాసిన గొప్ప కథ అది.

ఆర్.కె.నారాయణ్ 'మిస్సింగ్ మెయిల్' కథ కూడా సుప్రసిద్ధమే. వినాయక్ మొదలి వీధిలో ఇంటింటికీ ఉత్తరాలు అందించే పోస్ట్‌మేన్ తానప్పకు ఆ వీధిలోని అందరి కష్టసుఖాలు తెలుసు. రామానుజమ్ గారి కుమార్తె కామాక్షికి చాలా రోజులుగా సంబంధాలు కుదరడం లేదని తెలుసు. ఇప్పుడు కుదిరిన ఢిల్లీ సంబంధం ఈ ముహూర్తం దాటితే తిరిగి మూడేళ్ల వరకు అబ్బాయికి వీలు కాదనీ తెలుసు. రామానుజమ్ ఇంట్లో ఒకవైపు పెళ్లి పనులు జరుగుతుండగా మరోవైపు తానప్పకు టెలిగ్రామ్, ఉత్తరం అందుతాయి. వాటిలో రామానుజమ్ మేనమామ మరణవార్త ఉంటుంది. ఇప్పుడేం చేయాలి? ఈ కబురు రామానుజమ్‌కు తెలిస్తే వెంటనే బయల్దేరాలి. పెళ్లి ఆగిపోవాలి. మళ్లీ మూడేళ్ల వరకూ పోస్ట్‌పోన్ చేయాలి. అందుకే తానప్ప ఆ టెలిగ్రామ్, ఉత్తరం దాచి పెడతాడు. పెళ్లయ్యి అమ్మాయిని సాగనంపాక మెల్లగా ఆ సంగతి తెలియచేస్తాడు. మరణవార్త ఎప్పుడు, ఎలా చెప్పాలో తెలిసి సంస్కారం పాటించిన తానప్పను పాఠకుడు గుండెల్లో పెట్టుకుంటాడు.

చావును గౌరవించడం ప్రతి నాగరికతలో ఉంది. చనిపోయిన వ్యక్తికి 'అంతిమ సంస్కారం' నిర్వహించడం సాటి మనిషి సంస్కారం. జననంతో మొదలయ్యే మనిషి జీవనవృత్తం మరణంతో ముగుస్తుందని అందరికీ తెలిసినా మరణం తెచ్చే శూన్యం, వెలితి ఆ కుటుంబానికి, సంబంధీకులకు, స్నేహితులకు చాలా తీవ్రమైనవిగా జనులు భావిస్తారు. అందుకే నిన్న మొన్నటి వరకూ పల్లెల్లో ఒక వ్యక్తి మరణిస్తే ఎత్తుబడి అయ్యేంత వరకూ ఊరు ఊరంతా పొయ్యి ముట్టించేది కాదు. చావుఇంటి దగ్గర చేరి ధైర్యం చెప్పడం, జరగవలసిన పనులు చూడటం చేసేవారు. మనిషి చనిపోవడం అంటే 'కూకటి వేళ్లతో సహా చెట్టు కూలిపోవడం'గా గాథా సప్తశతి వ్యాఖ్యానిస్తుంది. చెట్టు ఆధారంగా ఎంత జీవం పెనవేసుకుని ఉంటుందో మనిషి ఆధారంగా కూడా అనేక జీవనాలు పెనవేసుకుని ఉంటాయి. ఇప్పటికీ కొన్ని గిరిజన సముదాయాలైతే తమ సమూహంలోని ఎవరైనా ముఖ్యమైన వ్యక్తి మరణిస్తే ఆ ఆవాసాన్ని, గూడేన్ని ఏకంగా ఖాళీ చేసి వెళ్లిపోతాయి జ్ఞాపకాలను తట్టుకోలేక. అందుకే మనిషి పోయినప్పుడు పోయిన వ్యక్తిని గౌరవించడంతో పాటు అతని చుట్టూ ఉన్న వ్యక్తుల వేదనను కూడా గౌరవించి మెలగాలి.

ఈ దేశం విన్న అత్యంత విషాదకరమైన మరణవార్త గాంధీ గారి హత్య. రేడియోలో ఈ వార్త విన్న ఒక బాలిక పరిగెత్తుకుంటూ తల్లి దగ్గరకు వచ్చి 'అమ్మా... గాంధీ గారు చనిపోయారట' అంటే ఆ తల్లి ఉలిక్కిపడి లేచి కూతురి చెంప మీద లాగి పెట్టి ఒక్కటి వేస్తుంది– 'ఏమిటా పాడు మాటలు' అని! ఆ తర్వాత ఆ వార్త నిజం అని తెలిసి కన్నీరుమున్నీరుగా ఏడుస్తుంది. ఇంద్రగంటి జానకీబాల 'కనిపించే గతం' నవల ఈ సంఘటనతోనే మొదలవుతుంది. గాంధీ గారి మరణవార్త విని ఎక్కడికక్కడ కూలబడి విలపించినవాళ్లు, సినిమా హాళ్లలో సగం నుంచి లేచి ఏడ్చుకుంటూ బయటపడినవాళ్ళు, మూడు రోజులు లంకణం చేసినవారు ఎందరో ఉన్నారు. మహనీయులు, కళాకారులు, నాయకులు, ఆపద్బాంధవులు... జనులతో మమేకమై ఉంటారు. అందువల్ల వారి మరణ వార్తల పట్ల ఇంకా గౌరవం పాటించాలి. నిర్ధారణలు చేసుకోవాలి. అప్పుడే చెప్పాలి.

కాని ఇవాళ ఒక వికృతమైన సంస్కృతి ఎల్లెడలా కనిపిస్తూ ఉంది. దానిని పైశాచిక సంస్కృతి అనవచ్చు. చిల్లర సంస్కృతి అనవచ్చు. సోషల్ మీడియా సంస్కృతి అని కూడా అనవచ్చు. వ్యక్తుల చావు వార్తలను సత్యాసత్యాలతో సంబంధం లేకుండా పుకార్ల స్థాయికి దిగజార్చడం. బతికున్నవారిని చంపడం. వైద్యం తీసుకుంటూ పోరాడుతున్నవారికి చావు ముహూర్తం లిఖించడం. దీనికి హతాశులైన ఆ సజీవులు తామే ముందుకొచ్చి 'బతికున్నాం మొర్రో' అని చెప్పడం. బంధువులు దిగ్భ్రాంతితో 'అవన్నీ అబద్ధాలు' అని చెప్పాల్సి రావడం. జవాబుదారీతనం లేని వ్యవస్థ డ్రైనేజీలాంటిది. ఆ డ్రైనేజీతో మనకెందుకు అని నలుగురూ ఊరుకోవడం వల్లే అందులో కంపుతోపాటు ఇంపు కూడా కొట్టుకొనిపోవాల్సి వస్తోంది. ఫేక్‌ఐడిలు, ఆనవాలు లేని వాట్సప్‌లతో తప్పుడు చావువార్తలు వ్యాప్తి చేసి సైకిక్ స్టిమ్యులేషన్ పొందుతున్న వారు ఎంతటి మానసిక రోగులో అనుకోవాల్సి వస్తోంది. ఇలాంటి వాళ్లు మన ఇళ్లలో కూడా ఉండొచ్చు. చావును గౌరవిద్దాం. చావుపై చిల్లర ఏరుకునే వ్యవస్థను చావగొడదాం.

బడి నేర్పిన బతుకు పాఠం

కామెంట్



కరణ్ థాపర్

జీవితంలోకి వచ్చి పడ్డాక, ఎప్పుడైనా బాల్యం గుర్తొస్తే ఆనాటి కాలమంతా బంగారు వర్ణంతో మెరిసిపోతూ కళ్ల ముందర లీలగా కనిపించి మాయం అవుతుంది. మళ్లీ వచ్చి జీవితంలో పడిపోతాం. బాల్యంలో ముఖ్యమైనవి బడిలో గడిపిన రోజులు. అవి ముఖ్యమైనవే. కానీ పూర్తిగా సంతోషాన్నిచ్చిన రోజులైతే కాకపోవచ్చు. అప్పట్లో భయంకర సమయాలూ ఉండేవి. అయినాసరే వెనక్కు తిరిగి చూస్తున్నప్పుడు ఆ రోజుల్లో పడ్డ కష్టాలను మర్చిపోతుంటాం. పుస్తకాల్లోని సిలబస్‌తో పాటు బడి అనేక జీవిత పాఠాలు నేర్పిస్తుంది. అన్నిటికన్నా ఉత్తమ జీవితపాఠం... "తప్పులు చేస్తే చేశావు గానీ, ప్రయత్నం మాత్రం ఆపకు. ఎన్నటికీ ప్రయత్నించకుండా ఉండే కన్నా ప్రయత్నించి విఫలం చెందడం మంచిది కదా..." అనే పాఠం.

పాఠశాల రోజులు నిజంగానే ఒకరి జీవితంలో అత్యుత్తమమైన రోజులా? ఇది నిజమే. అయితే కొన్నిసార్లు బాధగానూ ఉంటుంది. నా విషయానికి వస్తే 16 ఏళ్ల వయసులో డూన్ స్కూల్‌ని వదిలిపెట్టిన తర్వాత నా జీవితం కోలుకోలేనంతగా దిగజారిపోయింది. మరోవైపున గులాబీ రంగులోని జ్ఞాపకాల ద్వారా మనం వెనక్కు తిరిగి చూస్తాము. మనం ఎంత పెద్దవారమైతే ఆ జ్ఞాపకాలు అంత పవిత్రంగా ఉంటాయి.

పాత పాఠశాల చిత్రాల ఆల్బమ్‌ని చూస్తున్నప్పుడు నిన్న నా మనస్సులో చోటుచేసుకున్న ప్రశ్న ఇది. ప్రతి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, డాస్కోస్ (డూన్ స్కూల్) పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను తిరిగి సందర్శించినప్పుడు వేల మంది ఈ ప్రశ్నకు గట్టిగా అవును అని జవాబు చెబుతారు.

అయితే నిజం ఏమిటంటే... మనలో ఎవరికీ పాఠశాల కేవలం సంతోషకరమైన ఉల్లాస క్షణాల సేకరణగా ఉండలేదన్నదే. అప్పట్లో భయంకరమైన సమయాలు కూడా ఉండేవి. అవి కూడా మనం ఎదగడంలో సహాయం చేసి ఉన్నప్పటికీ, వాటిని మననం చేసుకుంటున్నప్పుడు ఇప్పటికీ బాధాకరంగానే ఉంటాయి. అయినా సరే మనం వెనక్కు తిరిగి చూస్తున్నప్పుడు మనం ఆరోజుల్లో పడ్డ కష్టాలు, బాధలను మర్చిపోతుంటాము. ఆటపట్టించడం, ఆనాటి నవ్వులు, విజయాలను మాత్రమే మనం మననం చేసుకుంటుంటాము. ఆనాటి శిక్షలను, జరిమానాలను మనం గుర్తు తెచ్చుకున్నట్లయితే, వాటిని ఎదుర్కొని కూడా మనగలగడం గర్వించదగిన విషయమే.

కాబట్టి నలభైలు, యాభైలు, అరవైలలో తమను పెద్దలను చేసిన... అలాగే ఇరవైలలోని కుర్రాళ్లను మృదువుగా మార్చిన డూన్ స్కూల్ మాట ఏమిటి?

న్యాయంగా చెప్పాలంటే, సమాధానంలో కొంత భాగం తప్పకుండా తననూ, ప్రపంచాన్నీ ఒక టీనేజర్ చూస్తున్నంత అమాయకత్వంతో, నమ్మకంతో ఉంటుంది. అతను తన పరిమితులను తెలుసుకోలేనంత చాలా చిన్నవాడు, పైగా తన ఆకాంక్షలను వమ్ము చేయగల అవరోధాల గురించి తనకు ఇప్పటికీ తెలీదు. కలలు ఫలిస్తున్నట్లు, కష్టాలను అధిగమిస్తున్నట్లు, ప్రపంచం ఒక న్యాయమైన చోటుగాను కనిపిస్తుంటుంది. ఈ అర్థంలో... పాఠశాల రోజులు నిజంగానే రమణీయంగానే ఉంటాయి.



సుప్రసిద్ధ డూన్ స్కూల్

డూన్‌ని అంత ప్రత్యేకంగా చేసింది ఏమిటంటే, మాలో ప్రతి ఒక్కరినీ ఒక విశిష్ట వ్యక్తిగా ట్రీట్ చేయడమే! అనేకమందిలో ఒకడిగా నేను ఎన్నడూ భావించలేదు. నా ఉనికి, ప్రాధాన్యం, ఆసక్తుల గురించి నేను జాగరూకతతో ఉండేవాడిని. నేను క్రీడలంటే ద్వేషించేవాడిని. అది చూసి అందరూ నన్ను ఆటపట్టించేవారు కానీ ఎవరూ నన్ను ఆడాలని బలవంత పెట్టలేదు. చర్చలు, నటనను నేను ఆస్వాదించేవాడిని, వాటిలో పాల్గొనాలని నన్ను ప్రోత్సహించే వారు. నేను రాసేవాడిని, చదువుకునేవాడిని. దాన్నీ అందరూ ఆమోదించారు.

ఈరోజు డూన్ స్కూల్ స్కాలర్స్ బ్లేజర్ కథను నేను ప్రస్తావిస్తాను. అది నా ఉద్దేశాన్ని నిరూపిస్తుంది. దశాబ్దాలపాటు క్రీడాకారులు మందపాటి నీలి బ్రౌజర్‌తో గుర్తింపు పొందేవారు. అది వారికి ఎంతో ప్రత్యేకత కలిగించేది. విద్యాపరంగా మొగ్గు చూపేవారికి అలాంటిదేమీ ఉండదు. అందరినీ సమాన దృష్టితో చూడాల్సిన అవసరాన్ని పాఠశాల చేత అంగీకరింప చేయడానికి నేను చాలా సంవత్సరాలు పోరాడాల్సి వచ్చింది.

అది 1971లో సాధ్యమైంది. ఆ సంవత్సరం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హెడ్‌మాస్టర్ కల్నల్ సిమోన్ మొట్టమొదటి స్కాలర్స్ బ్రేజర్‌ని నాకు బహూకరించారు. దాన్ని గెలుచుకున్నందుకు నేను చాలా థ్రిల్ ఫీలయ్యాను కానీ ఆ తర్వాత అది మరింత చిరస్మరణీయంగా రుజువైంది. 'ఈ బ్లేజర్ ఎలా ఉండాలి;' అని హెడ్‌మాస్టర్ ప్రశ్నించారు. నేను చీకాకు పడలేదు. స్పోర్ట్స్ బ్లేజర్‌ని అనుకరించడం గురించే నేను ఆలోచించగలిగాను. అయినా, నేను కోరుకుంటూ వచ్చింది ఇదే కదా!

''రండి యంగ్ మ్యాన్'' అంటూ కల్నల్ సిమోన్ పలకరించాడు. ''మీరే మొట్టమొదటి వ్యక్తి. డూన్ స్కూల్ మొత్తం పాటించేటటువంటి డిజైన్‌ని మీరు రూపొందించారు. అయితే మీరు కాపీ క్యాట్‌గా ఉండాలనుకుంటున్నారా?'' అన్నారు!

స్కాలర్స్ బ్లేజర్‌ని డిజైన్ చేయడానికి ఒక టీనేజర్‌కి స్కూల్ హెడ్మాస్టర్ అనుమతించడాన్ని 50 సంవత్సరాల తర్వాత... ఈనాటికీ నేను నమ్మలేకున్నాను. నలుపు రంగులో సాంప్రదాయికమైన డబుల్ బ్రెస్టెడ్ స్టయిల్‌ని నేను ఎంచుకున్నాను. అందుకే ఆనాటి నుంచి అదే కొనసాగుతూ వచ్చింది.

డూన్ గర్వించదగిన ఒక కారణం ఏమంటే, కల్నర్ సిమోన్ వంటి వ్యక్తులు మాత్రమే అక్కడ ప్రత్యేకమైన వారు కారు. నా హౌస్ మాస్టర్ గురుదయాళ్ సింగ్, నా మ్యాథ్స్ మాస్టర్ షీల్ వోహ్రా, నా జాగ్రఫీ ట్యూటర్ చార్లీ కండ్యాట, హిస్టరీ హెడ్ జీక్స్ సిన్హా.. ఇంకా అనేకమంది ఇతరుల ముఖాలు నాకు ఇప్పటికీ గుర్తే. ఇకపోతే నేను ఎన్నటికీ మర్చిపోలేని ఈ గొంతులు నా జీవితాన్ని తీర్చిదిద్దాయి. నేనేం చేయాలి అని వీరు నాకు చెప్పడమే కాదు, నా పద్ధతిలో నేను చేయడాన్ని వీరు ప్రోత్సహిస్తూ వచ్చారు. నేను తప్పు చేసినప్పుడు (తరచుగా నేను తప్పులు చేశాను) కూడా తప్పు చేయడం అనేది నేరం కాదని వారు నాకు వివరించారు. ఎన్నటికీ ప్రయత్నించకుండా ఉండే కన్నా ప్రయత్నించి విఫలం చెందడం మంచిది కదా! డూన్ స్కూల్ నాకు నేర్పిన ఉత్తమ పాఠం అదే మరి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



వాస్తవంలోకి రండి



నిద్ర లేచి కాఫీ వాసన చూడండి. ఆర్టికల్ 370 ఇప్పుడు గతించిన చరిత్ర. డాక్టర్ ఎస్. జై శంకర్ వర్తమాన భారతదేశపు అత్యంత నిజాయితీపరుడైన ధీశాలి, శక్తిమంతమైన విదేశాంగ మంత్రి.

– డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ అహ్మద్, పొలిటికల్ ఎనలిస్ట్

తగ్గితే ఏమైంది?!



జెలెన్‌స్కీ ప్రపంచ పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నారా లేక కీవ్‌కి తిరిగి వెళ్లడానికి భయాందోళన చెందుతున్నారా? ఆయనది బొత్తిగా రెచ్చగొట్టే ప్రవర్తన. అగ్రరాజ్యాలకు అహంకారం ఇష్టం ఉండదు. యుద్ధం అంటే ఆట కాదు, ప్రాణ నష్టం.

– మేజర్ జనరల్ బక్షీ, (రిటైర్డ్)

భలే మనిషి!



నేను మొదటిసారి 2011లో అతనిని కలుసుకున్నప్పుడు ఆ తెలివితేటలు, ఆశయం, హాస్యస్ఫూర్తి చూసి ఆశ్చర్యపోయాను. అతని తాజా పుస్తకం నిజంగా సమ్మిళిత ప్రపంచాన్ని సృష్టించాలనుకుని సహాయం కోసం ఎదురు చూస్తుండే వారు ఎవరైనా తప్పక చదవాలి. ('రాడికల్ ఇంక్లూజన్' అనే పుస్తకం రాసిన డేవిడ్ మెయినినా గురించి).

– బిల్ గేట్స్, బిజినెస్ మేగ్నెట్

హింస జ్వాలలు



మణిపూర్‌లో చెలరేగిన హింస ఎవరినీ వదిలిపెట్టలేదు. సి.ఆర్.పి.ఎఫ్. జవాను చనిపోయారు. అధికార బీజేపీ ఎమ్మెల్యేకి గాయాలయ్యాయి. రాష్ట్ర డీజీపీపై దాడి జరిగింది. ఒక దిగువ స్థాయి ప్రభుత్వ అధికారి కనిపించకుండా పోయారు. ఆ అధికారి కుమారుడు చనిపోయాడు.

– సుప్రియా శర్మ, జర్నలిస్ట్

అవిధేయ ఉద్యోగులు



భారతీయ ఉద్యోగులలో నేను సాంస్కృతిక మార్పును గమనించాను. గతంలో తమను ఉద్యోగాల్లోకి తీసుకున్నందుకు యజమానుల పట్ల కృతజ్ఞతా భావం ఉండేది. ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో కంపెనీలు తమకు విధేయంగా లేవని ఉద్యోగులు నమ్ముతున్నారు. అందుకే వారు కూడా తమ యజమానులకు విధేయతను చూపడం మానేశారు.

– జాహ్నవి, బ్లాగర్

అతనిలో సగం!



నా స్నేహితురాలికి ఈ రాత్రి డేట్ ఉంది. హైహీల్స్, సిల్క్ డ్రెస్, పొడవాటి కోటు, దానికి సరిపోయే చిన్న బ్యాగ్ ధరించి సిద్ధమయ్యాక... "బిల్లు సగం ... సగం అనుకున్నాం కనుక వాలెట్ తీసుకురావడం మర్చిపోవద్దు" అని ఆమె బాయ్‌ఫ్రెండ్ 'రిమైండర్' మెసేజ్ పంపాడు. వెంటనే ఆమె స్నీకర్స్, జీన్స్, స్వెట్టర్‌లోకి మారిపోయింది. నేనింకా నవ్వుతూనే ఉన్నాను.

– జిన్‌హ్లే, ట్రావెలర్

వలపుల వల



గూఢచర్యం ఆరోపణలపై పుణెకు చెందిన డి.ఆర్.డి.ఓ. శాస్త్రవేత్త కురుల్కర్‌ను మహారాష్ట్ర ఎటీఎస్ అరెస్టు చేసింది. ఈ 'హనీ ట్రాప్డ్' సీనియర్ సైంటిస్ట్ పాక్‌లోని ఐ.ఎస్.ఐ.కి దేశ రహస్యాలను అందించారని కేసు నమోదు అయింది. మన అధికారులను హనీ ట్రాప్ చేయడం అంత తేలికా!

– అన్సుల్ సక్సేనా, పొలిటికల్ యాక్టివిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ముందుంది ముసళ్ల పండగ

సంవత్సరం క్రితం ఎండలు మండిపోయిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్, మే మాసాలలో కూడా వర్షాలు కురిసి ఎండలను గురించి అందరూ మరిచిపోయే పరిస్థితి వచ్చింది. కానీ మునుముందు మనకోసం ముసళ్ళ పండుగ వేచి చూస్తున్నది అన్న సంగతి గుర్తు ఉంచుకోవాలి. ఎండల కారణంగా దేశంలో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. చాలా ప్రాంతాలలో పంటలు దిగుబడి మూడవ వంతు పడిపోయింది. ఢిల్లీలో ఒకచోట ల్యాండ్ ఫిల్ (పెంట కుప్ప) తగలబడి పొగలు కమ్ముకున్నాయి. చుట్టుపక్కల వారంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉష్ణోగ్రతలు 115 డిగ్రీల ఫారెన్ హీట్ చేరుకున్నాయి. కనీసం 300 చోట్ల అడవులు తగలబడ్డాయి.

ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ వారు వాతావరణపరంగా వచ్చే ప్రమాదాలను గురించి అంచనా వేశారు. కానీ అంతర్జాతీయ పరిశోధనలు మాత్రం వారి అంచనాలు సరిగా లేవు అంటున్నాయి. అభివృద్ధి గురించి నిర్దేశించిన గమ్యాలను చేరలేకపోవడానికి ఈ అంచనాలలో తేడాయే కారణమవుతుందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

ఇటీవల మహారాష్ట్రలో ఎర్రటి ఎండలో ఆరుబయట జరిగిన ఒక కార్యక్రమం కారణంగా పదముగ్గురి ప్రాణాలు పోయాయి. మరికొందరు అనారోగ్యానికి గురయ్యారు. ఇది పెరగనున్న ఎండల ప్రమాదానికి ఒక హెచ్చరికగా పరిగణించాలి. ఎండల తీవ్రత వల్ల గుండె ఆగి మరణించే ప్రమాదమూ ఉందనేది గమనార్హం. గడచిన 30 ఏళ్లలో భారతదేశంలో వడదెబ్బ కారణంగా 24 వేల మంది చనిపోయారని లెక్క తేలింది. పక్క దేశాలలో కూడా పరిస్థితి ఇదే రకంగా ఉంది. వాతావరణం వేడెక్కుతున్న కారణంగా ప్రతి మూడు సంవత్సరాలకు వేడి గుర్తించదగినంతగా పెరుగుతోంది అంటున్నారు పరిశోధకులు. ఒక కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ పరిశోధన నివేదిక 2050 సంవత్సరం నాటికి నీడలో ఉన్నవారికి కూడా భరించరానంత వేడి మొదలవుతుందని పేర్కొంది. వాతావరణంలో వేడి పెరగకుండా స్థిరంగా ఉన్నట్లయితే మరో మూడు వందల ఏళ్ల వరకు ఈ పరిస్థితి రాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ, ప్రపంచ దేశాలు విచక్షణారహితంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ఉండటంతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

ప్రభుత్వపరంగా జరుగుతున్న ప్రణాళికలలో మాత్రం ఈ విషయం గురించి అంతగా పట్టించుకోవడం లేదని కూడా నివేదికలో రాశారు. గుజరాత్‌లోని 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్' అధికారి దిలీప్ మవలంకర్ కూడా ప్రభుత్వం దీన్ని పట్టించుకుంటున్నట్టు లేదని పేర్కొన్నారు. కాబట్టి ప్రభుత్వం అభివృద్ధి కార్యకలాపాలపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

– కె.బి. గోపాలం; అనువాదకుడు, రచయిత । 98490 62055

తెలుగుజాతి వేగుచుక్క


సందర్భం



గౌరవ్

తాతాజీగా సాహిత్య లోకానికి పరిచితులైన తాపీ ధర్మారావు తెలుగు సారస్వతాన్ని సుసంపన్నం చేసిన మహా వ్యక్తులలో ఒకరు. బరంపురంలో పుట్టిన బండారు ధర్మారావు తెలుగు నేల మీద తాపీ ధర్మారావుగా ప్రసిద్ధి చెందారు. ఉత్తరాంధ్ర, ఒడిస్సా, తెలంగాణ, రాయలసీమ, తమిళ నాడు వంటి పలు ప్రాంతాల్లో, సంస్థానాలలో పనిచేసినాయన సాంస్కృతికోద్యమాల ప్రతిష్ఠను ఇనుమడింప చేసిన చుక్కాని. కవిత్వం, చిత్రలేఖనం, గణితం, నాటకాలు, వ్యాయామం – ఇలా పలు అంశాల్లో ఆసక్తి కనబర్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి. చేమకూర వెంకటకవి గురించి సాధికారికంగా చెప్పగల ఏకైక వ్యక్తి. 'వేగుచుక్క గ్రంథమాల' వ్యవస్థాపకులు. స్వతంత్ర పరిశోధకులు, సంఘ సంస్కర్త, మూఢ నమ్మకాలను చీల్చి చెండాడిన హేతువాది. 'సమదర్శని', 'కొండెగాడు', 'ప్రజామిత్ర', 'జనవాణి', 'కాగడా' వంటి పత్రికల ద్వారా ప్రజానీకానికి ప్రత్యామ్నాయ రాజకీయ భావాలను చేరువ చేసిన పాత్రికేయులు. అంతే కాదు, తెలుగులో ప్రజాపక్షంగా ఆలోచించే పాత్రికేయులతో 'ఆంధ్ర రాష్ట్ర పత్రికా రచయితల సంఘ' స్థాపకులు, దానికి మొదటి అధ్యక్షులు కూడా! ఇవన్నీ ఒకెత్తయితే, బ్రాహ్మణేతరోద్యమ తాత్విక ధోరణిని జీవితాంతం తన రచనా వ్యాసంగంలో కొనసాగించి, స్వతంత్ర ఆలోచనా విధానాన్ని బలోపేతం చేసిన ఆత్మగౌరవ ఉద్యమ కర్తగా తాతాజీ ప్రస్థానం మరొకెత్తు.

పానుగంటి, గిడుగు వంటివారి ప్రభావంతో మొదట్లో గ్రాంధికవాదిగా ఉన్నప్పటికీ, తర్వాత కాలంలో చిరస్థాయిగా నిలిచి పోయే అనేక రచనల్ని వ్యావహారిక భాషలో రచించారు. 'పాతపాళీ' నుంచి 'కొత్తపాళీ'లోకి కొనసాగిన పాత కొత్తల మేలు కలయిక తాతాజీ. 'ఆయన రాసింది చూసి నేర్చుకున్నామ'ని నార్ల అంతటి వ్యక్తే చెప్పగలిగిన సామర్థ్యం తాపీ వారి సొంతం. 'దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు?', 'ఇనుప కచ్చడాలు', 'పెళ్ళి – దాని పుట్టుపూర్వోత్తరాలు'... తాతాజీ చేసిన ఈ మూడు రచనలు భావోద్యమాల చరిత్రను అనూహ్యంగా మలుపు తిప్పాయి. ఆరుద్ర నుండి తిరుమల రామచంద్ర వరకూ తాతాజీ ప్రేరణతో పురా మానవ పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నవారు ఎందరో ఉన్నారు. ఇవి కాక



నేడు తాపీ ధర్మారావు 50వ వర్ధంతి

'ఆలిండియా అడుక్కు తినేవాళ్ళ మహాసభ', ఇంకా కొన్ని నాటికలు రాశారు. 'రాలూ, రప్పలూ' పేరుతో ఆత్మకథ రాశారు.

కందుకూరి, గురజాడ, గిడుగు వంటి వారి అడుగుజాడల్లో సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించిన ఉద్యమకారుడు తాతాజీ. వేదం వెంకటరాయ శాస్త్రి అంతటి మహా పండితుడు రాసిన 'విజయ విలాస వ్యాఖ్యానం'లో తప్పులు ఎత్తి చూపడమే కాకుండా, పండితులతో తన విమర్శపై ప్రతివిమర్శల్ని ఆహ్వానిస్తూ సమావేశాలు నిర్వహించారు.

మరో ముఖ్యమైన చారిత్రక ఘటన ఒకటుంది. తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా 'ఉర్కాడు' సంస్థానంలో తాపీ వారు పని చేసేవారు. అక్కడ దేవీ నవరాత్రుల సందర్భంగా జరిగిన గోష్ఠిలో, తిరుగులేని ఆధ్యాత్మిక గురువైన శృంగేరి శారదా పీఠాధిపతి, జగద్గురు చంద్రశేఖర భారతీ శంకరాచార్యుల వారి ముందు తాతాజీ... భాష, లిపి మూలాల్ని తడుముతూ తాను రాసిన, 'అక్షర శారదా ప్రశంస' అనే పద్య కవిత్వం చదివి 'వాహ్వా' అనిపించుకుని, దుశ్శాలువాతో 'ఆంధ్ర విశారద' అనే బిరుదు పొందారు. ఒక ప్రగతి శీల భావాలుగల వ్యక్తి హేతువాద దృష్టితో రాసిన కవితకి గాను, తిరుగులేని ఆధ్యాత్మికవేత్త నుండి అంతటి సత్కారాన్ని అందుకోవడం అనేది అప్పటి వరకూ ఎన్నడూ జరగనిది. ఆ రకంగా అది భావోద్యమాలకు దక్కిన అరుదైన గౌరవం.


తాతాజీ చలనచిత్ర రంగంలో కూడా తన ముద్ర వేశారు. 'మాలపిల్ల', 'రైతుబిడ్డ', 'ఇల్లాలు', 'రోజులు మారాయి', 'కీలు గుర్రం', 'పల్లెటూరి పిల్ల', 'కృష్ణ ప్రేమ', 'పరమానందయ్య శిష్యుల కథ' వంటి సినిమాలకు సంభాషణలు రాశారు. చాలా కాలం పాటు మద్రాసులో ఉన్నా... తర్వాత హైదరాబాదుకి మకాం మార్చారు. ఎగ్జిమా, ఆస్తమా వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ 1973 మే 8న హైదరాబాదులోని కుమారుడి ఇంట్లోనే తుదిశ్వాస విడిచారు. తెలుగు సాహిత్యాన్ని తనదైన ఒరవడిలో ఓలలాడించి, ప్రగతిశీల ఉద్యమాలన్నింటి మీద ధిక్కారపు వెలుగుల్ని ప్రసరించిన 'వేగుచుక్క'గా తెలుగు ప్రజల గుండెల్లో 'తాతాజీ'గా ఎప్పటికీ నిలిచిపోతారు.

వ్యాసకర్త సామాజిక కార్యకర్త । 90320 94492

ప్రకృతి సీత

రామాయణాన్ని 'రమా'యణమనీ అంటారు. అంటే 'రమ' కథ. సీత కథ. సీత ఆదర్శమూర్తి. రామాయణంలో రావణ వధ కోసమే సీత పుట్టిందనే కథనాలున్నాయి. సీత శక్తిత్రయ ప్రతీక అని వాల్మీకి ఉవాచ. కేవలం భావన ద్వారానే సాధించగల శక్తి సీత తత్వంలో ఉంది. రాముడు చంపలేని శతకంఠ రావణుని సీతే సంహరించిందని 'శతకంఠ రామాయణం' చెబుతుందన్నారు ఆరుద్ర. ప్రకృతి ఎప్పుడూ పురుషుని కన్నా గొప్పది. అందుకే శాక్తేయులు సీతను రాముడి కన్నా మిన్నను చేశారు. లక్ష్మణుడు ఒంటరిగా సీతను వదలిన క్షణం నుంచి కుశలవులను రామునికి అప్పగించటం వరకు సీతలోని స్థితప్రజ్ఞత ప్రదర్శితమవుతుంది.

ఓ సారి దేవతలంతా ప్రజాపతి దగ్గరకు వెళ్ళి 'కా సీతా? కిం రూపమితి' అని ప్రశ్నించారు. అందుకాయన 'మూల ప్రకృతి రూపం కలిగి ఉండే పురుషునికి వ్యతిరేకమైన ప్రకృతియే సీత' అని సమాధానమిచ్చారుట. వాల్మీకి ఈ అంశ వివరణలో చాలా



లోతైన అర్థాలను చెప్పారు. సీతకు మూడు రూపాలున్నాయి. ఆమె శబ్ద బ్రహ్మ స్వరూపం, జ్ఞాన బ్రహ్మ స్వరూపం, అవ్యక్త స్వరూపం. సీత వ్యక్తిత్వం గొప్పదనటానికి రామాయణంలో ఎన్నైనా సన్నివేశాలను ఉదాహరించవచ్చు. ఆశ్రమంలో సీతను చూసిన మొదటి ప్రయత్నంలో అనసూయ ప్రసన్నురాలై 'నా తపస్సునంతా నీకిచ్చేస్తానని' అంటే 'వద్దు నేనే తపస్సు చేసి సాధిస్తానంటుంది' సీత. తనకు రామునికి జరిగిన స్వయంవర ఘట్టాలను అనసూయకు 'చూపిస్తుంది'. విల్లు విరిగిన వేళ 'నేనిప్పుడు వివాహం చేసుకోలేనని' రాముడంటే మనసులో సన్నగా నవ్వుకుంటుంది. పురుషుని హృదయాన్ని, సహృదయతను గ్రహించిన ఇల్లాలామె.

సీతకెన్నో పేర్లున్నాయి. అవన్నీ ప్రకృతికి దగ్గరగా ఉన్నవే! 'సీతాసస్యే'– పండిన పంటను సీత అంటారు. 'సీతానభా'– ఆకాశానికి సీత అనే పేరుంది. 'సీతానద్యాం'– నదికి మరో పేరు సీత. 'సీత' అనే మూలాక్షరాల వెనుక జీవునికి అమృతత్వాన్ని అందించే లక్షణాలు కలిగిన అర్థాలున్నాయి. 'సీత'కు 'క్షమ' కూడా ఎక్కువే. మరి భూదేవి తనయ కదా! మొత్తంగా సీతాపాత్రలోని బాహ్య, అంతర్గత గుణాలను, సుగుణాలను గమనించి విశ్లేషిస్తే వర్తమాన మహిళలంతా 'సీత' లక్షణాలు కలిగినవారేననిపిస్తుంది. వారిని గౌరవించుకోవాలి.

– భమిడిపాటి గౌరీశంకర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.తదియ రా.7.24 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.8.22 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** తె.4.01 నుండి 5.33 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.20 నుండి 1.11 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.52 నుండి 1.23 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.17.

క్లుప్తంగా...

లండన్‌లో కౌన్సిలర్‌గా చీరాల వాసి

- రెండోసారి గెలిచిన ముప్వల చంద్రశేఖర్



బ్రిటన్ ప్రధాని రిషిసునాక్‌తో కౌన్సిలర్ ముప్వల చంద్రశేఖర్

చీరాల: చీరాలకు చెందిన ముప్వల చంద్రశేఖర్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆయన లండన్‌లో వరుసగా రెండోసారి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. లండన్‌లో శనివారం జరిగిన కౌన్సిలర్ ఎన్నికల్లో స్లోబరో ప్రాంతం లాంగ్లే మేరీష్ వార్డు నుంచి చంద్రశేఖర్ పోటీ చేసి విజయం సాధించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగ నిమిత్తం 30 ఏళ్ల క్రితం లండన్‌కు వెళ్లిన చంద్రశేఖర్... అక్కడే పారిశ్రామికవేత్తగా స్థిరపడ్డారు. బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ నేతృత్వం వహిస్తున్న కన్సర్వేటివ్ పార్టీ నుంచి చంద్రశేఖర్ కౌన్సిలర్‌గా గత ఎన్నికల్లో మొదటిసారి పోటీచేసి గెలుపొందారు. తమ వార్డులోని సమస్యలన్నింటినీ పరిష్కరించి ఉత్తమ వార్డుగా తీర్చిదిద్దడంతో ఆయనను స్థానికులు రెండోసారి కూడా కౌన్సిలర్‌గా ఎన్నుకున్నారు. తనను ఎన్నుకున్న ఓటర్లకు, తెలుగు ప్రజలకు చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. చంద్రశేఖర్‌ను బ్రిటన్ ప్రధానమంత్రి రిషిసునాక్‌తోపాటు తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వి.మట్టారెడ్డి, లండన్‌లో స్థిరపడిన తెలుగు ప్రజలు అభినందించారు.

తిరుమల యాత్ర ఫ్యాషన్‌తో చేసే పిక్నిక్ కాదు

- భక్తితో శ్రీవారిని దర్శించుకోవాలి
- మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ



ధ్వజస్తంభానికి మొక్కుతున్న మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ

తిరుమల: తిరుమల యాత్ర ఫ్యాషన్‌తో చేసే పిక్నిక్ కాదని, భక్తితో శ్రీవారిని దర్శించుకోవాలని మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తిరుమల శ్రీవారిని వ్యాపార దృష్టితో చూడకూడదని చెప్పారు. భక్తితో స్వామివారిని పూజిస్తే అందరి కోరికలు తీరుతాయన్నారు. పవిత్రమైన తిరుమల పరిసరాలను భక్తులు అపవిత్రం చేయకూడదని సూచించారు. తొలుత స్వామీజీకి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కాగా, శ్రీవారిని దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, సినీ నటుడు నవీన్ పోలిశెట్టి దర్శించుకున్నారు.

'అల్లూరి'ని యువత ఆదర్శంగా తీసుకోవాలి: మంత్రి రోజా



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ, దేశభక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. ఆదివారం అల్లూరి 99వ వర్ధంతి సందర్భంగా పుత్తూరులోని అల్లూరి విగ్రహానికి మంత్రి గజమాలను వేసి నివాళులర్పించారు. అల్లూరి స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ మన్యం ప్రాంత ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. గిరిజనుల కోసం మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రజల కోసం అల్లూరి ఎక్కడైతే ప్రాణాలను విడిచిపెట్టారో అక్కడ టూరిజం శాఖ ఆధ్వర్యంలో మ్యూజియంను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.మజ్జిగ చలివేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. క్షత్రియ సంఘం నేతలు మంత్రిని సత్కరించారు.

12 ఏళ్లకే టెన్త్ పూర్తి

- గుంటూరు విద్యార్థి అనఘా లక్ష్మి ప్రతిభ



చిత్రా అనఘాలక్ష్మి

గుంటూరు (ఎడ్యుకేషన్): గుంటూరు నగరానికి చెందిన చిత్రా అనఘాలక్ష్మి 11 ఏళ్ల 8 నెలల వయసులోనే 10వ తరగతి పరీక్షలు రాసింది. బ్రాడీపేటలోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో చదివిన అనఘాలక్ష్మి అన్ని సబ్జెక్టులలో 90కి పైగా మార్కులతో మొత్తం 600కు గాను 566 మార్కులు సాధించింది. పదేళ్ల వయసులో గణితంలో శతావధానం చేసిన అనఘాలక్ష్మి ప్రతిభను గుర్తించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ప్రత్యేక అనుమతి ఇవ్వడంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిందని పాఠశాల డైరెక్టర్ ఆర్.రాము తెలిపారు.

పిడుగుల కాలం.. 'వాహకం'తో దూరం

పిడుగుపడే సమయంలో ఎలక్ట్రిక్ పరికరాలు వినియోగించొద్దు

- విద్యుత్ తీగల కింద.. టవర్ల దగ్గరలో ఉండొద్దు
- పిడుగుపాటు నుంచి రక్షణకు పిడుగు వాహకాల ఏర్పాటు తప్పనిసరి
- 'సాక్షి'తో విద్యుత్ భద్రత డైరెక్టర్ విజయలక్ష్మి





విజయలక్ష్మి

సాక్షి, అమరావతి: భూమి, మేఘాల మధ్య విద్యుత్ విడుదల వల్ల మెరుపులు ఏర్పడి.. భూమి మీదకు అవి పిడుగులా ప్రసరిస్తుంటాయి. వానలు కురుస్తున్నప్పుడు పిడుగుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కనీస జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుల బారినుంచి సునాయాసంగా రక్షించుకోవచ్చంటున్నారు. విద్యుత్ భద్రత డైరెక్టర్, ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి జి.విజయలక్ష్మి. ప్రతి ఇంటిపైనా 'పిడుగు వాహకం' అమర్చాలని ఆమె స్పష్టం చేశారు. వివరాలు ఆమె మాటల్లోనే..

నిటారుగా నిలబడొద్దు

బెంజిమిన్ ఫ్రాంక్లిన్ 1752లో విద్యుత్, మెరుపుల మధ్య సంబంధాన్ని నిరూపించినప్పటి నుంచీ, వాటిని విద్యుత్‌గా మార్చేందుకు శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. పిడుగు నుంచి వచ్చే విద్యుత్ నిల్వ చేయగలిగితే ఒక పిడుగు నుంచి 10 కోట్ల వాట్ల విద్యుత్ పొందవచ్చు. అంత శక్తి వాటిలో ఉంటుంది కాబట్టి కేవలం 50 మైక్రో సెకన్లలో పిడుగు ప్రభావం చూపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు 100 పిడుగులు పడుతున్నాయనేది ఓ అంచనా. కాబట్టి పిడుగుల నుంచి రక్షణ పొందడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఇల్లు, కారు, బస్సు, రైలులో ఉన్నప్పుడు పిడుగుపాటు నుంచి రక్షణ లభిస్తుంది. పిడుగుల శబ్దం వినిపిస్తూ.. వర్షం పడుతుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కిందకి పోకూడదు. పిడుగు ఎత్తైన తాటి, కొబ్బరి వంటి చెట్లను వాహకంగా చేసుకుంటుంది. ఎత్తైనవి లేనిచోట ఇతర చెట్లపై పడుతుంది. చెట్టు మీద పిడుగు పడ్డప్పుడు చెట్టు చుట్టూ తడి నేలపై 50 మీటర్ల వరకు కరెంట్ ప్రసరిస్తుంది. తడిసిన పూరి గుడిసెల పైన, గడ్డివాముల పైన కూడా పిడుగు పడుతుంది. వాన పడేటప్పుడు చెట్టు కిందకు, ఇలాంటి ప్రదేశాలకు వెళ్లకూడదు. చుట్టూ 500 మీటర్ల వరకు చెట్లు లేనప్పుడు, చెలకల వద్ద నల్లని దట్టమైన మేఘాలు (భూమి నుంచి 2 కి.మీ. ఎత్తు లోపల ఉండే క్యుములోనింబస్ మేఘాలు) వర్షించినప్పుడు నడుస్తున్నా, నిటారుగా నిల్చున్నా పిడుగు మనల్నే వాహకంగా చేసుకుంటుంది. తడిస్తే తడిచామని కింద పాదాలు మాత్రమే నేలకు తాకేలా, ఒకరికొకరు 100 అడుగుల దూరంగా కూర్చుంటే పిడుగుపాటు నుంచి తప్పించుకోవచ్చు. అలాంటి సమయంలో గడ్డపార లాంటి లోహపు వస్తువులు దగ్గర లేకుండా చూసుకోవాలి. పిడుగుల హెచ్చరికలు ఉన్నపుడు ఆరుబయట ఉండకూడదు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో భవనాలలో, సురక్షిత ప్రాంతాలలో తలదాచుకోవాలి. ఉరుముల శబ్దం వినిపించిన వెంటనే పిడుగు పడే అవకాశం ఉందని గమనించాలి. అలాగని వెంటనే చెట్టు కిందకు, పొలాల్లోకి, ఆరుబయటకు వెళ్లకూడదు.



'లైట్నింగ్ కండక్టర్' కాపాడుతుంది

సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ రెగ్యులేషన్స్, 2010లోని 74వ నియమం ప్రకారం.. ప్రతి భవన నిర్మాణంలో పిడుగుపాటు నుంచి రక్షణ ఏర్పాట్లు ఉండాలి. ఎత్తైన భవనాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, విద్యుత్ ఉత్పాదక ప్రాంతాలు, సరఫరా టవర్లు, పంపిణీ కేంద్రాలు, సమాచారానికి వినియోగించే టవర్లకు పిడుగు వాహకం (లైట్నింగ్ కండక్టర్) అమర్చుకోవాలి. ఆట స్థలాలకు సమీపంలోని ఎత్తైన ప్రదేశంలో పిడుగు వాహకం అమర్చటం ద్వారా మైదానాల్లో ఆడుకునే చిన్నారులను పిడుగుల నుంచి రక్షించవచ్చు. 11 కేవీ, 33 కేవీ విద్యుత్ తీగల కింద, 132/220 కేవీ సరఫరా టవర్ల దగ్గర్లో నిలబడకూడదు. పెద్దపెద్ద చెట్ల కింద, సముద్రపు ఒడ్డున నిలబడొద్దు. విద్యుత్ వాడకం ఉన్న ప్రతిచోట ఎర్తింగ్ సిస్టం పాటించాలి. పిడుగుపడే సమయంలో విద్యుత్, ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించడం కూడా మంచిది కాదు.

మా జీవితాల్లో వెలుగులు నింపారు

- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన డీఎస్సీ–1998 టీచర్లు

విజయనగరం టౌన్: తమ జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ వెలుగులు నింపారంటూ డీఎస్సీ–1998 బ్యాచ్ ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం జగన్ నిర్ణయంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉద్యోగాలు లభించిన 489 మంది ఉపాధ్యాయులు ఆదివారం విజయనగరంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా టి.రామారావు, ప్రధాన కార్యదర్శిగా బి.ఉమాకామేశ్వరరావు, కోశాధికారిగా మంతిన అప్పలరాజు, గౌరవాధ్యక్షుడిగా పి.వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా జి.డి.వి.ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎ.రజనీ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగాలు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. ఉద్యోగ విరమణ వయసును పొడిగించాలని కోరారు.

బహుజనులంటే చంద్రబాబుకు అలుసు

- 952వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తీర్పు ఇస్తూ.. తప్పుడు కేసులు వేసిన వారికి కోర్టు అక్షింతలు వేయడంతో చంద్రబాబు మాట మార్చడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 952వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిన్న మొన్నటి వరకు ఈ ప్రాంతంలో పేదలకు ఇళ్లు కేటాయిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందంటూ గగ్గోలు పెట్టిన బాబు.. ఇప్పుడు మాట మార్చి ఆర్–3 జోన్‌లో స్థలాలు కేటాయిస్తే ఇబ్బంది లేదని చెప్పడమేంటని ప్రశ్నించారు. అంటే పేదలు ఇక్కడ నివసించే అర్హత లేదా ఎప్పుడూ శివారు ప్రాంతాల్లోనే ఉండాలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు పేదలంటే తొలి నుంచీ అలుసని, బహుజనులపై వివక్ష చూపిస్తూ 14 ఏళ్ల సీఎంగా ఉన్నప్పుడే జానెడు జాగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడని ధ్వజమెత్తారు. ఇప్పుడు పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాలిస్తుంటే తట్టుకోలేక పిచ్చిపట్టిన వాడిలా వ్యవహరిస్తున్నాడంటూ మండిపడ్డారు. ఈ నెల 15న ఇళ్ల పంపిణీ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బహుజనుల విజయోత్సవం జరగనుందన్నారు. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన వేణుగోపాలరావు



సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా అక్కెన వేణుగోపాలరావు మరోసారి గెలుపొందారు. ఆయన గెలుపొందడం ఇది రెండోసారి. శనివారం జరిగిన ఎన్నికల్లో వినోద్ కుమార్‌పై విజయం సాధించారు. వేణుగోపాలరావుకు 401 ఓట్లు రాగా.. వినోద్‌కు 140 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా కె.సురేంద్రనాథ్, కార్యదర్శిగా ఎం.ఎలీషా, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.చంద్రబాబు, సంయుక్త కార్యదర్శులుగా జి.కోటేశ్వరరావు, కె.లక్ష్మీప్రసన్న, కోశాధికారిగా ఎ.కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రేష్మా పర్వీన్‌బాను, గౌరి, నాగేంద్ర, రాంబాబు, మాల్యాద్రి, పి.రత్నభాస్కర్, ఎస్.పిచ్చిరాజు, కె.వీరరాఘవయ్య, హనుమంతరావు, సూర్యారావు, వి.శ్రీరామారావు ఎన్నికయ్యారు.

పొత్తుల వ్యూహం పవన్‌కే విడిచిపెడదాం

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

రాంబిల్లి/అనకాపల్లి టౌన్: పొత్తుల వ్యూహం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కే విడిచిపెడదామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. నకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సుందరపు విజయ్‌కుమార్ రాంబిల్లి మండలం హరిపురంలో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం నాగబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో జనసేనకు 7శాతం ఓట్లు వచ్చాయని, ఇపుడు 35 శాతం ఉన్నట్టు తమ సర్వేల్లో తేలిందని చెప్పారు. రాబోయేది జనసేన ప్రభుత్వమని, ఏపీలో జనసేన లేని రాజకీయం ఉండదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని, ప్రకృతి సంపదను ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని విమర్శించారు. మరోసారి ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే రాష్ట్ర పరిస్థితి అత్యంత దారుణంగా మారుతుందన్నారు.

పేకాట ఆడుతూ పట్టుబడ్డ టీడీపీ నేతలు

- రూ.96 వేల నగదు పట్టివేత



పోలీసులకు పట్టుబడ్డ టీడీపీ నేతలు

కుప్పం (చిత్తూరు జిల్లా): టీడీపీ నేత, కుప్పం మునిసిపల్ కౌన్సిలర్ భర్త వేలు సహా ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుప్పం 11వ వార్డు కౌన్సిలర్ కస్తూరి భర్త అయిన వేలు ఆదివారం తన గృహంలోనే జూదశాల నిర్వహిస్తున్నాడు. వేలుతోపాటు మరో ఆరుగురు టీడీపీ నేతలు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారినుంచి రూ.96 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

రెండేళ్లుగా సొంతింట్లోనే జూదశాల

టీడీపీ నేత వేలు రెండేళ్లుగా సొంతింట్లోనే జూద శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఎవరికీ అనుమానం రాకుండా ఇంటిబయట మహిళలు కాపలా ఉంటూ.. లోపల పెద్దఎత్తున పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఇక్కడ నిత్యం రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్టు సమాచారం. జూదరులకు ఇక్కడే భోజనాలు, మద్యం, ఇతర వసతులు ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఇక్కడకు పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున టీడీపీ మద్దతుదారులు వస్తున్నట్టు తెలిసింది. ఈ శిబిరంపై నిఘా ఉంచిన కుప్పం సీఐ శ్రీధర్ ఆదివారం తన సిబ్బందితో కలిసి ఆ ఇంటిపై దాడి చేశారు. వేలుతోపాటు టీడీపీ నేతలైన లక్ష్మీపురానికి చెందిన శ్రీధర్, క్రిష్ణదాసనపల్లికి చెందిన జేడీ, డీకే పల్లికి చెందిన సత్యనారాయణ, పళని, చిన్నయ్య, చక్రవర్తి, నాగేంద్రపై కేసు నమోదు చేశారు. వారిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీధర్ తెలిపారు.



చంద్రబాబుతో టీడీపీ నేత వేలు

వర్షపు నీటిని వేగంగా తొలగించేందుకు చర్యలు

- వెలిగొండ టన్నెల్‌ను పరిశీలించిన మంత్రి ఆదిమూలపు సురేశ్



సొరంగ నిర్మాణ ప్రాంతంలో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న మంత్రి సురేశ్

పెద్దదోర్నాల: భారీ వర్షాల వల్ల కొత్తూరు వద్ద వెలిగొండ టన్నెల్ పనుల ప్రాంతంలోకి వచ్చి చేరిన నీటిని తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదిమూలపు సురేశ్ ఆదేశించారు. ఆదివారం ఆయన అధికారులతో కలిసి వెలిగొండ టన్నెల్ పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి సురేశ్ మాట్లాడుతూ.. వర్షపు నీటి తీవ్రత వల్ల కొంత మేర టన్నెల్ తవ్వకం పనులకు అంతరాయం ఏర్పడిందని చెప్పారు. నల్లమల అభయారణ్యంలో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల నీరు మొదటి టన్నెల్ నుంచి 2వ టన్నెల్‌లోకి ప్రవేశించిందని తెలిపారు. ఇక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 9 మోటర్ల ద్వారా నీటిని తోడివేస్తున్నారని, అదనంగా మరో 9 మోటర్లు పెట్టి మూడు రోజుల్లోగా నీటిని తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం టన్నెల్ నిర్మాణ ప్రాంతంలో 485 హార్స్ పవర్‌తో నడిచే విద్యుత్ మోటర్లు పని చేస్తున్నాయని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన నీటిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట మేరకు అనుకున్న సమయానికే ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షపు నీరు వల్ల కొంత మేర పనులకు ఆటంకం కలిగిందన్న ఆందోళన ఉన్నప్పటికీ.. ఎక్కడో కొల్లంవాగు నుంచి నీరు ఇలా కొత్తూరు వద్దకు చేరడం మంచి అనుభూతిని కలిగించిందన్నారు.

తెలంగాణ

ఆస్తిస్తేనే అమ్మ శవాన్ని తీసుకెళ్తాం

- అనారోగ్యంతో జిల్లా ఆస్పత్రిలో తల్లి మృతి
- ఆస్తివ్వలేదని శవాన్ని పట్టుకెళ్లని కూతుళ్లు



కిష్టవ్వ (ఫైల్)

కామారెడ్డి టౌన్: 'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు'.. అన్న కవి అందెశ్రీ వేదనకు అద్దంపట్టే అమానవీయ సంఘటన ఇది. తల్లి బ్యాంకు ఖాతాలోని డబ్బుల కోసం వాదులాడుకుంటున్న కూతుళ్లు.. ఆస్పత్రిలో ఆమె కన్నుమూస్తే మృతదేహాన్ని తీసుకెళ్లకుండా వదిలేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన కిష్టవ్వ (70) అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు గత నెల 21న కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న కిష్టవ్వ పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలు కిష్టవ్వకు ముగ్గురు కూతుళ్లు ఉండగా, ఒక కూతురు గతంలోనే మరణించింది. భర్త గతంలోనే మృతి చెందాడు. ఉన్న ఇద్దరు కూతుళ్లు ఎల్లవ్వ, పెంటవ్వ తల్లి బాగోగులు చూసుకున్నారు. తల్లి అనారోగ్యంతో ఆస్పత్రి పాలవడంతో ఆర్‌బీనగర్‌లో ఉన్న ఇల్లు, కిష్టవ్వ పేరున బ్యాంక్‌లో ఉన్న రూ.లక్షా 70 వేల కోసం ఇద్దరు కూతుళ్లు గొడవ పడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో డబ్బులు ఇవ్వాలని తల్లిపై కూడా చేయి చేసుకున్నట్లు తెలిసింది. మృతురాలికి వారసునిగా ఆమె బంధువుల్లో ఒకరు ఉన్నారు. ఇదే అక్కసుతో మొదటి నుంచి తల్లిని డబ్బుల కోసం ఇబ్బంది పెడుతున్నారు. ఇదే క్రమంలో ఆస్పత్రిలో ఉన్న తల్లిని రెండు రోజుల క్రితం ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయారు. శనివారం తల్లి మృతి చెందినట్టు ఆస్పత్రి వర్గాలు సమాచారం ఇచ్చినా కూతుళ్లు స్పందించలేదు. వృద్ధురాలి పేరున బ్యాంక్‌లో ఉన్న డబ్బు, ఇల్లు తమకు పంచి ఇచ్చే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లబోమని ఇద్దరూ తెగేసి చెప్పారు. దీంతో ఆస్పత్రి అధికారులు, పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

చంద్రబాబుది రాజకీయ యాత్ర

- చిట్‌ఫండ్ కేసులో జైలుపాలైన నేతలను కలిసేందుకే రైతుల పేరిట డ్రామా
- 72 గంటల్లో ధాన్యం కొనాలని అల్టిమేటం ఇవ్వడమేంటి?
- ఏప్రిల్ 16 నుంచే ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న విషయం తెలీదా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఫైర్



సాక్షి, రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన పర్యటన రాజకీయ యాత్ర అని.. నిజానికి అది చిట్‌ఫండ్ వ్యవహారంలో అరెస్టయి జైలులో ఉన్న టీడీపీ నేతలు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసులను పరామర్శించేందుకు చేసిన పర్యటన అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎద్దేవా చేశారు. కానీ, పైకేమో రైతులను ఆదుకునేందుకు వచ్చినట్లు కలరింగ్ ఇచ్చారన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడ్రోజుల పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించిన చంద్రబాబు 72 గంటల్లో మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనేయాలని అల్టిమేటం ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని ఆక్షేపించారు. ఏప్రిల్ 16 నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన సంగతి ఆయనకు తెలీదా అని ప్రశ్నించారు. 9వ తేదీ నుంచి పంటనష్టాలను అంచనా వేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండగా.. వర్షాలు కురుస్తుండగానే సాయం అందించలేదని విమర్శించడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని రాజా మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో రంగు మారిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యం ఎప్పుడైనా కొన్నారా అని సూటిగా ప్రశ్నించారు.

అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా..

రబీకి సంబంధించి టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.11,014 కోట్లతో 74,69,981 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పెట్టిన బకాయిలు చెల్లిస్తూనే.. 1,31,83,454 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు రూ.24,488 కోట్లు చెల్లించిందని రాజా వివరించారు. అలాగే, గతంలో 4.31 లక్షల మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయగా.. సీఎం జగన్ పాలనలో 9.97 లక్షల మంది నుంచి ధాన్యం కొనుగోలు చేశారని చెప్పారు. నిజానికి.. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం కూడా కొనుగోలు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశించిన విషయాన్ని గ్రహించాలని విజ్ఞప్తిచేశారు. రైతులపై భారంలేకుండా పంటల బీమా మొత్తం ప్రభుత్వమే చెల్లించడంతోపాటు ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి అదే సీజన్‌లో బీమా పరిహారం చెల్లిస్తోందని జక్కంపూడి రాజా గుర్తుచేశారు. ప్రభుత్వ విధానాలతో సీఎంకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే చంద్రబాబు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇక తూర్పు గోదావరిలో ఈనెల ఆరో తేదీ నాటికి 1,18,466 టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయన్నారు. చంద్రబాబు ఆలోచన తీరు మారకపోతే వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు మరోసారి బుద్ధి చెబుతారని ఆయనన్నారు.

తెలంగాణ

అనారోగ్యంతో మావోయిస్టు నేత మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మావోయిస్టు పార్టీ బీఎస్‌పీసీ సభ్యుడు బసంత్ అలియాస్ సోమ్లు, అలియాస్ రవి అనారోగ్యంతో మావోయిస్టుల వైద్య శిబిరంలో మృతి చెందినట్లు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి సమత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్చోలి గ్రామానికి చెందిన బసంత్ 26 ఏళ్ల క్రితం మావోయిస్టు పార్టీలో చేరారు. తాడిమెట్ల, ఉర్పల్‌మెట్ట, టోంగ్‌గూడ, బట్టిగూడ తదితర ప్రాంతాల్లో జరిగిన విధ్వంసకర ఘటనలలో ఆయన పాల్గొన్నట్టు లేఖలో పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ఆయుధ కర్మాగారానికి బసంత్ నేతృత్వం వహించారని, వందలాది ఆయుధాలు, పేలుడు సామగ్రి తయారు చేయడం ద్వారా పీఎల్‌జీఏను బలోపేతం చేశాడని వివరించారు. ఈ క్రమంలో బసంత్ అనారోగ్యంతో ఈనెల 3న తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలోనే ప్రాణాలు విడిచారని పేర్కొన్నారు.

తెలంగాణ

హైదరాబాద్‌లో రాజశ్యామల అమ్మవారి ఆలయ నిర్మాణానికి శిలాన్యాసం

- విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి చేతులమీదుగా కార్యక్రమం



దేవాలయ శిలాన్యాస పూజలు చేసిన స్వరూపానందేంద్ర స్వామి

మణికొండ(హైదరాబాద్): హైదరాబాద్ నగర శివారు కోకాపేటలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రెండు ఎకరాల భూమిలో రాజశ్యామల అమ్మవారి ఆలయం నిర్మాణానికి ఆదివారం విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి స్వాత్మానందేంద్రస్వామితో కలిసి శిలాన్యాసం చేశారు. ఈ సందర్భంగా స్వరూపానంద్రేంద స్వామి మాట్లాడుతూ కలియుగంలో శక్తివంతమైన అమ్మవారు రాజశ్యామల అని.. ఆమె అనుగ్రహంతోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా ప్రగతిపథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. కోకాపేటలో అమ్మవారి దేవాలయ నిర్మాణాన్ని ఒక్క దాతే చేపడతానని ముందుకొచ్చినా.. భక్తులందరికీ అందులో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో అందుకు అంగీకరించలేదని పీఠాధిపతి పేర్కొన్నారు. దేశంలో అనేక పీఠాలు, ఉప పీఠాలున్నా వాటికి భిన్నంగా విశాఖ శారదా పీఠం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, టీఎస్ఆర్టీసీ కమిషనర్ సజ్జనార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేరళలో బోటు మునక.. 18 మంది మృతి

మలప్పురం: కేరళలోని మలప్పురంలో పర్యాటకులతో వెళ్తున్న పడవ బోల్తా పడి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో తానూర్‌లోని పర్యాటక ప్రాంతం తూర్వాల్ తీరమ్ వద్ద ఘటన చోటుచేసుకుంది. ప్రమాద ఘటన సమయంలో 30 మందికి పైగానే బోటులో ఉన్నట్లు చెబుతున్నారు. ఆరుగురి కాపాడామని యంత్రాంగం తెలిపింది.

అమెరికా మాల్‌లో కాల్పులు.. 8 మంది దుర్మరణం

హ్యూస్టన్: అమెరికాలో కాల్పుల పరంపర కొనసాగుతూనే ఉంది. శనివారం మధ్యాహ్నం టెక్సాస్ రాష్ట్రం అలెన్ పట్టణంలో ఓ మాల్‌లో జరిగిన కాల్పుల్లో 8 మంది చనిపోయారు. కారులో వచ్చిన దుండగుడు జనంపైకి ఇష్టారాజ్యంగా కాల్పులకు తెగబడ్డాడు. దాంతో అక్కడి వారంతా భయంతో కేకలు వేస్తూ రక్షణ కోసం పరుగులు తీశారు. కాల్పుల శబ్దాలు, జనం కేకలతో అక్కడ విధుల్లో ఉన్న ఓ పోలీసు అప్రమత్తమై సాయుధున్ని కాల్చి చంపాడు. అప్పటికే దుండగుని కాల్పుల్లో ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. ముగ్గురు ఆస్పత్రిలో కన్నుమూశారు. అమెరికాలో ఈ ఏడాదిలో నాలుగు నెలల్లోనే ఇప్పటిదాకా 198 మాస్ షూటింగులు జరిగాయి. నలుగురు, అంతకంటే ఎక్కువమంది చనిపోతే మాస్ షూటింగ్‌గా చెబుతారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురు...

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మెక్సికో సరిహద్దులోని బ్రౌన్స్‌విల్లే నగర సమీపంలో బస్టాప్ వద్ద ఓ కారు రోడ్డుపై నిల్చున్న జనంపై దూసుకొచ్చింది. ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఏడుగురు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

బంగారు గనిలో ప్రమాదం.. 27 మంది మృతి

లిమా: దక్షిణ అమెరికా దేశం పెరూలోని ఓ బంగారు గనిలో సంభవించిన అగ్నిప్రమాదంలో 27 మంది మృతి చెందారు. ఇద్దరిని మాత్రమే రక్షించగలిగామని అధికారులు తెలిపారు. అరెక్విపా ప్రాంతంలోని ఎస్పెరాంజా గనిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ఘటన చోటుచేసుకుంది. గనిలో సుమారు 100 మీటర్ల లోతులో సిబ్బంది పనిచేస్తున్న చోట మంటలు చెలరేగినట్లు సమాచారం. ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు గనులు పెరూలో ఉన్నాయి. ఏటా వీటి నుంచి 100 టన్నుల బంగారాన్ని వెలికితీస్తుంటుంది. ప్రపంచంలోని బంగారం ఉత్పత్తిలో ఇది 4%.

కింగ్ చార్లెస్ చుట్టూ నిబంధనాలు



బ్రిటన్ రాజుగా చార్లెస్ 3 పట్టాభిషిక్తుడయ్యాడు. ఒక దేశానికి రాజుగా కిరీటధారణ జరిగితే ఇక ప్రతి రోజూ రాజభోగాలు అనుభవించడమే అనుకుంటే పొరపాటే. విందు వినోదాలు, చుట్టూ వందిమాగధులు, ఏ చిన్న పనికైనా జీ హుజూర్ అనే సేవకులు ఇవన్నీ ఉన్నప్పటికీ మరిన్ని ఆంక్షల చట్రంలో బతకాల్సి ఉంటుంది. రాజు ప్రాణం ప్రజలకు ఎంతో విలువైనది. అందుకే భద్రతా కారణాలు, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలతో కొన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఒక రకంగా బంగారు పంజరంలో బంధించినట్టుగా స్వేచ్ఛను కోల్పోవలసి ఉంటుంది. 70 ఏళ్ల క్రితం రాణి ఎలిజబెత్ నాటి నిబంధనలే ఇప్పటికీ అమల్లో ఉన్నాయి. కింగ్ చార్లెస్ అవి ఇష్టం ఉన్నా లేకపోయినా పాటించి తీరవలసిందే.

\- సాక్షి, నేషనల్ డెస్క్

కానుకల స్వీకరణ తప్పనిసరి

బ్రిటన్ రాజ సంప్రదాయం ప్రకారం వారికొచ్చే కానుకల్ని తప్పనిసరిగా స్వీకరించాలి. దేశంలో వివిధ ప్రాంతాలు సందర్శించినప్పుడు ఇతర దేశాల పర్యటనలకి వెళ్లినప్పుడు రాజుపై గౌరవంతో చాలా మంది రకరకాల కానుకలు ఇస్తారు. వాటిని రాజు తప్పకుండా తీసుకోవాలి. ఒకవేళ ఆ కానుకలు ఏదైనా ప్రత్యుపకారం పొందడం కోసం ఇస్తూ ఉంటే మాత్రం రాజకుటుంబం వారు కానుకల్ని తిరస్కరించే అవకాశం కూడా ఉంది. ఆ సమయంలో వారి మనోభావాలు దెబ్బ తినకుండా చూసుకోవాలి.

విలియంతో ప్రయాణించలేరు

బ్రిటన్ రాజుతో పాటు వారసుడు కూడా ముఖ్యమే. కింగ్ చార్లెస్ తర్వాత సింహాసనం అధిష్ఠించే వారసత్వపు హక్కు కలిగిన ప్రిన్స్ విలియమ్‌తో కలిసి ఆయన ఎక్కడికీ ప్రయాణించకూడదు. ఇద్దరూ వేర్వేరు విమానాలు, వాహనాల్లోనే వెళ్లాలి. ఎందుకంటే ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఇద్దరి ప్రాణాలకు ముప్పు ఉండకూడదన్న భావనతో ఈ నిబంధన తీసుకువచ్చారు.

వస్త్రధారణ

రాజు ధరించే వస్త్రధారణకి కూడా కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయి. దౌత్యపరంగా అనుకూలంగా ఉండే డ్రెస్సింగ్ స్టైల్ ఉంటుంది. రాజు ఏ దేశానికి వెళితే ఆ దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే దుస్తులే ధరిస్తారు. ఇక రాజు తనతో పాటు ఎప్పుడూ నలుపు రంగు వస్త్రాలు తీసుకువెళతారు. ఎక్కడికైనా వెళ్లినప్పుడు అనుకోని పరిస్థితుల్లో అంత్యక్రియలకి హాజరుకావాల్సి వస్తే అప్పుడు వేసుకోవడం కోసం నల్ల బట్టలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి.

ఓటుకి దూరం

బ్రిటన్ రాజు ఎప్పుడూ రాజకీయాల్లో తటస్థ వైఖరి అవలంబించాలి. ఏ పార్టీకి అనుకూలంగా కానీ, వ్యతిరేకంగా కానీ మాట్లాడకూడదు. అయితే పలు సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించవచ్చు. రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కు ఉన్నప్పటికీ రాచ కుటుంబ సంప్రదాయాల ప్రకారం ఓటింగ్‌కి కూడా దూరంగా ఉంటారు.

షెల్ ఫిష్ తినలేరు

రాజుతో సహా బ్రిటన్ రాచకుటుంబీలు అందరూ షెల్‌ఫిష్‌కు దూరంగా ఉండాలి. ఫుడ్ పాయిజనింగ్‌కి అవకాశం ఉన్న తినకూడదన్న నిబంధనలైతే ఉన్నాయి. ఇక రాజు భద్రతే అత్యంత కీలకం కాబట్టి అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తినకూడదు.

డ్రైవింగ్ లైసెన్స్ అక్కర్లేదు

ఎన్ని రకాల ఆంక్షలున్నా బ్రిటన్ రాజు ఒక్కరికే ఉన్న సదుపాయం ఒకటుంది. అదే లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం. కారు డ్రైవ్ చేయాలని అనుకుంటే ఆయనకు లైసెన్స్ అక్కర్లేదు. పాస్‌పోర్ట్ లేకుండా ఏ దేశానికైనా ప్రయాణించవచ్చు.

సెల్ఫీలు ఆటోగ్రాఫ్‌లు ఉండవు

ప్రజలెవరైనా రాజుతో కలిసి సెల్ఫీ దిగాలని ముచ్చట పడితే అది కుదిరేపని కాదు. ఎవరికీ ఆటోగ్రాఫ్‌లు ఇవ్వకూడదు. అలా ఇస్తే రాజు సంతకం ఫోర్జరీ చేస్తారన్న భయం ఉంది. సెల్ఫీలు దిగకూడదు. రాజు కుటుంబ సభ్యులందరికీ ఇదే వర్తిస్తుంది. అయితే ప్రోటోకాల్స్‌లో ఈ నిబంధనని అధికారికంగా ఇంకా చేర్చలేదు.

నారీ శక్తితో గణతంత్రం

వచ్చే ఏడాది మహిళలతోనే రిపబ్లిక్ డే పరేడ్

మహిళా శక్తి సత్తా చాటడానికి కేంద్రం సన్నాహాలు



న్యూఢిల్లీ: భారత గణతంత్ర దినోత్సవ పరేడ్ అంటే మన దేశ త్రివిధ బలగాల శక్తిని ప్రపంచానికి చాటడమే. యుద్ధ శకటాలు, విమానాల విన్యాసాలు, కొత్త ఆయుధాల ప్రదర్శన ఇలా పరేడ్ అంటే కదనరంగంలో మన సత్తా ఎంతో ప్రదర్శించడమే. అలాంటి పరేడ్‌ను వచ్చే ఏడాది మహిళా శక్తితో నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నింగి నేలా నీరు అంతా మాదే అంటూ నినదిస్తున్న మహిళల భాగస్వామ్యం ఇటీవల కాలంలో త్రివిధ బలగాల్లో పెరుగుతోంది. యుద్ధ భూమిలోకి అడుగు పెట్టడానికి కూడా మహిళలు సై అంటున్నారు. కేంద్ర బలగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడం కోసం 2024 జనవరి 26న కర్తవ్యపథ్‌లో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌ను కేవలం మహిళలతో నిర్వహించాలని రక్షణ శాఖ ఫిబ్రవరిలో ప్రతిపాదించింది. దీనిపై ఫిబ్రవరిలో రక్షణ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో త్రివిధ బలగాల అధిపతులతో ఒక సమావేశం కూడా జరిగిందని ఆదివారం రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. త్రివిధ బలగాల్లోని మహిళా అధికారులే రిపబ్లిక్ డే కవాతుని నడిపిస్తారని ఆ సమావేశం నిర్ణయించింది. ఈ విషయాన్ని వివిధ ప్రభుత్వ శాఖలకి కూడా సమాచారం అందించారు. రక్షణ , హోం సంస్కృతి పట్టణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా దీనిని ఎలా అమలు చేయాలో చర్చిస్తున్నట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది రిపబ్లిక్ డేలో నారీ శక్తి థీమ్‌ను ప్రధానంగా చేశారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, త్రిపుర రాష్ట్రాలు నారీశక్తి థీమ్‌తో శకటాలు రూపొందించాయి. ఇక వచ్చే ఏడాది అందరూ మహిళలతోనే పరేడ్ సాగనుంది.

డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్‌ను 21లోగా అరెస్ట్ చేయాలి

లేకుంటే ముఖ్యమైన నిర్ణయం ప్రకటిస్తాం

- ప్రభుత్వానికి రైతు సంఘాల అల్టిమేటం
- పోరాటం ఉధృతం చేస్తామన్న వినేశ్ ఫొగాట్
- తప్పు రుజువైతే చెప్పులతో కొట్టి చంపండి
- వీడియో విడుదల చేసిన డబ్ల్యూఎఫ్ఐ చీఫ్



జంతర్ మంతర్ వద్ద కొవ్వొత్తులతో రెజ్లర్ల నిరసన


న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ బాధిత మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన నిరసన కీలక మలుపు తిరిగింది. ఆదివారం నిరసన దీక్షా శిబిరం వద్దకు భారతీయ కిసాన్ సంఘ్(బీకేయూ) నేత రాకేశ్ తికాయత్, ఖాప్ మహమ్ 24 నేత మెహర్ సింగ్, సంయుక్త కిసాన్ మోర్చాకు చెందిన దేవ్ సింగ్ సిర్సా తదితరులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సంఘీభావం తెలిపారు. 'ఇకపై ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసనల్లో పాల్గొంటాం. రెజ్లర్లకు వెలుపలి నుంచి మద్దతు తెలుపుతామన్నారు. వారికేదైనా సమస్య వస్తే తోడుంటాం'అని రైతు సంఘాల నేతలు చెప్పారు. బాధిత రెజ్లర్ల డిమాండ్ల కోసం ఈ నెల 11–18 తేదీల మధ్య దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేసి, సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 21న సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇవి రాజకీయ నిరసనలు కావు.. తమది రాజకీయేతర సంస్థ అని చెప్పారు. ఇలా ఉండగా, తమ నిరసనలు యథావిధిగా కొనసాగుతాయని రెజ్లర్ వినేశ్ ఫొగాట్ తెలిపారు. ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావడంతో ఆదివారం జంతర్ మంతర్ వద్ద భారీగా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్)ను మోహరించారు. ఇలాఉండగా, నిరసనకు దిగిన రెజ్లర్లకు రైతు సంఘాలు మద్దతు తెలపడంపై డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ స్పందించారు. ఢిల్లీ పోలీసుల దర్యాప్తు పూర్తయ్యేదాకా వేచి చూడాలని కోరారు. ఒక్క ఆరోపణ రుజువైనా ఉరి వేసుకుంటానన్నానంటూ ఒక వీడియో పోస్ట్ చేశారు. ఆరోపణలు రుజువైతే శిక్ష విధించండి. దోషిగా తేలితే నన్ను కొట్టి చంపండి'అని పేర్కొన్నారు.

సౌర కుటుంబం అంచున జలరాశి!

యురేనస్ నాలుగు ఉపగ్రహాలపై సముద్రాలు • నూతన కంప్యూటర్ మోడల్‌తో గుర్తించిన నాసా సైంటిస్టులు

జీవుల మనుగడకు ఆధారం జలం. భూగోళంపై తొలుత నీరు, ఆ తర్వాత మనుషులతో సహా రకరకాల జీవులు పుట్టుకొచ్చినట్లు అనేక పరిశోధనల్లో తేటతెల్లమయ్యింది. మొట్టమొదటి జీవి నీటిలోనే పుట్టిందట. విశ్వంలో భూమిపైనే కాకుండా ఇంకెక్కడైనా జలరాశి ఉందా? అనేదానిపై సైంటిస్టులు శతాబ్దాలుగా అన్వేషణ కొనసాగిస్తున్నారు. ఇతర గ్రహాలు లేదా వాటి ఉపగ్రహాలపై నీటి జాడ ఉన్నట్లు తేలితే అక్కడ జీవులు సైతం ఉండేందుకు ఆస్కారం లేకపోలేదు. సూర్యుడి ప్రభావం పెద్దగా ఉండని సౌర వ్యవస్థ అంచుల్లోనూ జల అన్వేషణ సాగుతోంది. ఈ విషయంలో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' సైంటిస్టులు పురోగతి సాధించారు. మన సౌర కుటుంబం కొసభాగాన యురేనస్ గ్రహానికి చెందిన ఉపగ్రహాలపై మహా సముద్రాలు ఉన్నాయని చెప్పడానికి ఆధారాలు కనిపెట్టారు.

- యురేనస్ గ్రహానికి దాదాపు 27 ఉపగ్రహాలు ఉన్నాయి. అవి యురేనస్ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. వీటిలో ఏరియల్, అంబ్రియెల్, టైటానియా, ఒబెరాన్, మిరండా అనేవి ప్రధానమైనవి. ఇందులో టైటానియా అన్నింటికంటే పెద్దది.
- యురేనస్‌పై పరిశోధనల కోసం 1980వ దశకంలో ప్రయోగించిన వొయేజర్–2 అంతరిక్ష నౌక అందించిన సమాచారాన్ని, నాసా ప్రయోగించిన గెలీలియో, కాసినీ, డాన్, న్యూహోరిజాన్స్ స్పేస్‌క్రాఫ్ట్‌లు పంపించిన సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించారు. ఇందుకోసం నూతన కంప్యూటర్ మోడల్‌ను ఉపయోగించారు.
- యురేనస్ ఉపగ్రహాల అంతర్గత నిర్మాణం, వాటి ఉపరితలం స్వభావాన్ని సూక్ష్మస్థాయిలో పరిశీలించారు.



- ప్రధానమైన ఐదు ఉపగ్రహాల్లో నాలుగు ఉపగ్రహాల ఉపరితల పొర అంతర్గత వేడిని రక్షిస్తున్నట్లు గుర్తించారు. అంటే ఉపగ్రహ అంతర్భాగంలోని వేడి బయటకు వెళ్లకుండా ఆ పొర నిరోధిస్తున్నట్లు కనిపెట్టారు.
- ఏదైనా గ్రహంపై సముద్రం ఏర్పడాలంటే దాని అంతర్భాగంలో తగిన ఉష్ణోగ్రత ఎల్లప్పుడూ ఉండాలి.
- సాధారణంగా గ్రహాల లోపలి భాగంలో సలసల కాగే శిలాద్రవం(లావా) ఉష్ణోగ్రతను విడుదల చేస్తూ ఉంటుంది. సముద్రాల ఉనికికి ఈ లావా నుంచి వెలువడే ఉష్ణం తోడ్పడుతుంది. యురేనస్ ఉప గ్రహాల్లో ఇలాంటి అనుకూల పరిస్థితులు ఉన్నట్లు వెల్లడయ్యింది.
- సౌర వ్యవస్థ అంచున మిరండా సహా నాలుగు ఉపగ్రహాలపై సముద్రాలు కచ్చితంగా ఉన్నట్లు అంచనా వేస్తున్నామని పరిశోధకులు వెల్లడించారు.
- యురేనస్ ఉపగ్రహాలపై ఉన్న సముద్రాల్లో క్లోరైడ్, అమోనియా వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండే అవకాశం ఉన్నట్లు భావిన్నారు.
- యురేనస్ గ్రహం సూర్యుడి నుంచి ఏడో గ్రహం. ఇది వాయువులతో నిండిన భారీ మంచు గ్రహం. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్‌తో యురేనస్‌ను ఇటీవల పరిశీలించారు. అది చిన్నపాటి సౌర వ్యవస్థతో కూడుకొని ఉన్న గ్రహమని చెబుతున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతం

చర్ల: తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ చర్ల లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్ కమాండర్ మడకం ఎర్రయ్య అలియాస్ రాజేష్ ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పుట్టపాడు అటవీ ప్రాంతంలో కూంబింగ్ జరుపుతున్న పోలీసులపైకి మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు.

రాజస్తాన్‌లో భారీగా లిథియం నిల్వలు

జైపూర్: అత్యంత ఖరీదైన లిథియం ఖనిజ నిల్వలు రాజస్తాన్‌లో భారీ స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రంలో డేగానా(నాగౌర్)లోని రెన్వాత్ కొండ ప్రాంతంలో ఈ నిల్వలు నిక్షిప్తమైనట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ), మైనింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో గుర్తించిన లిథియం నిల్వల కంటే రాజస్తాన్‌లో అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. మన దేశ అవసరాల్లో 80 శాతం అవసరాలను రాజస్తాన్‌లోని నిల్వలు తీర్చగలవని అన్నారు. భారత్ లిథియం కోసం ప్రధానంగా చైనాపై ఆధారపడుతోంది. తాజాగా బయటపడిన నిల్వలతో చైనా గుత్తాధిపత్యానికి తెరపడడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాల్లోనే ఈ ఖనిజం ఉంది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, విద్యుత్ వాహనాలు, బ్యాటరీల తయారీలో లిథియం ఉపయోగిస్తున్నారు.

రేపు దేశవ్యాప్త హనుమాన్ చాలీసా పఠనం

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నిర్ణయం

బెంగళూరు: దేశవ్యాప్తంగా ఈ నెల 9న హనుమాన్ చాలీసా పఠించాలని విశ్వహిందూ పరిషత్, ఆ సంస్థ యువజన విభాగం బజరంగ్‌దళ్ నిర్ణయించాయి. కులం, మతం ఆధారంగా సమాజంలో మత విద్వేషాలను ప్రేరేపించే వ్యక్తులు, సంస్థలపై తీవ్ర చర్యలు తీసుకుంటామంటూ వారం క్రితం కాంగ్రెస్ పార్టీ వెలువరించిన కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విషయం తెలిసిందే.

మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు

పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ సడలింపు

ఇంఫాల్/న్యూఢిల్లీ: గిరిజన, గిరిజనేతరుల నడుమ భీకర ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో క్రమంగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ నిబంధనలు సడలించారు. జనం ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు. ఆహారం, నిత్యావసరాలు కొనుగోలు చేస్తున్నారు. మణిపూర్‌లో పరిణామాలపై దర్యాప్తునకు ఆదేశించాలని పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గిరిజనేతరులైన మైతీలకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ మణిపూర్ హైకోర్టుజారీ చేసిన ఉత్తర్వును నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ సమర్పించారు. హింసాకాండపై సమగ్ర దర్యాప్తును కోరుతూ ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ 'మణిపూర్ ట్రైబల్ ఫోరం' సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై న్యాయస్థానం సోమవారం విచారణ చేపట్టనుంది.

ఏ 'ఇంజిన్'కు ఎంత కమీషన్?

ప్రధాని మోదీని ప్రశ్నించిన రాహుల్‌గాంధీ

బనశంకరి: కర్ణాటక ప్రభుత్వ అవినీతిపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఆదివారం బెంగళూరు నగర జిల్లాలోని ఆనేకల్‌లో ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. 'మూడేళ్లుగా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగుతోంది. ఇక్కడ అవినీతి విషయం ప్రధాని మోదీకి కూడా తెలుసు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని కూడా చెప్పుకుంటున్నారు. కానీ, ఈసారి డబుల్ ఇంజిన్ మాయమైంది. 40 శాతం కమీషన్‌లో ఏ ఇంజిన్‌కు ఎంత అందిందో కర్ణాటక ప్రజలకు మోదీజీ చెప్పాలి'అని అన్నారు.

అవినీతి, నిరుద్యోగమే అసలు ఉగ్రవాదం: ప్రియాంక

అవినీతి, దోపిడీ, అధిక ధరలు, నిరుద్యోగమే కర్ణాటకలో అసలు తీవ్రవాదమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా పేర్కొన్నారు. అధికార బీజేపీ ప్రజల వాస్తవ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఆదివారం దక్షిణ కన్నడ జిల్లా మూడబిదిరెలో కాంగ్రెస్ ప్రచారసభలో ఆమె ప్రసంగించారు.

స్కూటర్‌పై రాహుల్ చక్కర్లు



ఫుడ్ డెలివరీ బాయ్‌తో స్కూటర్ మీద రాహుల్ బెంగళూరులో సవారీ చేశారు. దారిలో ఒక హోటల్‌లో టిఫిన్ చేశారు. ఎస్‌సీజీ ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న కేరళ మాజీ సీఎం ఊమెన్ చాందీని పరామర్శించారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్స్, డెలివరీ బాయ్స్‌తో మాట్లాడారు. అధికారంలోకి వస్తే రూ.3 వేల కోట్ల కార్పస్ ఫండ్‌తో గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, అండగా నిలుస్తామన్నారు.

కర్ణాటకను వేరు చేసే కుట్ర

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ ఆగ్రహం	కర్ణాటక సార్వభౌమత్వం అంటే ఏమిటో ఆ పార్టీ చెప్పాలి	భారత్ వ్యతిరేకులతో కాంగ్రెస్ రహస్య భేటీలు	అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని

శివమొగ్గ/బనశంకరి: భారతదేశం నుంచి కర్ణాటకను వేరు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతోందని, అందుకోసం బహిరంగంగానే పిలుపునిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. 'తుక్డే తుక్డే గ్యాంగ్' వ్యాధి ఆ పార్టీలో టాప్ లెవల్‌కు చేరిందని అన్నారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేసే విషయంలో కాంగ్రెస్ 'రాజ కుటుంబం' ముందంజలో ఉంటుందని ఆరోపించారు. తన మనసులో చాలా బాధ ఉందని అన్నారు. ఆ రాజ కుటుంబం మన దేశంలో విదేశీ శక్తుల జోక్యాన్ని ప్రోత్సహిస్తోందని పరోక్షంగా సోనియా గాంధీ కుటుంబంపై మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు ఆటలను దేశం ఎప్పటికీ క్షమించబోదని తేల్చిచెప్పారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం మైసూరు జిల్లాలోని నంజనగూడులో బహిరంగ సభలో మాట్లాడారు. భారత్‌ను ద్వేషించే విదేశీ ప్రతినిధులతో కాంగ్రెస్ పార్టీ రహస్యంగా సమావేశమవుతోందని, మన దేశ సార్వభౌమత్వాన్ని కించపర్చే చర్యలకు తరచుగా పాల్పడుతోందని, అందుకు ఆ పార్టీ ఏమాత్రం సిగ్గుపడడం లేదని దుయ్యబట్టారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పరివారం అన్ని పరిమితులు దాటేసిందని, కర్ణాటక సార్వభౌమత్వాన్ని కాపాడతామని చెబుతోందని, తద్వారా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. అసలు కర్ణాటక సార్వభౌమత్వం అంటే ఏమిటో చెప్పాలని నిలదీశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతామని రాజ్యాంగంపై ప్రమాణం చేసి, ఇలాంటి మాటలు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు.



శివమొగ్గ జిల్లాలో ప్రచారసభలో మోదీకి జ్ఞాపిక

కర్ణాటక భారతదేశంలో లేదని కాంగ్రెస్ భావిస్తోందా? అని అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో కర్ణాటక అంతర్భాగమని మోదీ ఉద్ఘాటించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలని, బీజేపీ భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. నంజనగూడులో ప్రచారం తర్వాత ప్రధానమంత్రి శ్రీకంఠేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. నంజుండేశ్వర స్వామి వెండి ప్రతిమను బీజేపీ నేతలు ప్రధానికి బహూకరించారు.

ప్రజల మద్దతు మాకే..

కర్ణాటకలో తాము ఎక్కడికి వెళ్లినా ప్రజల మద్దతు సంపూర్ణంగా లభిస్తోందని, వారు తమను ఆశీర్వదిస్తున్నారని, రాష్ట్రంలో తాము మరోసారి అధికారంలోకి వస్తామన్న పూర్తి విశ్వాసం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆదివారం శివమొగ్గ సమీపంలోని ఆయనూరులో భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సుమారు 30 లక్షల ఉద్యోగాలను కల్పించిందని చెప్పారు. మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరిగిందని అన్నారు. అధికారం కోసం ఎదురు చూస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు తప్పుడు హామీలు ఇస్తోందని, అబద్ధాలను చెబుతోందని దుయ్యబట్టారు. కర్ణాటకలో కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాలను ప్రజలు నమ్మడం లేదని, ఆ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే ప్రచారం కోసం సోనియా గాంధీని రప్పించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అబద్ధాల గాలి బుడగను ప్రజలు పగులగొట్టడం ఖాయమని తేల్చిచెప్పారు.

బెంగళూరులో మూడో రోజు రోడ్ షో

ప్రధాని మోదీ వరుసగా మూడో రోజు ఆదివారం కూడా బెంగళూరులో రోడ్ షోలో పాల్గొన్నారు. 6 కిలోమీటర్ల మేర రోడ్ షో కొనసాగింది. బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలో ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మోదీపై పూలవర్షం కురిపించారు. మోదీ మోదీ, జై బజరంగబలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వేద పండితులు హనుమాన్ చాలీసా పఠించారు.



బ్రిటన్ రాజు చార్లెస్ పట్టాభిషేకం సందర్భంగా నిర్వహించే బిగ్ లంచ్ కార్యక్రమంలో భాగంగా లండన్‌లో అతిథులకు వడ్డిస్తున్న ప్రధాని రిషి

నెలంతా అందుబాటులో వండలూర్, గిండి పార్కులు

అన్నానగర్: వేసవి సెలవుల కారణంగా మే నెల మొత్తం వండలూర్, గిండి పార్కులు తెరిచే ఉంటాయని అటవీ శాఖ ఆదివారం ప్రకటించింది. వివరాలు.. చెన్నై సమీపంలోని వండలూరులోని జులాజికల్ పార్కుకు రోజుకు సగటున 4 వేల మందికి పైగా సందర్శకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో అయితే ఈ సంఖ్య 20 వేలకు పైగానే ఉంటుంది. అదేవిధంగా గిండి చిల్డ్రన్స్ పార్కుకు కూడా పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. ఈ రెండు పార్కులను ప్రతి మంగళవారం మూసివేస్తారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో మే నెల మొత్తం ఈ రెండు పార్కులను మంగళవారం కూడా తెరిచే ఉంచాలని అటవీశాఖ నిర్ణయించింది. అవసరమైతే సందర్శకుల కోసం సెంట్రల్ ఎయిర్‌పోర్ట్ మార్గంలోనూ మెట్రో రైళ్ల సర్వీసును పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఈమేరకు అధికారులు ప్రకటించారు.

న్యూస్‌రీల్

నేడు ప్లస్-2 ఫలితాలు



సాక్షి, చెన్నై : ప్లస్-2 పరీక్ష ఫలితాలను విడుదల చేయడానికి పాఠశాల రాష్ట్ర విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. సోమవారం ఉదయం 9.30 గంటలకుల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ ఫలితాలను ప్రకటించనున్నారు. వివరాలు.. రాష్ట్రంలో ప్లస్-2 పబ్లిక్ పరీక్షలు మార్చి 13 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరిగిన విషయం తెలిసిందే. 8,51,303 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 50 వేల మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్ష ముగియగానే, గత నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు 79 సెంటర్లలో స్పాట్ వాల్యుయేషన్ చేపట్టారు. ముందుగా నిర్ణయించిన మేరకు ఈనెల 5వ తేదీన ఫలితాల విడుదలకు చర్యలు తీసుకున్నారు. అయితే 7వ తేదీ ఆదివారం నీట్ పరీక్ష కావడంతో ఫలితాల వెల్లడిని వాయిదా వేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో సోమవారం ఫలితాలను ప్రకటించేందుకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. ఉదయం 9.30 గంటలకు విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ కోట్టూరుపురం అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయంలో ఫలితాలను విడుదల చేయనున్నారు. విద్యార్థులు ఫలితాలను తెలుసుకునేందుకు వీలుగా పత్యేక ఏర్పాట్లు చేశారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీఎన్ ఆర్‌ఈఎస్‌యూ ఎల్‌టీఎస్.ఎన్‌ఐసీ.ఇన్, డీజీఈ.టీఎన్.జీఓవీ.ఇన్, డీజీఈ1.టీఎన్. ఎన్‌ఐసీ.ఇన్, డీజీఈ2.టీఎన్. ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్లను విద్యాశాఖ ప్రకటించారు.

చెన్నై నుంచి మయన్మార్‌కు విమాన సేవలు ప్రారంభం



నీళ్లు చల్లి మయన్మార్ విమానానికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

తిరువొత్తియూరు: చెన్నై నుంచి మయన్మార్ (బర్మా)కు వారాంతపు విమాన సేవలు ప్రారంభమయ్యాయి. కాగా శనివారం మొట్టమొదట మయన్మార్ నుంచి చెన్నైకి వచ్చిన విమానానికి నీటిని చల్లి ఘన స్వాగతం పలికారు. మయన్మార్ నుంచి ఢిల్లీ, కోల్‌కత్తా, బిహార్ మధ్య విమాన సేవలు అందుతున్నాయి. ఈ క్రమంలో పాత బర్మా దేశమైనా మయన్మార్‌లో ఎక్కువ మంది తమిళ ప్రజలు నివాసిస్తున్నారు. వారు చెన్నైకి విమానసేవలు ప్రారంభించాలని గత కొన్నాళ్లుగా విజ్ఞప్తి చేసుకున్నారు. ఈ మేరకు మయన్మార్ నుంచి విమానాలు చెన్నైకి ప్రతి శనివారం ఉదయం 11 .15 గంటలకు చెన్నైకి వచ్చి తిరిగి మయన్మార్‌కి సాయంత్రం 3.15 గంటలకు వెళ్తుందని అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో శనివారం తొలి విమానం 48 మంది ప్రయాణికులతో చెన్నైకి వచ్చింది. సాయంత్రం అదే విమానంలో 78 మంది మయన్మార్‌కు వెళ్లారు.

వైభవంగా తిరుమాల్ మురుగన్ చిత్రోత్సవాలు

- కావళ్లతో మొక్కు చెల్లించిన భక్తులు



కొరుక్కుపేట: చిత్ర పౌర్ణమిని పురస్కరించుకుని చెన్నై కొరుక్కుపేటలోని తిరుమాల్ మురుగన్ ఆలయ చిత్రోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిశాయి. స్థానిక కొరుక్కుపేటలోని భారతి నగర్ మెయిన్ వీధిలో ప్రసిద్ధి చెందిన తిరుమాల్ మురుగన్ ఆలయం కొలువై ఉంది. ఈ ఆలయంలో ఏటా చైత్ర మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి రోజూ స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ముఖ్య ఘట్టమైన కావళ్ల ఊరేగింపు ఆదివారం ఉదయం కోలాహలంగా సాగింది. చెన్నై చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు పాల కావడి, పన్నీరు కావడి, పుష్ప కావడి, వేల్ కావడి, మశ్చ కావడి, పరవై కావడి వంటి పలు రకాల కావళ్లతో తరలివచ్చారు. మనలి మెయిన్ రోడ్డుపై ఉన్న ఎల్లయమ్మ ఆలయం వద్ద నుంచి భక్తులు కావళ్లను తిరుమాల్ మురుగన్ ఆలయానికి తీసుకువచ్చారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా హరోహరా నిదానంతో రోడ్డు పొడవునా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. దారిపొడవునా భక్తులకు అన్న పానీయాలను వితరణ చేశారు.

మూడో వసంతంలోకి..
జనరంజక పాలన!



అన్నాదురై సమాధి వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం

డీఎంకే అధినేతం స్టాలిన్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి రెండేళ్లు పూర్తయ్యింది. ఆదివారం డీఎంకే ప్రభుత్వం మూడో వసంతంలోకి అడుగు పెట్టింది. కాగా రెండేళ్ల ప్రగతిని చాటే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం డీఎంకే నేతృత్వంలో వేడుకలు, బహిరంగ సభలు పెద్దఎత్తున నిర్వహించారు. దివంగత నేతలు అన్నాదురై, కరుణానిధి సమాధుల వద్ద స్టాలిన్ ఘన నివాళులర్పించారు. అనంతరం కాంచీపురం జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని.. తన పాలనలో సాధించిన విజయాలను తెలియజేశారు.

- రాష్ట్ర అభివృద్ధికే తొలి ప్రాధాన్యం
- పల్లావరం సభలో స్పష్టం చేసిన సీఎం స్టాలిన్
- రాష్ట్రవ్యాప్తంగా ప్రగతి నివేదిక సభలు

సాక్షి, చెన్నై : పదేళ్లు అధికారానికి దూరం కావడం, ఇదే సమయంలో పార్టీ అధినేత కరుణానిధి మరణించడం వంటి పరిణామాల నేపథ్యంలో డీఎంకే పగ్గాలను అందుకున్న స్టాలిన్ తనదైన శైలిలో పార్టీని నడిపించారు. 2019 లోక్ సభ ఎన్నికలలో కూటమి అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల ద్వారా ఏకంగా అధికారాన్ని కైవసం చేసుకున్నారు. ముత్తు వేల్ కరుణానిధి స్టాలిన్ అని పదవీ ప్రమాణం చేసిన కొద్దిరోజుల్లోనే పాలనలో తనదైన మార్కు చూపించారు. ఈ సమయంలో రాష్ట్రంలో తాండవిస్తున్న కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో సఫలీకృతులయ్యారు. ఆ తదుపరి ఆర్థిక కష్టాల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తూ, ఎన్నికల వాగ్దానాల అమల్లో ప్రత్యేక చొరవ చూపించి ప్రజాదరణను సొంతం చేసుకున్నారు. ఈ రెండేళ్లలో చేసిన ప్రగతి, సాధించిన రికార్డులను ప్రజలకు వివరించే విధంగా ఆదివారం భారీ బహిరంగ సభలు నిర్వహించారు. తిరుగులేని పాలనే రెండేళ్ల సాక్షి అనే.. నినాదంతో వేడుకలే కాదు, సామాజిక మాధ్యమాల్లో ద్రవిడ మోడల్ నినాదం మారుమోగేలా హ్యాష్‌ట్యాగ్‌లు హోరెత్తాయి. ఇక ప్రగతి నివేదిక పేరుతో బహిరంగ సభలను సోమ, మంగళవారాల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించారు.

అన్నాదురై, కరుణకు నివాళి..

డీఎంకే ప్రభుత్వం మూడో వసంతంలోకి అడుగు పెట్టడంతో రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు హోరెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా డీఎంకే శ్రేణులు స్వీట్లు పంచి పెట్టడంతో పాటు బాణసంచా హోరెత్తించారు. అన్నదానాలు చేశారు. ఇక, డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ మెరీనా తీరంలోని దివంగత నేతలు అన్నాదురై, కలైంజర్ కరుణానిధి సమాధుల వద్ద



చెన్నై మెరీనా బీచ్‌లోని కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు

నివాళులర్పించారు. ముందుగా గోపాలపురం నివాసానికి చేరుకుని తల్లి దయాళు అమ్మాల్ ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ టీఆర్ బాలు, మంత్రులు ఉదయ నిధి స్టాలిన్, పొన్ముడి, తంగం తెన్నరసు, స్వామినాథన్, నాజర్, రఘుపతి, శేఖర్ బాబు, కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, సెంథిల్ బాలాజీ, తంగం తెన్నరసు, పెరియకరుప్పన్, అన్బరసన్, మనో తంగరాజ్‌లు సీఎం స్టాలిన్‌కు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

దుర్విమర్శలను పట్టించుకోం..

సీఎం స్టాలిన్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, విమర్శలను తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. మంచి చెబితే స్వీకరిస్తానని , చెడును పక్కన పెడుతానని వ్యాఖ్యానించారు. 2021లో ఇదే రోజున తాను చెప్పిన మాటలను మరో మారు గుర్తు చేస్తున్నట్లు 0 వివరించారు. తనకు ఓటు వేసిన వాళ్లకే కాకుండా.. వేయని వాపిరి లైకం ఉత్తమ సేవలను అందిస్తానన్నారు. రెండేళ్లు ఎలా పాలన సాగిందో, దానిని మించి మున్ముందు కొత్త పథకాలు, ప్రజల ఆర్థిక స్థితిని బలోపేతం చేసే కార్యక్రమాలను విస్తృతం చేయస్తామన్నారు. కాగా సాయంత్రం ద్రవిడ మోడల్ పాలనను చాటే విధంగా, తమిళ ప్రజల జీవితాలలో మరింత వెలుగు నింపే విధంగా కాంచీపురం జిల్లా పల్లావరం కంటోన్మెంట్‌లో బ్రహ్మాండ బహింగ సభ నిర్వహించారు. ఇందులో సీఎం స్టాలిన్ రెండేళ్ల ప్రగతిని వివరిస్తూ వ్యాఖ్యలు చేశారు.. లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతూ, ప్రజాదరణను కోరుతూ ప్రసంగించారు.



గోపాలపురంలోని నివాసంలో కరుణానిధి చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

'పళణి'పై కేసు నమోదు

సాక్షి, చెన్నై : అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడపాడి కె.పళణిస్వామిపై సేలం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎన్నికల నామినేషన్ ప్రమాణ పత్రంలో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు పేర్కొంటూ 3 సెక్షన్ల కింద కేసు పెట్టారు. వివరాలు.. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి 2021 అసెంబ్లీ ఎన్నికల్లో సేలం జిల్లా ఎడపాడి నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఎన్నికల నామినేషన్ సమయంలో సమర్పించిన ప్రమాణ పత్రంలో అనేక తప్పులు ఉన్నట్లు పేర్కొంటూ తేనికి చెందిన డీఎంకే నాయకుడు మిలానీ సేలం కోర్టులో పిటిషన్ వేశారు. 2016 ఎన్నికల్లో తన ఆస్తిని రూ. 3.16 కోట్లుగా పళణి స్వామి చూపించారని, అయితే 2021 ఎన్నికల్లో కోటి రూపాయల ఆస్తి వివరాలను పక్కన పెట్టి, లెక్కను తగ్గించి తప్పుడు సమాచారం అందించారని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి కలైవాణి సమగ్ర విచారణలో 30 రోజులలోచార్జ్‌షీట్ దాఖలు చేయాలని సేలం పోలీసులను ఆశ్రయించారు. దీనిని వ్యతిరేకిస్తూ పళని స్వామి చెన్నై హైకోర్టును ఆశ్రయించారు. తనపై ఫిర్యాదు చేసిన వ్యక్తి తన నియోజకవర్గానికి సంబంధించిన వారు కాదని, ఆయన తన ప్రత్యర్థి కూడా కాదని, తాను ఎలాంటి తప్పుడు సమాచారం ఇవ్వలేదని కోర్టుకు పళణిస్వామి వివరించారు. కాగా ఈ పిటిషన్ విచారణ దశలో ఉండగానే ఆదివారం పళణి స్వామిపై కేసు నమోదు చేయడం గమనార్హం.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

అన్నానగర్: చెన్నైలో ఆదాయపు పన్ను శాఖ ఉద్యోగిపై దాడి చేసిన యువకుడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. చెన్నై కీల్పాక్కం కుట్టియాప్పన్ స్ట్రీట్‌కు చెందిన రాజశేఖర్ (22) ఆదాయపు పన్ను శాఖలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గతేడాది అక్టోబర్ 4వ తేదీ మేడవాక్కం కులక్కరై రోడ్డు మీదుగా వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు అడ్డగించి దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌ను కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. తీవ్ర చికిత్స అనంతరం రాజశేఖర్ ఇంటికి చేరుకున్నాడు. దీని గురించి హెడ్ ఆఫీస్ కాలనీ పోలీసులు దర్యాప్తు చేసి కీల్పాక్కంలోని కుట్టియాపన్ స్ట్రీట్‌కు చెందిన యోవాన్ (21), అజిత్ (22)ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఈ కేసుకు సంబంధించి గత 7 నెలలుగా పరారీలో ఉన్న దీపక్ (22)ని శనివారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. తీవ్ర విచారణ అనంతరం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

ఘనంగా వసంతోత్సవాలు



ఆలయ కోనేటిలో స్వామి వారికి తీర్థవారి నిర్వహిస్తున్న శివాచార్యులు

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో ఏటా చిత్ర పౌర్ణమి రోజున సుమారు 20 లక్షలకు పైగా భక్తులు శివుడిగా భావించే కొండను 14 కిలోమీటర్లు దూరం చుట్టి వచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఇందులో బాగంగా అన్నామలైయార్ ఆలయంలో శుక్ర, శనివారం రోజల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. ఈ చిత్ర పౌర్ణమి ఉత్సవాల్లో అలసిపోయిన అన్నామలై సమేత ఉన్నామలై అమ్మవారికి తీర్థవారి ఉత్సవాలు శివాచార్యులు ఆలయ కోనేటిలో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు శివ నామస్మరణ మధ్య స్వామి వారికి ప్రత్యేక ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి పుష్పాలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



పుష్పాలంకరణలో విహరిస్తున్న స్వామివారు

కనుల పండువగా దశావతార వేడుకలు



విశేష అలంకరణలో కళ్లలగర్ స్వామి



దశావతారాలను తిలకిస్తున్న భక్తజనం

సాక్షి, చెన్నై: మదురై చిత్తిరై ఉత్సవాలు ముగింపు దశకు చేరాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు కళ్లగర్ స్వామి వారి దశావతార వేడుకలు కనులు పండవగా సాగాయి. వివరాలు.. మదురైలో చిత్తిరై ఉత్సవాలు అంగరంగ వైభంగా జరుగుతున్న విషయం తెలిసిందే. శైవం, వైష్ణవం ఐక్యతను చాటే విధంగా జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో మదురై మీనాక్షి అమ్మవారి సన్నిధిలో ఉత్సవాలు ముగిశాయి. ఇక కళ్లలగర్(విష్ణు) ఆలయంలో ఉత్సవాలు ముగింపు దశకు చేరాయి. శనివారం తేనూరులో మండుగ మునికి శాప విమోచనం చేసినానంతరం కళ్లలగర్ స్వామి వారు రామరాయర్ మండపానికి చేరుకున్నారు. ఇక్కడ రాత్రి 10 గంటల నుంచి ఆదివారం ఉదయం 4.30 గంటల వరకు దశావతార ఉత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆనంద రాయర్‌మండపంలో భక్తులకు స్వామి వారు దర్శనం ఇచ్చారు. అనంతరం 11.30 గంటలకు తాల్లకులం మన్నర్ సేతు పతి మండపం చేరుకున్నారు. ఇక్కడ స్వామి వారి ప్రత్యేక అభిషేకాలు పూజలు జరిగాయి. 8వతేదీ స్వామి వారి పుష్ప పల్లకిలో భక్తులకు దర్శనమిస్తారు. కరుప్పన్న స్వామి సన్నిధిలో పూజలఅనంతరం అళగర్‌మలైకు బయలుదేరి వెళ్తారు. 9వ తేది అళగర్ మలైకు చేరుకునే స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తారు. 10వ తేదీతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. ఆదివారం జరిగిన ఉత్సవంలో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

భద్రతా వైఫల్యంపై పళణి స్వామి ఆగ్రహం

మదురై చిత్తిరై ఉత్సవాల్లో భద్రత పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. 5వ తేదీ జరిగే కళ్లగర్ వైగై నదీ ప్రవేశ సమయంలో పోలీసులు , అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వైగై నదీలో మునిగి ముగ్గురు భక్తులు, తోపులాటలో మరో భక్తుడు మరణించినట్లు పేర్కొన్నారు. అలాగే ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తుడు ఒకరు ఆలయ సమీపంలో హత్యకు గురైనట్లు ఆరోపించారు. ఆ కుటుంబాలకు తన సానుభూతిని తెలియజేస్తూ, లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే వేడుకు సరైన భద్రత కల్పించక పోవడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు.

నిఘా నీడలో నీట్

- కట్టుదిట్టంగా ఆంక్షలు
- 1.47 లక్షల మంది విద్యార్థుల హాజరు
- పుదుచ్చేరిలో పరీక్ష భయంతో విద్యార్థి ఆత్మహత్య

సాక్షి, చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నీట్ పరీక్ష నిఘా నీడలో నిర్వహించారు. కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ పరీక్ష నిర్వహించారు. 1.47 లక్షల మంది విద్యార్థులు రాష్ట్రంలో పరీక్ష రాశారు. వివరాలు.. 2023-24 సంవత్సరానికి గాను ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలోని ఎంబీబీఎస్, బీడీఎస్, సిద్ధ, ఆయుర్వేదం, యునానీ, ఆర్మీ నర్సింగ్ తదితర వైద్య కోర్సుల ప్రవేశానికి నీట్ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగింది. రాష్ట్రంలో 1,47, 551 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 14 వేల మంది రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారు ఉన్నారు. చెన్నై, తిరుచ్చి, మదురై తదితర 24 జిల్లాల్లో నీట్ పరీక్ష జరిగింది. చెన్నైలో 28 కేంద్రాలలో 23 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తమిళం, ఆంగ్లం, తదితర 13 భాషలలో పరీక్ష రాసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించారు.



హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న అధికారులు

కట్టుదిట్టంగా సోదాలు..

ఈ పరీక్షకు హాజరైన విద్యార్థులు ఉదయం 11.30కు ఆయా కేంద్రాల వద్ద చేరుకున్నారు. 1.30 గంటలకు విద్యార్థులను లోనికి అనుమతించారు. తీవ్ర సోదాలు, కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను లోనికి అనుమతించలేదు. హాల్ టికెట్, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే లోనికి అనుమతించారు. విద్యార్థులకు తోడుగా వచ్చిన తల్లిదండ్రులు కేంద్రాల పరిసరాల వద్ద వేచి ఉన్నారు.

విద్యార్థి బలవన్మరణం

నీట్ పరీక్షను ఆది నుంచి తమిళనాడు, పుదుచ్చేరిలోని పార్టీలు వ్యతిరేకిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయినా ఏటా పరీక్ష నిర్వహిస్తూనే ఉన్నారు. అదే సమయంలో ఈ పరీక్ష సమీపిస్తున్నదంటే చాలు విద్యార్థుల్లో ఆందోళన తప్పడం లేదు. గత ఏడాది పరీక్షకు ముందుగా తమిళనాట పలువురు విద్యార్థులు బలన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఏడాది పరీక్ష భయంతో పుదుచ్చేరిలో తొలి మరణం నమోదైంది. పుదుచ్చేరి అన్నానగర్‌కు చెందిన హేమచంద్రన్(18) అనే విద్యార్థి గత ఏడాది నీట్ పరీక్ష రాశాడు. తక్కువ మార్కులు రావడంతో మరో ప్రయత్నానికి సిద్ధమయ్యాడు. గత సంత్సరం రోజులుగా నీట్‌కు శిక్షణ తీసుకుంటూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో గత రెండు రోజులుగా తీవ్ర ఆందోళనతో కనిపించి హేమచంద్రన్ ఆదివారం ఉదయం తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమాచారంతో అతడి కుటుంబ సభ్యులు తీవ్ర శోకంలో మునిగారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.




ఫీవర్ టెస్ట్ చేస్తున్న సిబ్బంది



పరీక్ష హాల్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

చెరువులను ప్రజలే పరిరక్షించుకోవాలి



పుళల్ చెరువులో వ్యర్థాలను తొలగించే పనులను ప్రారంభిస్తున్న మంత్రి నాజర్

తిరువళ్లూరు: జిల్లావ్యాప్తంగా ఉన్న చెరువులు, నీటి ఆధారిత ప్రాంతాలను పరిరక్షించే బాధ్యతను ప్రజలే తీసుకోవాలని రాష్ట్ర పాడిపరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి నాజర్ సూచించారు. చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే పుళల్ చెరువు, లింక్ కాలువల మరమ్మతు పనులు, చెత్త వ్యర్థాల తొలగింపు ప్రక్రియను ఎక్స్‌రే-పుళల్ రిజర్వాయర్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. ఈ పనులను మంత్రి నాజర్ ప్రారంభించి ప్రసంగించారు. ఉమ్మడి చెంగల్‌పట్టు జిల్లాలో సుమారు 3 వేల చెరువులు ఉన్నాయని, వీటిపైనే తాగు, సాగునీటికి ఆధారపడుతున్నట్లు వివరించారు. అయితే ఆక్రమణల వల్ల చెరువుల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లు, చెరువులను పరిరక్షించుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ దర్పకరాజ్, మేయర్ ఉదయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై
సోమవారం, 8, మే, 2023
సాక్షి

క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం



సాక్షి, చెన్నై: ఎస్ఎస్ఈలో సవీత ట్రాన్స్ డిసిప్లినరీ వార్షిక పరిశోధన సమ్మిట్ -2023 గత వారం పాటు జరిగింది. ఇందులో పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి తదితర అంశాలపై 1000 విద్యార్థుల ఆధ్వర్యంలో సృజనాత్మక పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఇందులో 100 ఉత్తమ పోస్టర్లను ఎంపిక చేశారు. వీటిని రూపొందించిన విద్యార్థులకు ఉత్తమ పోస్టర్ సర్టిఫికెట్లను సీమాట్స్ చాన్స్లర్ ఎన్ఎం వీరయ్యన్, యూనివర్సిటీ హెడ్ డాక్టర్ సుదీర్ కుమార్, ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్ సెల్వరాణి, డాక్టర్ రమేష్ అందజేశారు.

బిడ్డతో మహిళ ధర్నా



బిడ్డతో ధర్నా చేస్తున్న జ్యోతిమణి

తిరుత్తణి: మహిళా పోలీస్ స్టేషన్ ముందు బిడ్డతో మహిళ ధర్నా చేపట్టింది. వివరాలు.. తిరుత్తణి సమీపంలోని దిగువ నెడిగల్లు గ్రామానికి చెందిన శ్యామ్(25)కి జ్యోతిమణి(22)తో ఐదేళ్ల కిందట వివాహమైంది. ఈ దంపతులకు రెండేళ్ల వయస్సున్న ఓ పాప కూడా ఉంది. ఈ క్రమంలో పాదటూరుపేటకు చెందిన ఓ వివాహితతో శ్యామ్‌కు అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో 20 రోజుల కిందట వారిద్దరూ ఇంటి నుంచి పరారయ్యారు. దీంతో జ్యోతిమణి తిరుత్తణి మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు పట్టించుకోలేదంటూ తన బిడ్డతో కలిసి పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. కాగా బాధితురాలి వివరాలు సేకరించేందుకు వెళ్లిన ఓ విలేకరి సెల్‌ఫోన్‌ను హెడ్ కానిస్టేబుల్ సుమతి లాక్కోవడమే కాకుండా దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనపై విలేకర్లు స్థానిక డీఎస్పీ విఘ్నేష్‌కు ఫిర్యాదు చేశారు.

ఏవీఎం హెరిటేజ్ మ్యూజియం ప్రారంభం

తమిళసినిమా: ప్రఖ్యాత సినీ నిర్మాణ సంస్థ ఏవీఎం ప్రొడక్షన్స్, దివంగత ప్రఖ్యాత నిర్మాత ఏవీ మెయ్యప్ప శెట్టియార్ ప్రారంభించిన ఈ సంస్థ కొత్త రూపు సంతరించుకుంది. అనేక మధురానుభూతులకు నిలయం ఈ స్టూడియో. గత 77 సంవత్సరాలుగా తమిళం, తెలుగు హిందీ తదితర భాషల్లో 178 వరకు చిత్రాలను నిర్మించింది. ముఖ్యంగా అన్నాదురై, కరుణానిధి, ఎంజీ రామచంద్రన్, ఎన్టీ రామారావు, జయలలిత మొదలగు ఐదుగురు ముఖ్యమంత్రులతో చిత్రాలు నిర్మించిన సంస్థ ఇది. కాగా ఏవీ మెయ్యప్ప శెట్టియార్ లెగసీని ఆయన వారసులు కొనసాగిస్తూ వస్తున్నారు. కాగా తాజాగా ఏవీఎం శరవణన్, ఏవీఎం గుహన్ స్థానిక వడపళనిలోని స్టూడియోలో ఏవీఎం హెరిటేజ్ మ్యూజియంను ఏర్పాటు చేశారు. ఈ మ్యూజియంను ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమలహాసన్, శివకుమార్, దర్శకుడు ఎస్.పి.ముత్తురామన్, గీత రచయిత వైరముత్తు తదితరులు ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవీఎం గుహన్ మాట్లాడుతూ ఈ హెరిటేజ్ మ్యూజియం కోసం చాలా కాలంగా ఏర్పాట్లు చేస్తున్నానన్నారు. తమ సంస్థ గురించి, తాము నిర్మించిన చిత్రాల గురించి ఈ తరానికి చెందిన వారు తెలుసుకోవాలనే ఈ మ్యూజియాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. తమసంస్థ నిర్మించిన చిత్రాలకు ఉపయోగించిన సాంకేతిక పరికరాలను, నటులు ధరించిన దుస్తులు వంటి వివిధ రకాల వస్తువులను మ్యూజియంలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఇంకా కార్ల కలెక్షన్లను తాను చాలా కాలంగా చేస్తున్నట్లు చెప్పారు. 1910 నుంచి 2000 సంవత్సరం వరకు ప్రత్యేకమైన పాత, కొత్త కార్లు, మోటారు బైక్‌లను మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచినట్లు వెల్లడించారు.



మ్యూజియంను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, చిత్రంలో హీరో కమల్ హాసన్ తదితరులు



మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్లు



వివిధ రకాల కెమెరాలు, ప్రొజెక్టర్లు

రూ.42 లక్షల మోసం.. రిటైర్డ్ డీఎస్పీపై కేసు

అన్నానగర్: తిరువారూరు జిల్లా మన్నార్ కుడి సమీపంలో పరవక్కోట్టై గ్రామానికి చెందిన రాజేంద్రన్.. తంజావూరు జిల్లా క్యూ బ్రాంచ్ పోలీసులో డీఎస్పీగా పనిచేసి పదవీ విరమణ పొందాడు. ప్రస్తుతం తంజావూరు మేడ్చల్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఆయన తంజావూరులో పరుపుల తయారీ కంపెనీని కూడా నడుపుతున్నారు. తన బంధువైన పరవకోటకి చెందిన గోపీనాథన్ భార్య పార్వ(42)ను మ్యాట్రెస్ కంపెనీలో భాగస్వామిగా చేర్చుకున్నాడు. అంతేకాక 7 శాతం లాభం ఇస్తానని రూ. 40 లక్షలు తీసుకున్నాడు. కానీ తర్వాత ఎలాంటి నగదు ఇవ్వలేదు. దీంతో ఆమె భర్త గోపీనాథన్ రాజేంద్రన్‌ను డబ్బు అడిగాడు. ఈక్రమంలో రూ.13 లక్షలు తిరిగి ఇచ్చాడు. మిగిలిన రూ.27 లక్షలు అడిగినందుకు జైల్లో పెడతానని బెదిరించినట్లు తెలుస్తోంది. దీంతో తంజావూరు ఎస్పీ ఆశిష్ రావత్‌కు పార్వ ఫిర్యాదు చేసింది. దీనిపై జిల్లా క్రైంబ్రాంచ్ పోలీసులు రాజేంద్రన్‌పై వివిధ సెక్షన్ల కింద శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా రాజేంద్రన్ పుదువాయికి చెందిన వ్యాపారి సుభాషిణిని రూ.15 లక్షలు మోసం చేసినట్లు మరో ఫిర్యాదు నమోదైంది.

చేతన ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్న శివమణి

- డ్రమ్స్ వాయిద్యకారుడు పద్మశ్రీ శివమణి
- 100 మంది దివ్యాంగులకు ఉచిత కృత్రిమ అవయవాలు

కొరుక్కుపేట: అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ అయిన చేతన ఫౌండేషన్ సేవలు ప్రసంశనీయమని ప్రముఖ డ్రమ్స్ వాయిద్య కళాకారుడు పద్మశ్రీ శివమణి కొనియాడారు. ఈ మేరకు చేతన ఫౌండేషన్-తెలంగాణ ఆధ్వర్యంలో చెన్నైలోని 100 మంది దివ్యాంగులకు ఉచిత కృత్రిమ అవయవాలను ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక పురసైవాక్కంలోని శ్రీ ఏఎంకేఎం జైన్ మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పద్మశ్రీ శివమణి పాల్గొన్నారు. చెన్నైతోపాటు తమిళనాడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు (కృత్రిమ కాళ్లు) శివమణి చేతుల మీదుగా అందజేశారు. చేతన ఫౌండేషన్- తెలంగాణ ఖమ్మం జిల్లా వలంటీర్ ముత్తినేని సురేష్ మాట్లాడుతూ చేతన ఫౌండేషన్ తరపున దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 5000 కృత్రిమ అవయవాలను పంపిణీ చేశామన్నారు. ఈ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వెనిగళ్ల రవి అమెరికాలోని పోర్ట్ లాండ్ నుంచి అందిస్తున్న ఆర్థిక సహాయంతో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నామని అన్నారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షులు వెనిగళ్ల వెంకటేశ్వర రావు, కార్యదర్శి పసుమర్తి రంగా రావు తదితరులు పాల్గొన్నారు.

డీఎంకేతోనే అభివృద్ధి సాధ్యం



భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్ గాంధీ

వేలూరు: డీఎంకే ప్రభుత్వంలోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు రాష్ట్ర జౌళి శాఖ మంత్రి ఆర్ గాంధీ అన్నారు. రాణిపేట జిల్లా వాలాజ తాలుకా సమీపంలోని వానాబాడి గ్రామంలో రూ.22.65 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కరుణానిధి హయాం నుంచి నేటి వరకు రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్న ఘనత డీఎంకే ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలకు ఎటువంటి పథకాలు అవసరం, ఎటువంటి అభివృద్ధి అవసరం అనే పలు విషయాలను ముఖ్యమంత్రి ఆలోచించి పలు సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వానాబాడి గ్రామంలో చాలా కాలంగా గ్రామ సచివాలయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారని, ప్రస్తుతం సచివాలయాన్ని ప్రారంభించామన్నారు. పార్లమెంట్ సభ్యులు జగద్రక్షగన్, ఎమ్మెల్యే ఈశ్వరప్పన్, కలెక్టర్ వలర్‌మది, జిల్లా రెవెన్యూ అధికారి నరేష్, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు అధికారి జయంతి, యూనియన్ చైర్మన్ వెంకట్రామన్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కోర్సులకు రెండు రోజుల్లో 18 వేల దరఖాస్తులు

తిరువొత్తియూరు: ఇంజినీరింగ్ కోర్సులకు రెండు రోజుల్లో 18 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఎయిడెడ్ ఇంజినీరింగ్ యూనివర్సిటీ, దాని అనుబంధ కళాశాలలు, నమలై యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కాలేజీలలో అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 2023-24 విద్యా సంవత్సరానికి బి.ఈ, బీటెక్, బీఆర్క్ ఇంజినీర్‌లో మొదటి సంవత్సరం కోర్సుల్లో ప్రవేశానికి డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అందుకు తగ్గట్లుగానే ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి దరఖాస్తుల నమోదును శుక్రవారం ప్రారంభించిన విషయం తెలిసింది. కాగా తొలిరోజే 8,668 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,088 మంది దరఖాస్తు రుసుం చెల్లించగా, 250 మంది సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేశారు. శనివారం 2వ రోజు సాయంత్రం 6 గంటల వరకు మరో 9,513 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 197 మంది దరఖాస్తు రుసుం చెల్లించగా, 495 మంది సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేశారు. ఈ నేపథ్యంలో మొత్తం 2 రోజుల్లో 18,181 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 4 చివరి తేదీ అని అధికారులు వెల్లడించారు.

ఆకట్టుకుంటున్న చెన్నై ఫెస్టివల్

కొరుక్కుపేట: తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెన్నై ఐల్యాండ్ గ్రౌండ్స్ వేదికగా ఏర్పాటు అయిన చెన్నై ఫెస్టివల్ నగరవాసులను అమితంగా ఆకట్టుకుంటుంది. రాష్ట్ర యువజన సంక్షేమం , క్రీడల అభివృద్ధి శాఖమంత్రి ఉదయనిధి స్టాలిన్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ఫెస్టివల్ లో అంతర్జాతీయ హస్తకళలు, ఫుడ్ ఫెస్టివల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చేతితో నేసిన వస్త్రాలు, పట్టు చీరలు, కో -ఆప్‌టెక్స్ ఫ్యాబ్రిక్స్, పూంపుహార్ హస్తకళలు వస్తువులతో 70కి పైగా స్టాల్స్‌ను ఇక్కడ కొలువుదీర్చారు. మహిళాస్వయం సహాయకబృందాలు ఉత్పత్తులను కూడా ప్రదర్శిస్తున్నారు. అలాగే గ్రామీణ కళాకారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కళా ప్రదర్శనలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. ఇక చిన్నారులను సైతం ఆకట్టుకునేలా పేపర్‌తో హస్తకళలను రూపొందించడానికి ఓరిగామి తరహా క్రాఫ్టింగ్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుండడం విశేషం.



నృత్యం చేస్తున్న డప్పు వాయిద్య కళాకారులు

కోలీవుడ్ టాక్స్

టెస్ట్ షూట్ షురూ



రజనీకాంత్

తమిళసినిమా: రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం జైలర్. నెల్సన్ దర్శకత్వం వహిస్తున్న ఇందులో నటి తమన్నా, రమ్యకృష్ణ తదితర ప్రముఖ నటీనటులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. జైలర్ చిత్రాన్ని ఆగస్టు 10వ తేదీన జరిగినట్లు చిత్ర వర్గాలు అధికారికంగా తెలిపిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం రజనీకాంత్ తన కూతురు ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న లాల్ సలాం చిత్రంలో నటిస్తున్నారు. ఈయన అతిథి పాత్రలో నటిస్తున్న ఇందులో కృష్ణవిశాల్ విక్రాంత్ కథానాయకులుగా నటిస్తున్నారు. కాగా తదుపరి జై భీమ్ చిత్రం ఫేమ్ జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటించనున్నారు. ఇది ఆయన నటించే 170వ చిత్రం అవుతుంది. అయితే ఆ తదుపరి చిత్రానికి కూడా రజనీకాంత్ కమిట్ అయ్యారు. ఆ చిత్ర దర్శకుడు లోకేష్ కనకరాజ్. వరుస విజయాలతో అనతి కాలంలోనే అగ్ర దర్శకుల వరుసలో చేరిన ఈయన ప్రస్తుతం విజయ్ కథానాయకుడిగా లియో చిత్రాన్ని తెరకెక్కిస్తునానరు. ఈ చిత్రం షూటింగ్ 60 శాతం పైగా పూర్తయినట్లు సమాచారం. కాగా తదుపరి రజనీకాంత్‌ను డైరెక్ట్ చేయడానికి లోకేష్ కనకరాజ్ సిద్ధమవుతున్నారు. నిర్మాణ బాధ్యతలను సన్‌పిక్చర్స్ సంస్థే చేపట్టనుంది. దీంతో ఈ చిత్రం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఈ చిత్రానికి సంబంధించి ఇటీవల రజనీకాంత్ టెస్ట్ షూట్ కూడా నిర్వహించినట్లు ప్రచారం సాగుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావడానికి మాత్రం మరికొద్ది రోజులు పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ది కేరళ స్టోరీ ప్రదర్శనలు రద్దు



తమిళసినిమా: దేశవ్యాప్తంగా వివాదస్పదంగా మారిన కేరళ స్టోరీ చిత్రం ప్రదర్శనను తమిళనాడు సినీ థియేటర్ల యాజమాన్యం రద్దు చేసింది. బాలీవుడ్ దర్శకుడు సుదీప్తో సేన్ తెరకెక్కించిన చిత్రం ఇది. నటి అదాశర్మ, యోగితా బిహాని, సోనియా భవాని, సిద్ధీ ఇద్నాని, విజయ్‌కృష్ణ తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ట్రైలర్ విడుదల అయినప్పటి నుంచే వివాదం చెలరేగుతోంది. కేరళలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు పేర్కొన్నారు. కేరళలోని ఇతర మతాలకు చెందిన 32 వేల మందిని ఇస్లామిక్ మతస్తులుగా మార్చి ఆ తరువాత వారిని ఐసిస్ ఉగ్రవాద సంస్థలోకి పంపినట్లు దర్శకుడు ఈ చిత్రంలో చూపించారు. ఇదే ఇప్పుడు తీవ్ర వివాదానికి దారి తీసింది. దీనికి సెన్సార్ బోర్డు ధ్రువీకరణ పత్రం ఇవ్వడం తీవ్ర వ్యతిరేకతకు దారి తీసింది. ముఖ్యంగా కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు కేరళ స్టోరీ చిత్రాన్ని విడుదల చేయడానికి తీవ్రంగా వ్యతిరేకించాయి. కేరళ ప్రభుత్వం అయితే ఈ చిత్రాన్ని నిషేధించాలని హైకోర్టు వరకు వెళ్లింది. అయినప్పటికీ ఈ చిత్రం శుక్రవారం దేశవ్యాప్తంగా విడుదలైంది. తమిళనాడులో థియేటర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం గట్టి బందోబస్తును ఏర్పాటు చేసింది. అయితే చిత్రంలోని కాంట్రవర్సీ అంశాల కారణంగా కేరళ స్టోరీ చిత్రం విడుదలైన రెండు రోజులలోనే భారీ వసూళ్లను సాధించినట్లు సమాచారం. అయితే ఈ చిత్ర ప్రదర్శనలను తమిళనాడు థియేటర్ల యాజమాన్యం ఆదివారం నుంచి రద్దు చేసింది. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌కు ఎలాంటి సంబంధం కలగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు థియేటర్ల యాజమాన్యం వివరణ ఇచ్చారు.

19న యాదుమ్ ఊరే యావరుమ్ కేళీర్



యాదూమ్ ఊరే యావరుమ్ కేళీర్ చిత్రంలోని దృశ్యం

తమిళసినిమా: నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన చిత్రం యాదూమ్ ఊరే యావరుమ్ కేళీర్. నటి మేఘా ఆకాష్ నాయకిగా, దర్శకుడు మోహన్‌రాజా, మగిళ్ తిరుమేణి, నటి రిత్విక తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్రం ద్వారా దర్శకుడు జననాథన్ శిష్యుడు వెంకట్ కృష్ణ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. చంద్రా ఆర్ట్స్ పతాకంపై ఎసక్కి దురై నిర్మించిన ఈ చిత్రానికి నివాస్ కె.ప్రసన్న సంగీతాన్ని, వెట్రి చాయాగ్రహణం అందించారు. కాగా నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం చాలా కాలంగా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు ఈ చిత్రానికి టైం వచ్చింది. చిత్రాన్ని ఈ నెల 19వ తేదీన విడుదల చేస్తున్నట్లు నటుడు విజయ్‌సేతుపతి తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దీనిని రాష్ట్ర వ్యాప్తంగా శక్తి ఫిలిమ్స్‌సంస్థ విడుదల చేయనుంది. దీంతో యాదుమ్ ఊరే యావరుమ్ కేళీర్ చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి. కాగా చిత్రంలోని ఇమైతదే అనే లిరికల్ వీడియో సాంగ్‌ను ఆదివారం విడుదల చేశారు. చిన్న గ్యాప్ తరువాత విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన చిత్రం విడుదల కావడంతో ఆయన అభిమానులు ఈ చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సంతోషంలో తమన్నా



తమిళసినిమా: తన పదిహేనో ఏటనే కథానాయకిగా సినీ రంగప్రవేశం చేసిన ఉత్తరాది బ్యూటీ తమన్నా భాటియా. మొదట బాలీవుడ్‌లో పరిచయమైన ఈ లక్కీ బ్యూటీ ఆదరించింది మాత్రం దక్షిణాది సినిమానే. ఆదిలో తన లేలేత అందాలతో యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేసినా, ఆ తరువాత మాత్రం తనలోని నటనా కౌశల్యాన్ని చాటుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో గత 18 ఏళ్లుగా కథానాయకిగా రాణిస్తోంది. మధ్యలో తనదైన స్టైల్‌లో ఐటమ్ సాంగ్స్‌లో ఆడిపాడుతోంది. ఇప్పటికీ చేతినిండా చిత్రాలతో బిజీగానే ఉంది. అయితే దక్షిణాదితో పాటు హిందీలోనూ ఈ అమ్మడు సరైన విజయాన్ని అందుకొని చాలా కాలమే అయ్యింది. అయినప్పటికీ తమిళంలో రజనీకాంత్ వంటి సూపర్‌స్టార్‌తో జైలర్ చిత్రంలోనూ, తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సరసన భోళా శంకర్ చిత్రంలో నటించే అవకాశాలను అందుకోవడం గొప్పే. మరో విశేషం ఏంటంటే ఈ రెండు చిత్రాలు ఒకేసారి తెరపైకి రావడానికి సిద్ధం కావడం. జైలర్ చిత్రం ఆగస్టు 10వ తేదీన భోళాశంకర్ చిత్రం ఆగస్టు 11వ తేదీన తెరపైకి రానున్నాయి. దీంతో నటి తమన్నా తెగ సంతోషపడిపోతోంది. తాను నటించిన రెండు భారీ చిత్రాలు ఒకేసారి విడుదల కానుండడంపై ఆనందం వ్యక్తం చేసింది. కాగా తమన్నా వీటితో పాటు తమిళంలో అరణ్మణై-4, మలయాళంలో బాంద్రా అనే చిత్రం, బాలీవుడ్‌లో బోల్ చుడియన్ అనే చిత్రంలోనూ నటిస్తోంది.

తగ్గేదేలే అంటున్న ఆదితి శంకర్



ఆదితి శంకర్

తమిళసినిమా: ప్రముఖ దర్శకుడు శంకర్ వారసురాలు ఆదితి శంకర్. వైద్య వృత్తి చేపట్టాల్సిన ఈమె.. నటిగా రంగప్రవేశం చేయడానికి సిద్ధమయ్యారు. ఆమె ఇష్టానికి తండ్రి దర్శకుడు శంకర్ కూడా ఓటేశారు. ఇంకే ముంది వెంటనే ఆదితి శంకర్ కార్తీకి జంటగా విరుమాన్ చిత్రంతో కథానాయకిగా పరిచయం అయ్యింది. ఆ చిత్రం మంచి సక్సెస్ ఇవ్వడంతో పాటు, ప్రశంసలను అందించింది. ప్రస్తుతం శివకార్తికేయన్‌కు జంటగా మా వీరన్ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకూ పరిచయం కాబోతోంది. మావీరన్ చిత్రం తెలుగులోనూ మహావీరుడు పేరుతో విడుదల కానుంది. ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం జులై 24న తెరపైకి రానుంది. కాగా నటి ఆదితి శంకర్ మరో రెండు తమిళ చిత్రాలలో కమిట్ అయ్యింది. అందులో ఒకటి నటుడు విష్ణువిశాల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం. మరొకటి నటుడు అధర్వ సోదరుడు ఆకాశ్ మురళి హీరోగా పరిచయం అవుతున్న చిత్రం. ఈ రెండు త్వరలో సెట్‌పైకి వెళ్లడానికి సిద్ధమవుతున్నాయి. ఇకపోతే నటి ఆదితి శంకర్ తరచూ సామాజిక మాధ్యమాల్లో ఉండే ప్రయత్నం చేస్తోంది. తద్వారా సినీ దర్శక నిర్మాతలను ఆకర్షించడంతో పాటు అభిమానులను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ఇక గ్లామర్ విషయంలో తగ్గేదేలే అన్నట్లుగా ప్రవర్తిస్తోంది. ప్రత్యేకంగా ఫొటో షూట్ నిర్వహించుకుని మరి ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తోంది. అలా తాజాగా ఆష్ కలర్ లెహంగా ధరించి అందాలను మెరుగుపరచుకుని తీయించుకున్న ఫోటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

క్లుప్తంగా

యువకుడి హత్య

తిరువొత్తియూరు: ప్రియురాలి కోసం వెళ్లిన యువకుడు హత్యకు గురయ్యాడు. విరుదునగర్ జిల్లా రాజపాళ్యం సమీపంలోని సుందరరాజపురం గ్రామానికి చెందిన కనగరాజ్ (35) భార్యకు, అదే ఊరికి చెందిన కన్నన్ అలియాస్ అన్బలగన్ (31)కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ సంగతి తెలుసుకున్న కనకరాజ్ ఇద్దరినీ ఖండించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో కనకరాజ్ భార్యాబిడ్డలతో తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. అదే సమయంలో అటవీ జంతువుల వేట కేసులో జైలుకు వెళ్లి వున్న అన్బలగన్ బెయిలుపై విడుదలై ప్రియురాలిని వెతుక్కుంటూ కనకరాజ్ భార్య ఇంటికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న కనకరాజ్ తన అత్త ఇంటికి వెళ్లి అక్కడ నిద్రిస్తున్న అన్బలగన్‌పై కొడవలితో దాడి చేయడంతో అన్బలగన్ అదే చోట మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

అన్నానగర్: కొరుక్కుపేటలో ఆదివారం అమ్మమ్మతో కలిసి గుడికి వెళ్లిన బాలుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన కలకలం రేపింది. చెన్నైలోని కొరుక్కుపేటలోని ఆర్.కే. నగర్ మెయిన్ స్ట్రీట్ కు చెందిన కార్తీక్ కుమారుడు కవిన్ (13) వన్నారపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి తన అమ్మమ్మతో కలిసి కొరుక్కుపేట పుట్టతేరులోని గుడికి వెళ్లాడు. అనంతరం గుడిలో స్వామి దర్శనం చేసుకొని అక్కడ సీరియల్ బల్బుతో ఆడుకున్నాడు. అనుకోని విధంగా విద్యుదాఘాతానికి గురై విసిరివేయబడ్డాడు. బాలుడిని స్థానికులు చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే కవిన్ మృతి చెందినట్లు తెలిపారు. కొరుక్కుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దానిమ్మ పండు తిన్న శిశువు మృతి

తిరువొత్తియూరు: తెన్‌కాశి జిల్లాలో దానిమ్మ పండు తిన్న ఒకటిన్నర సంవత్సరం బిడ్డ మృతి చెందింది. తెన్‌కాశి జిల్లా కడియం సమీపం షాలినాయకర్ పాలయంకు చెందిన రాజా, ఫాతిమా దంపతులకు అబ్సెల్ (7), మొహమ్మద్ అర్షత్ (ఒకటిన్నర సంవత్సరం) కుమారులు ఉన్నారు. శనివారం సాయంత్రం మొహమ్మద్ అర్షత్ ఇంటిలో ఆడుకుంటూ దానిమ్మ పండును తిన్నాడు. కొద్ది సేపటికి వాంతులై స్పృహ తప్పాడు. వారు బిడ్డను వివికే పురంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అంబై ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు పరీక్షించి బిడ్డ మృతి చెందాడని తెలిపారు. కడయం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కాంగ్రెస్ నేత అరెస్టు

అన్నానగర్: కన్యాకుమారి జిల్లా మార్తాండం సమీపంలోని నాన్ తంగడు ప్రాంతానికి చెందిన రాజన్ జేవియర్ (52) కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి. ఇతని భార్య విదేశాల్లో ఉద్యోగం చేస్తోంది. రాజన్ జేవియర్ తన ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. మద్యం సేవించి ఇంటికి వెళ్లే క్రమంలో రాజన్ జేవీయర్ ఆ ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళలతో అసభ్యకరంగా మాట్లాడేవాడు. రోజురోజుకూ అతని అరాచకాలు పెరిగిపోవడంతో మహిళలు అటు వైపు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ స్థితిలో ఆదివారం ఎప్పటిలాగే రాజన్ జేవియర్ తాగి ఇంటికి వచ్చి తన ఇంటి గుమ్మం వద్ద కూర్చున్నాడు. అనంతరం ఇంటి దగ్గర నిలబడిన మహిళలను అసభ్యకరంగా మాట్లాడారు. ఆ తర్వాత ఒక్కసారిగా లోదుస్తులను విప్పి జననాంగాలను చూపిస్తూ అసభ్యకర చర్యలకు పాల్పడ్డారు. దీంతో మహిళలు మార్తాండం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

టాస్మాక్‌లో చోరీకి యత్నించిన యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై కొడుంగయూర్‌లోని టాస్మాక్ దుకాణంలో చోరీకి యత్నించిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. వివరాలు.. చెన్నై కొడుంగయూరు ఎరుకంజేరి సత్యవాణి ముత్తు వీధిలో టాస్మాక్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో షట్టర్ పగులగొట్టే శబ్దం రావడంతో అక్కడ గస్తీ చేస్తున్న కొడుంగయూరు పోలీసులు వెళ్లి పరిశీలించారు. షట్టర్ పగలగొడుతున్న ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోవడానికి యత్నించారు. వారిలో ఒకరిని పోలీసులు పట్టుకున్నారు. విచారణలో నిందితుడు సత్యవాణి ముత్తు వీధికి చెందిన జీవా (25) అని తెలిసింది. ఇక తప్పించుకున్న మరో ఇద్దరిని పట్టుకునేందుకు చర్యలు ప్రారంభించారు.

ఉద్యాన రైతులు జాగ్రత్తలు పాటించాలి

వరదయ్యపాళెం: మండలంలో కురుస్తున్న అకాల వర్షాలకు ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సత్యవేడు ఉద్యానశాఖ అధికారిణి రాధారాణి సూచించారు. వర్షాల ప్రభావంతో కూరగాయల పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలి. ప్రధానంగా మిరప తోటల్లో వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొక్క మొదులు చుట్టూ మట్టిని నింపాలి. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపును తొలగించి నేల త్వరగా ఆరేటట్టు చర్యలు తీసుకోవాలి. అలాగే 999, 1345 ఎరువులను అవసరాన్ని బట్టి చల్లాలి. చీడపీడల నివారణకు కూరగాయల పంటల్లో క్లోరిపైరిపాస్ 2మి.లీ, డయోడికార్బ్ ఒక గ్రాము నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలి


డిగ్రీ పట్టాలు అందజేస్తున్న మైనారిటీ విభాగం కమిషన్ చైర్మన్ పీటర్ అల్‌ఫోన్స్

వేలూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలని మైనారిటీ విభాగం కమిషన్ చైర్మన్ పీటర్ అల్‌ఫోన్స్ అన్నారు. వేలూరు గణాధిపతి తులసి జైన్ ఇంజినీరింగ్ కళాశాల 18వ స్నాతకోత్సవ కార్యక్రమం కళాశాల చైర్మన్ పారీలాల్ జైన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పీటర్ అల్‌ఫోన్స్ ముఖ్య అతిథిగా హాజరై ఇంజినీరింగ్‌లో వివిధ కోర్సులు పూర్తి చేసిన 245 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసి ప్రసంగించారు. మన దేశంలో ఏటా ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసి అనేక మంది ఇతర దేశాలకు ఉద్యోగాల బాట పడుతున్నారని, అయితే మన దేశంలోనే అవకాశాలు అధికంగా ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. మన దేశంలోనే ఉండి పరిశోధనలు చేయగలిగితే దేశాభివృద్ధికి దోహద పడాలన్నారు. ప్రస్తుతం డిగ్రీలు సాధించిన విద్యార్థుల్లో అధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే కావడంతో విద్యను అంతటితో నిలిపివేయకుండా ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లక్ష్యం ఉంటుందని వాటిని జీవితంలో అధిగమించేందుకు పట్టుదలతో ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం వివిధ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భారతి, సలహాదారుడు నందకిషోర్, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ వాయిదా

తిరువొత్తియూరు: ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ కమిషనర్, ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రకటించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాటశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, గ్రాడ్యుయేట్, పీజీ ఉపాధ్యాయులకు వార్షిక బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో పదోన్నతి, పదవీకాల - ట్రాక్ కౌన్సెలింగ్, ఉద్యోగాలను పర్మినెంట్ చేయడం జరుగుతుంది. దీని ప్రకారం, ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్న ఉపాధ్యాయుల నుంచి స్వయంగాను, ఈఎంఐఎస్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం, ప్రతి ఉపాధ్యాయుని ప్రాధాన్యతా జాబితా జిల్లాలోని ఖాళీలు, మిగులు పోస్టుల జాబితా ప్రచురిస్తారు. సోమవారం ఉదయం ప్రాథమిక విద్యా శాఖలో రొటేషన్ బదిలీలు, సెకండరీ స్కూల్ ప్రిన్సిపాల్స్ కోసం రీసైక్లింగ్ కన్సల్టేషన్, ఇంట్రా-డిస్ట్రిక్ట్ ట్రాన్సిషన్ కన్సల్టేషన్ ఉన్నాయి. ఈ సందర్భంలో, తమిళనాడులో ప్రస్తుత సంవత్సరం పబ్లిక్ కన్వర్షన్, ప్రమోషన్ కోసం కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ కమిషనర్ నందకుమార్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎల్లైట్‌మెంట్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో 2022-2023 విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయుడు వి.డి.ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులపై కౌన్సెలింగ్ కోసం మార్గదర్శకాలు టైమ్ టేబుల్ అన్ని జిల్లాల ముఖ్య విద్యాశాఖాధికారులకు ఈ-మెయిల్ ద్వారా పంపినట్టు తెలిపారు. ప్రస్తుతం, పరిపాలనా కారణాల వల్ల, ఈ సాధారణీకరణ, ప్రమోషన్ కన్సల్టేషన్‌లు (ప్రాథమిక విద్య, పాఠశాల విద్య) తాత్కాలికంగా వాయిదా వేసినట్టు వెల్లడించారు. సంప్రదింపుల తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఐదు నాటు బాంబులు స్వాధీనం

తిరువొత్తియూరు: తెన్‌కాసిలో కుందేళ్ల వేటకు ఉపయోగించే ఐదు నాటు బాంబులను అటవీ శాఖ అధికారులు, పోలీసుల స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. తెన్‌కాశి జిల్లా చెందట్టియాపురంలోని పుదూర్ ములు తురుత్తి కన్మాయి ప్రాంతంలో అటవీ శాఖ ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం గస్తీ చేపట్టారు. అక్కడ కుందేళ్లను వేటాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు ఇనాం కోవిల్‌పట్టికి చెందిన మురుగేశన్ కుమారుడు సుందర్‌రాజ్ (42), విరుదునగర్ జిల్లా కృష్ణరాజపురానికి చెందిన అర్పుదం (56), సిమ్సన్ (22), అయాన్ కొల్లంకొండాన్‌కు చెందిన సుందర్‌రాజ్ కుమారుడు కతీర్ (22) అని తేలింది. వారు ఉపయోగించిన ఐదు నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నలుగురికి తలా రూ.25 వేలు జరిమానా విధించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

తిరువళ్లూరు: కృష్ణా కాలువలో సరదాగా స్నానం చేసేందుకు వెళ్లిన ఇంజినీరింగ్ విద్యార్థి నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. తిరువళ్లూరు జిల్లా పట్టాభిరామం సమీపంలోని తండురై ప్రాంతానికి చెందిన ఇమ్మాన్యుయేల్(18) పూందమల్లిలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా ఈత కోసం పూండి నుంచి పుళల్ రిజర్వాయర్‌కు నీటిని తీసుకెళ్లే కృష్ణా కాలువలో దిగాడు. నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. ఇమ్మాన్యుయేల్‌ను కాపాడడానికి అతడి స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. విషయాన్ని స్థానికులు వెంగల్ పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి ఏడు గంటల వరకు గాలించారు. చీకటి పడడంతో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి రెండవ రోజు గాలింపు చర్యలు చేపట్టి ఆవడి సమీపంలో మృతదేహన్ని గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వెంగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, కుమార్తెపై హత్యాయత్నం

తిరువొత్తియూరు: భార్య, కుమార్తెపై కిరోసిన్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై రాయపురం జీఎం పేటకు చెందిన కార్తీక్ (38) ప్రింటింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య రేవతి (34), కుమార్తె(10) ఉన్నారు. మద్యానికి బానిస అయిన కార్తీక్ భార్యతో గొడవ పడుతున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంటికి వచ్చాడు. దీనిని రేవతి తీవ్రంగా ఖండించింది. ఇద్దరి మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఆగ్రహించిన కార్తీక్ భార్య, కుమార్తెపై దాడి చేశాడు. అంతటితో ఆగక ఇద్దరిపైనా కిరోసిన్ పోసి నిప్పుపెట్టాడు. వారి కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకున్నారు. వారిని స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఇద్దరికీ చికిత్స చేస్తున్నారు. దీని గురించి ఫిర్యాదు మేరకు రాయపురం పోలీసులు కేసు నమోదు చేసి కార్తీక్‌ను అరెస్టు చేశారు.

టిప్పర్ ఢీకొని మహిళ దుర్మరణం

అన్నానగర్: టిప్పర్ లారీ ఢీకొనడంతో మహిళ దుర్మరణం చెందింది. చెన్నై వ్యాసర్‌పాడి కల్యాణపురం 2వ వీధికి చెందిన సేవిక (34) బ్యూటీషియన్. ఆమె అన్నసాలైలోని ఓ ప్రైవేట్ టీవీ షోలో న్యూస్ యాంకర్లకు మేకప్ వేసేది. శనివారం రాత్రి పని ముగించుకుని మాంబలం తలైయారి వీధిలోని తన స్నేహితురాలి ఇంట్లో సేవిక బస చేసింది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు బైకు ట్యాక్సీ బుక్ చేసుకుని ఇంటికి బయలుదేరింది. బైకు అన్నసాలై కామరాజర్ అరంగం వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొంది. బైక్ ట్యాక్సీ నడుపుతున్న తిరువళ్లువర్ రోడ్ వెస్ట్ మాంబళానికి చెందిన ఆనంద్(34), సేవకి కిందపడిపోయారు. సేవిక హెల్మెట్ ధరించకపోవడంతో తలకు బలమైన గాయమై రక్తస్రావం కావడంతో స్పృహ కోల్పోయింది. ఆనంద్ స్వల్పంగా గాయపడ్డాడు. సేవికను చుట్టుపక్కల వారు 108లో రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ సేవికను వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పాండి బజార్ ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

క్రికెట్ అభిమానుల్లో ఆనందం

- బహుమతి పోటీల్లో 25 మందికి ఉచిత టికెట్లు

కొరుక్కుపేట: క్రికెట్ అభిమానుల కోసం చెన్నై సూపర్ లీగ్ తమ అధికారిక సోషల్‌మీడియా పేజీల్లో ఐపీఎల్ క్రికెట్‌ను ప్రత్యక్షంగా చూసే అవకాశాన్ని కలిస్తూ బహుమతి పోటీని నిర్వహించింది. పలువురు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. సరైన సమాధానాలు ఇచ్చిన వారికి 25 ఉచిత ఐపీఎల్ క్రికెట్ టికెట్లు అందజేశారు. మరో 100 కన్సొలేషన్ ప్రైజ్‌లను చేపాక్ సూపర్ లీగ్ టీమ్ అందజేసింది. శనివారం రాత్రి జరిగిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబయి ఇండియన్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ను ఉచిత టికెట్లు పొందిన క్రికెట్ అభిమానులు ప్రత్యక్షంగా తిలకించి ఆనందంతో ఉప్పొంగి పోయారు. ఈ సందర్భంగా క్రికెట్ అభిమాని భవేత్ రాజా మాట్లాడుతూ ధోనీని ప్రత్యక్షంగా చూసే అవకాశం దక్కిందని హర్షం వ్యక్తంచేశాడు. వర్షం కురిసినా టికెట్ కొనుగోలు చేసేందుకు వచ్చిన సేలంకు చెందిన రవీంద్రన్ మాట్లాడుతూ చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ చూసేందుకు వచ్చానని చెప్పాడు. అలాగే చెన్నైకి చెందిన మిథున్ రాజ్ చేపాక్ స్టేడియంలో రాత్రంతా నిరీక్షించినా టికెట్లు దొరకలేదని, చేపాక్ సూపర్ లీగ్ నిర్వహించిన పోటీ ద్వారా ఉచిత టిక్కెట్ లభించిదని దీంతో మ్యాచ్‌ను లైవ్‌గా చూసే అదృష్టం కలిగిందని వివరించారు.

రూ. 20 లక్షలు మోసం

- డీఎంకే మహిళా కౌన్సిలర్‌పై కేసు

తిరువొత్తియూరు: రూ.20 లక్షలు మోసం చేసిన కేసుకు సంబంధించి డీఎంకే కౌన్సిలర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. చెన్నై వలసరవాక్కం తిరువల్లూరు రోడ్డుకు చెందిన ధనశేఖర్ (69) కోయంబేడు మార్కెట్లో కూలి పనులు చేస్తున్నాడు. ఇతను తన భూమిని విక్రయించగా రూ.20 లక్షలు వచ్చింది. ఆ సమయంలో చెన్నై కార్పొరేషన్ మండల 152వ వార్డు డీఎంకే కౌన్సిలర్ భారతి, ఆమె స్నేహితురాలు వనిత ఇద్దరూ ధనశేఖర్ వద్ద నుంచి నెలకు వడ్డీ చెల్లిస్తామని చెప్పి రూ.20 లక్షలు తీసుకున్నారు. చెప్పిన ప్రకారం అసలు, వడ్డీ ఇవ్వకపోవడంతో ధనశేకర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వలసవాక్కం పోలీసులు గత సంవత్సరం విచారణ చేపట్టారు. ఆ సమయంలో మహిళా కౌన్సిలర్, స్నేహితురాలు ఇద్దరూ కలిసి ధనశేఖర్‌కు రెండు నెలల్లోపు వసూలు వడ్డీ చెల్లిస్తామని రాసిచ్చారు. ఇప్పటివరకు అతనికి డబ్బు ఇవ్వకపోవడంతో మోసపోయిన ధనశేఖర్ శనివారం వలసరవాక్కం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కౌన్సిలర్ వద్ద విచారణ చేస్తున్నారు.

కాలిపోయిన స్థితిలో కళాశాల విద్యార్థి మృతదేహం

అన్నానగర్: మామల్లపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఓ కళాశాల విద్యార్థి మృతదేహం కాలిపోయిన స్థితిలో లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విద్యార్థి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి మల్లికార్జున (21)గా గుర్తించారు. ఈ విద్యార్థి బైకుపై తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు దేవాలయాలను సందర్శించేవాడు. ఉత్తరాది రాష్ట్రాల్లోని పలు ఆలయాలను బైకుపై సందర్శించాలని అనుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏప్రిల్ 14న బైకుపై ఈరోడ్ జిల్లాలోని భవానీ అమ్మన్ ఆలయానికి వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పాడు. కొద్దిరోజుల క్రితం మామల్లాపురానికి వచ్చాడు. ఆ తర్వాత మామల్లాపురం సమీపంలోని మణమై-నల్లూరు అటవీ ప్రాంతంలో మల్లికార్జున తన శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు న్యూస్ రిపోర్ట్‌లో తెలిపారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత తల్లిదండ్రులు తమ కుమారుడి మృతదేహాన్ని తీసుకున్నారని పోలీసులు తెలిపారు.

ధర్మ, భక్తి, జ్ఞానమార్గాలు మోక్షానికి దిక్సూచికలు


వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, ఆశ్రమ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ధర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు మోక్షానికి దిక్సూచికలని, వాటిని ఆచరించి మానవాళి తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని శ్రీవేంకటేశ్వర వేద వర్సిటీ ఉపకులపతి రాణి సదా శివమూర్తి తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆవరణలో శనివారం శ్రీరామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలోనూ భగవంతుడిని చూసి సేవ చేయాలన్నారు. మానవాళికి సేవ చేసేందుకు ప్రతి నాగరిక దేశంలో ఆశ్రమాన్ని ప్రారంభించాలని రామకృష్ణ మిషన్ అధికారులను కోరారు. కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి భీతి హరానందజీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ సేవ చేయడాన్ని అలవర్చుకోవాలని కోరారు. రామకృష్ణ మిషన్ అభివృద్ధిలో శ్రీ శారదా మాత పాత్రపై జి.శ్రీదేవి ఉపన్యసించారు. డాక్టర్ పీసీ రెడ్డి మాట్లాడుతూ భగవాన్ రామకృష్ణ ఆధ్యాత్మికతను, ఆధ్యాత్మిక యాత్రను, ఆయన సేవను మహాత్మా గాంధీ కొనియాడిని విధానాన్ని తెలియజేశారు.

భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదం


అన్నప్రసాదం నాణ్యతపై భక్తులను అడిగి తెలుసుకుంటున్న ఆలయ చైర్మన్ అంజూరు

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదం అందించాలని శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలోని నిత్యాన్నదాన సత్రాన్ని ఆయన పరిశీలించారు. అన్నదానానికి వినియోగించే సరుకులు, కూరగాయలు పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్నప్రసాదం తయారీలో నాణ్యత ప్రమాణాలు ఏ మాత్రం తగ్గకుండా భక్తులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం భక్తులతో మాట్లాడి సమస్యలేమైనా ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. దాతలు అన్నదాన పథకానికి విరాళాలు విరివిగా అందజేయాలని కోరారు. జన్మదినాలు, ఇతర ముఖ్య పర్వదినాలను పురస్కరించుకుని దాతలు విరాళాలందించాలని కోరారు. ప్రతి రోజు మధ్యాహ్నం 7 వేల మందికి, రాత్రి 2,500 మందికి అన్నదాన ప్రసాదాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

చెన్నై విమానాశ్రయంలో 2.5 కిలోల బంగారం స్వాధీనం

- ఐదుగురి అరెస్టు

అన్నానగర్: చెన్నై విమానాశ్రయంలో సింగపూర్, శ్రీలంక, దుబాయ్ దేశాల నుంచి విమానంలో అక్రమంగా తరలించిన రూ.1.32 కోట్ల విలువైన 2.5 కిలోల బంగారు, ఆభరణాలను ఆదివారం కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేశారు. చెన్నై విమానాశ్రయానికి ఆదివారం శ్రీలంక నుంచి వచ్చిన ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్యాసింజర్ విమానం ప్రయాణికులను, వారి వస్తువులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో శ్రీలంక నుంచి టూరిస్ట్ వీసాపై చెన్నైకి వచ్చిన ఇద్దరు మహిళల క్షుణ్ణంగా పరిశీలించగా లోదుస్తుల్లో ఉన్న 1.42 కిలోల బంగారు ముద్దను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు శ్రీలంక మహిళలను అరెస్టు చేశారు. అలాగే ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన మరో ప్రయాణికుడు సింగపూర్ నుంచి చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నాడు. కస్టమ్స్ అధికారులు ప్రయాణికుల దుస్తులను తనిఖీ చేసి పంపించారు. ఇందులో టూరిస్ట్ వీసాపై సింగపూర్ వెళ్లిన తమిళనాడుకు చెందిన ఇద్దరు యువకులు, మహిళను తనిఖీ చేయగా వారి హ్యాండ్‌బ్యాగుల్లో దాచిన రూ.37.19 లక్షల విలువైన కొత్త బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంలో ఇద్దరు యువకులు, మహిళను అరెస్టు చేశారు. సింగపూర్, దుబాయ్, శ్రీలంక నుంచి మూడు విమానాల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.1.32 కోట్ల విలువైన 2.5 కిలోల బంగారు గమ్, ఆభరణాలను ఒక్కరోజే చెన్నై విమానాశ్రయంలోని అంతర్జాతీయ టెర్మినల్‌లో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

నీటి వనరుల్లో పూడికతీత అవసరమే

- చెట్లను నరికివేయవద్దని మదురై హైకోర్టు ఆదేశాలు

తిరువొత్తియూరు: నీటి వనరుల్లో పూడికతీత అవసరమేనని, అక్కడ ఉన్న చెట్లను నరికివేయవద్దని మదురై హైకోర్టు బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. దిండుక్కల్ జిల్లాకు చెందిన జయరాజ్ మదురై హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. అందులో నత్తం తాలూకాలోని కుళ్లపట్టిలో వేదకొంకులం అనే నీటికుంట ఉందని తెలిపారు. ఈ చెరువు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చింత చెట్లు పెరుగుతున్నాయని, పొదలు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. వాటికి కలిపిన నీరు నిరుపయోగంగా ఉంది. వేదకొంకులంలో కూడా ఆక్రమణలను తొలగించి, అక్కడ ఉన్న చింతచెట్లను నరికివేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జి.ఆర్ స్వామినాథన్, పుగలేంది తదితరులు విచారించారు. పిటిషనర్ చట్ట ప్రకారం చెరువులలో పూడిక తవ్వడానికి సంబంధిత అధికారుల నుండి అనుమతి పొందవచ్చని, డ్రిల్లింగ్ సమయంలో అక్కడ ఉండే చింతచెట్లను తొలగించకూడదని, చింతచెట్లను నరికివేయకుండా నీటి వనరులను పునరుద్ధరించవచ్చు అని న్యాయమూర్తులు ఆదేశించారు.

ప్రశాంతంగా నీట్ పరీక్షలు


విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్డీవో భౌలిన్‌జయరాజ్

- అభ్యర్థులను పరిశీలించిన తర్వాతే లోనికి అనుమతి
- 147 మంది గైర్హాజరు


క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత లోపలికి అనుమతినిస్తున్న అధికారులు


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ విగ్నేష్

తిరువళ్లూరు: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మెడికల్ కళాశాలలో ప్రవేశం కోసం కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జిల్లా నుంచి నీట్ పరీక్షలు రాయడానికి 3,872 మంది బాలికలు, 2,113 మంది బాలురు దరఖాస్తు చేసుకున్నారు. తిరువళ్లూరు, తిరుత్తణి, తిరువేర్కాడు, పూందమల్లి, ఆవడి, అంబత్తూరు, రెడ్‌హిల్స్ తదితర ప్రాంతాల్లో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు భారీ భద్రత నడుమ నిర్వహించారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోపలికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను మూసివేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను 1.50 గంటల వరకు అనుమతించారు. ఇది ఇలా వుండగా పరిక్ష కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. బాలికల్లో 3,872 మందికి గాను 3783 మంది హాజరు కాగా 89 మంది హాజరుకాలేదు. బాలురు 2113 మందికి గాను 2055 మంది హాజరయ్యారు. 58 మంది హాజరుకాలేదు.

నిరుత్సాహపరచొద్దు: పరీక్షలు ప్రారంభమైన తర్వాత విద్యార్థుల తల్లిదండ్రులతో ఆర్డీవో భౌలిన్‌జయరాజ్ మాట్లాడుతూ పిల్లలు పరీక్షలు సరిగ్గా రాయకపోయినా వారిని నిరుత్సాహపరచొద్దని సూచించారు. మరోసారి ప్రయత్నిద్దామంటూ వారిని ప్రోత్సాహించాలని సూచించారు. పిల్లలు నిరుత్సాహ పడితే భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం వుందన్నారు.

పకడ్బందీగా నీట్..

తిరుత్తణి: తిరుత్తణిలో నీట్ పరీక్షలు ఆదివారం పగడ్బందీగా నిర్వహించారు. అభ్యర్థులను తనిఖీ చేసిన తరువాతే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. వైద్యవిద్య ప్రవేశాలకు వీలుగా నిర్వహించే నీట్ పరీక్షలు దేశ వ్యాప్తంగా ఆదివారం జరిగాయి. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి- చెన్నై- తిరుపతి జాతీయ రహదారిలోని ప్రయివేటు కళాశాలలో నిర్వహించిన నీట్ పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు పాల్గొన్నారు. వారిని డీఎస్పీ విగ్నేష్ ఆధ్వర్యంలో పోలీసులు, అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు.

జూలైలో పూందమల్లి -పోరూర్ మధ్య మెట్రో పనులు

కొరుక్కుపేట: ఫేజ్ 2 మెట్రో రైలు ప్రాజెక్టులో పూందమల్లి -పోరూర్ మధ్య మెట్రో నిర్మాణ పనులు జూలైలో ప్రారంభం కానున్నాయి. ఈ పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఈనెల చివరినాటికి ఉత్పత్తి పనులు, మెటీరియల్స్‌ను ప్లాట్ ఫారమ్‌పైకి తీసుకుని వచ్చి ప్రతిరోజూ సుమారు 80 మీటర్ల ట్రాక్‌ను వేసేలా ప్రణాళికలు చేస్తున్నట్టు తెలిపారు. చెన్నైలో రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టును రూ.63,246 కోట్లతో 118.9 కిలో మీటర్లు మేర మూడు లైన్‌ల్లో పనులు చేపడుతున్నారు. ప్రధానంగా పూందమల్లి నుంచి పోరూర్ వరకు పలుచోట్ల పిల్లర్లు వేసి దానిపైన రోడ్డు వేసే పనులను జూలైలో ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిపారు. 2025 నాటికి రైలు సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

ఆలందూరు- పాత చాకలిపేట మధ్య రైళ్ల సర్వీసులు పెంపు

చెన్నైలోని ఆలందూరు- పాతాచకలిపేట మధ్య 20 మెట్రో రైళ్ల సర్వీసులను పెంచారు. చెన్నైలోని విమానాశ్రయం -విమ్కో నగర్, సెయింట్ థామస్- చెన్నై సెంట్రల్ మార్గాలలో 54 కిలోమీటర్లు దూరం వరకు మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. 3.50 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో ఆలందూరు -పాత చాకలిపేట మార్గంలో మెట్రో రైలు స్టేషన్‌లో రద్దీని నివారించడానికి అదనపు రైళ్ల సర్వీసులను నడుపుతున్నారు. రైళ్ల సర్వీసులు ప్రతీ 3 నిమిషాలకు 3 మెట్రోలు నడిచేవిధంగా నిర్వహిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

అన్నమయ్య గొప్ప సామాజిక వేత్త


మాట్లాడుతున్న శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి

తిరుపతి కల్చరల్: భగవంతుని దృష్టిలో మనుషులందరూ సమానమేనని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమయ్య గొప్ప సామాజిక వేత్త అని శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాలు ఆదివారంతో రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన భూమన్ అన్నమయ్య- సామాజికత అనే అంశంపై ఉపన్యసించారు. ఆయన పలు సంకీర్తనల్లో ఆనాటి గ్రామీణ పరిస్థితులు, పాడి పంటలు, సాగునీరు, కుటుంబ సంబంధాలు వంటి అంశాలను తెలియజేశారని తెలిపారు. తాను శ్వేత డైరెక్టర్‌గా పని చేసిన కాలంలో అన్నమయ్య స్ఫూర్తితోనే శ్వేతలో గిరిజన, దళిత, మత్స్యకార తదితర వర్గాల వారికి అర్చక శిక్షణ ప్రారంభించామని గుర్తు చేశారు. బెంగళూరుకు చెందిన ఆచార్య జీఎస్.మోహన్ అన్నమయ్య -పురందరదాసులు అనే అంశంపై ఉపన్యసించారు. ఇద్దరి సంకీర్తనలు జానపద శైలిలో , సామాన్యప్రజలకు అర్థమయ్యేలా ఉంటాయన్నారు. విజయవాడకు చెందిన డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అన్నమయ్య -దివ్య ప్రబంధములు అనే అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం తిరుపతికి చెందిన జి.నాగేశ్వర నాయుడు బృందం నిర్వహించిన సంగీత కచేరి, తిరుపతికి చెందిన జ్యోత్స్న బృందం హరికథాగానం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ, తుడా కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

యోగాతో పెరుగుతున్న సనాతన ధర్మం ప్రతిష్ట

- యోగా గురువు రామ్‌దేవ్
- అంతర్జాతీయ యోగా దినోత్సవం
- 2023కు శంఖారావం



సదస్సులో మాట్లాడుతున్న రాందేవ్ బాబా

సాక్షి, న్యూఢిల్లీ : యోగాతో సనాతన ధర్మం ప్రతిష్ట ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతోందని యోగా గురువు రామ్‌దేవ్ అన్నారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో పతంజలి విశ్వవిద్యాలయం, భారత్ స్వాభిమాన్ (మహిళా విభాగం), జీ–20 భాగస్వామ్య సంస్థ డబ్ల్యూ–20 సంయుక్త ఆధ్వర్యంలో యోగా గురువు రామ్‌దేవ్ నాయకత్వంలో ఆదివారం మహిళా సదస్సు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 5,500 మంది మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగాను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లులు, సోదరీమణులు ప్రతికూల పరిస్థితుల్లో, పెద్ద సవాళ్లలోనూ స్వీయ–మతాన్ని వదిలివేయరాదని చెప్పారు. రాబోయే రోజుల్లో పతంజలి ద్వారా ఢిల్లీ ఎన్సీఆర్‌లో 10 వేల మంది పిల్లలకు రెసిడెన్షియల్ గ్లోబల్ గురుకులం, లక్ష మంది విద్యార్థులకు గ్లోబల్ యూనివర్సిటీ, 20 నుంచి 25 వేల మంది పిల్లలకు డే–బోర్డింగ్ స్కూల్ కోసం భవిష్యత్తు ప్రణాళికలు ఉన్నాయని వివరించారు.

విద్యను ప్రజల వద్దకు తీసుకెళతా: లోకేశ్

కర్నూలు(అర్బన్) : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తామని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆదివారం స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో మైనారిటీలతో ముఖాముఖి నిర్వహించారు. పాత స్కూల్ ఫీజు విధానాన్ని అమలు చేస్తామని, పెద్దలతో చర్చించి మదరసాల్లోని విద్యార్థులకూ ఫీజు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామని, విద్యను ప్రజల వద్దకు తీసుకుపోతామని తెలిపారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో మైనారిటీలపై దాడులు, హత్యలు, అరాచకాలు పెరిగిపోయాయని ఆరోపించారు.

ఆర్థిక నేరాలకు మార్గదర్శితో ముగింపు!

▶ మొదటి పేజీ తరువాయి

ఆదివారం సాయంత్రం స్వర్ణాంధ్రవేదిక ఆధ్వర్యంలో 'రామోజీరావు మార్గదర్శి అక్రమాలు–నిజానిజాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో పలువురు మాట్లాడారు.

ఎవరికి ఫిర్యాదు చేయాలి?: ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎంపీ

17 ఏళ్ల తరువాత డబ్బులు ఎవరికి ఇచ్చారో వెల్లడించాలని మార్గదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఘన విజయం సాధించామని చెప్పుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాం. జూలై 18కి కేసు వాయిదా వేశారు. చాలా ఏళ్లు న్యాయస్థానాల్లో కేసు ఏమిటనేది వినే పరిస్థితి రాలేదు. 2021లో హైకోర్టులో కేసు కొట్టివేసిన తర్వాత ఎస్‌ఎల్‌పీ (స్పెషల్ లీవ్ పిటిషన్)దాఖలు చేశా. ఏడాది తర్వాత ఏపీ ప్రభుత్వం నేరుగా ఎస్‌ఎల్‌పీ వేసింది.



సదస్సుకు హాజరైన రామోజీరావు తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు, ఇతర ప్రముఖులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరైన టైమ్‌లో స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ వేయడంతో నాకు నమ్మకం వచ్చింది. ఈ కేసు కథ ముగిసిపోతుందనుకున్న తరుణంలో వైఎస్ జగన్ వేసిన ఎస్‌ఎల్‌పీతో మళ్లీ మొదలైంది. దివంగత వైఎస్సార్ అనుకున్నది రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి చేయలేకపోయారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. ఎవరికి డబ్బులు చెల్లించారనే వివరాలు బయటకు వస్తే ఈ కేసు ఈడీకి వెళ్తుందా? మనీ ల్యాండరింగ్ కిందకు వెళ్తుందా? చెల్లించిన డిపాజిటర్లు ఎవరు? అనే విషయాలు బయటకు వస్తాయి. మొత్తం 2.36 లక్షల మంది పేర్లు బయటికి వస్తాయి. దీన్ని వచ్చే ఎన్నికల్లో ఇష్యూ చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యంగా కనిపిస్తోంది. ఎవరూ కంప్‌లైంట్ ఇవ్వలేదని రామోజీ అంటున్నారు. చిట్ డబ్బులు ఇవ్వకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలి? పోలీస్ స్టేషన్‌లో ఇస్తే తీసుకుంటారా? కలెక్టరేట్‌లో తీసుకుంటారా?

అదే బాటలో ధనలక్ష్మి, కార్తికేయ...

రామోజీని చూసి మిగిలిన చిట్స్ కూడా మోసాల బాట పడుతున్నాయి. రామోజీ ఏం చేస్తున్నారో అందరూ అదే చేస్తున్నారు. మూడు నెలల క్రితం కాకినాడలో ధనలక్ష్మి సొసైటీ, నెల క్రితం కార్తికేయ సొసైటీ మూతపడ్డా పోలీసులు ఏమీ చేయలేకపోయారు. ఎర్రన్నాయుడి వియ్యంకుడైన ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడిని ఇదే మోసం కారణంగా అరెస్టు చేశారు. రామోజీని అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు తీర్పు వచ్చింది. మరి అలాంటప్పుడు అప్పారావును ఎందుకు అరెస్టు చేశారని ఆయన్ను పరామర్శించేందుకు వచ్చిన చంద్రబాబు ఎందుకు ప్రశ్నించలేదు? ఇద్దరికీ చెరో నీతా? రామోజీని ఇంటికెళ్లి విచారిస్తారు.. అప్పారావును ఎందుకు అరెస్టు చేస్తారు? అని అడగాలి కదా! ఆదిరెడ్డి అప్పారావు ఏమైనా పర్వాలేదు కానీ రామోజీకి ఏమీ జరగకూడదని టీడీపీ స్టాండ్ తీసుకుంది.

అబిడ్స్ స్టేషన్‌లో రామోజీ..

ఈనాడుకు మొట్టమొదటి ఎడిటర్‌గా ఉన్న ఏబీకే ప్రసాద్‌కు ఫోన్ చేస్తే.. ఏ పర్మిషన్ లేకుండా చిట్ ఫండ్ కంపెనీ నడుపుతున్నారన్న ఆరోపణలపై రామోజీరావు నాలుగు రోజుల పాటు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారన్న కొత్త విషయాన్ని చెప్పారు. ఆ తర్వాతే మార్గదర్శిని రిజిస్టర్ చేశారట. జీవీ రెడ్డి మార్గదర్శిపై చర్చకు వస్తామని ప్రకటించారు. కానీ హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌ని ఈ నెల 14న టీడీపీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ పేరుతో బుక్ చేసుకున్నారు. రామోజీ కోసం ఏమైనా చేస్తామని తద్వారా టీడీపీ నేరుగానే చెబుతోంది.

రెండు దశాబ్దాల నిరంకుశత్వం



రామోజీ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న మార్గదర్శితో ఈ వేదికపై ఉన్నవారెవరికీ వ్యక్తిగత ద్వేషాలు లేవు. ఈనాడైనా.. చిత్తు కాగితాలైనా.. పచ్చళ్లైనా.. పరిశ్రమలైనా.. చిట్స్ అయినా.. తానే చేయాలన్నదే రామోజీరావు కాన్సెప్ట్. చిన్నవాడెవడూ బతకకూడదు. ఆయనకి యాడ్స్ ఇవ్వకపోతే వ్యతిరేకంగా వార్తలు రాయడం నిత్యకృత్యమైంది. బలవంతుడైన రామోజీతో పోరాటం చేయడం చిన్నవిషయం కాదు. అధికార శక్తి, మీడియా శక్తి ఏకమైతే ఎంత భయంకరంగా ఉంటుందో గత రెండు దశాబ్దాలుగా రామోజీ రూపంలో చూస్తున్నాం. మార్గదర్శి అక్రమాలపై త్వరలో తిరుపతిలో సదస్సు నిర్వహిస్తాం.

– కేటీజీ తిలక్, స్వర్ణాంధ్ర దినపత్రిక ఎడిటర్

'చంద్రమతి మాంగల్యం'.. మార్గదర్శి ఆస్తులు!



డిపాజిటర్లు మోసపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా వ్యవహరించి డిపాజిటర్లను కాపాడింది. కొత్త అప్పులు రెండు లక్షల మందికిపైగా డిపాజిటర్లకు గుదిబండగా మారనున్నాయి. అనుబంధ కంపెనీలకు నిధులు ఎలా బదలాయిస్తారు? 'చంద్రమతి మాంగల్యం' మాదిరిగా ఆస్తులు వారికి మినహా ఇతరులకు కనపడటం లేదు. అగ్రిగోల్డ్, సహారా మోసాలు జరిగిపోయాయి. మరిన్ని జరగకుండా నివారించడం మన బాధ్యత. నిజంగా డిపాజిటర్లకు చెల్లించి ఉంటే సుప్రీం ఆదేశాల ప్రకారం వివరాలను వెల్లడించాలి. డిపాజిట్ రసీదుపై రామోజీరావు సంతకం ఉంటుంది. డిశ్చార్జ్ రసీదుపై ప్రొప్రైటర్ సంతకం చేయడం నిబంధనలకు విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై పూర్తిగా లోతైన దర్యాప్తు చేపట్టాలి.

– శర్మ, ప్రముఖ న్యాయవాది.

బ్రహ్మయ్య కంపెనీలో వందల ఫిర్యాదులు



మార్గదర్శి, డాల్ఫిన్, ప్రియా ఫుడ్స్, ఈనాడుతో 1979 నుంచి నాకు అనుబంధం ఉంది. ఉండవల్లి పోరాటం జరిగిన తర్వాత రామోజీ మోసాలు ప్రతి ఒక్కటీ గుర్తుకొచ్చాయి. మా మామయ్య కేఎస్ రెడ్డి అన్నదాత ఎడిటర్‌గా ఉండేవారు. రామోజీ ప్రజల డబ్బులతో హోటల్స్.. ప్రింటింగ్ ప్రెస్‌లు, బిల్డింగ్‌లు కడుతున్నారని, చివరకు ఏమవుతుందోనని మామయ్య ఆందోళన చెందేవారు. చట్టాల్లో లొసుగులను అడ్డు పెట్టుకొని తప్పించుకోవడం రామోజీరావుకి వెన్నతో పెట్టిన విద్య. టీడీపీ నుంచి వచ్చిన జీవీ రెడ్డికి, మార్గదర్శికి ఏం సంబంధం? మా గ్రామంలో ఒక వ్యక్తికి చిట్ అయిపోయిన 9 ఏళ్ల తర్వాత డబ్బులిచ్చారు. నేను ఆడిట్ చేసిన సమయంలో బ్రహ్మయ్య అండ్ కంపెనీలో మార్గదర్శిపై కొన్ని వందల కంప్‌లైంట్స్ ఉన్నాయి.

– నాగార్జునరెడ్డి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్

రెచ్చిపోయిన టీడీపీ

వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు

- పార్టీ సోషల్ మీడియా కన్వీనర్, గ్రామ కన్వీనర్‌లపై దాడులు
- చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో ఘటనలు



దాడికి గురైన వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యం, అప్పసాని చంద్రశేఖర్

పుత్తూరు రూరల్(చిత్తూరు జిల్లా)/పెదకాకాని : వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ శ్రేణుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం, పుత్తూరు మండల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కె.సుబ్రమణ్యంపై, అలాగే గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామ కన్వీనర్‌గా అప్పసానిపై ఆదివారం వేర్వేరుగా దాడులకు తెగబడ్డారు. కె.సుబ్రమణ్యం ఆదివారం ఉదయం తన స్వగ్రామం నేసనూరులోని పొలం వద్దకు వెళుతుండగా.. అదే గ్రామానికి చెందిన చెందిన టీడీపీ నేత పి.వాసు, టీడీపీ నేతలు వెనుక నుంచి వచ్చి దాడి చేశారు. పెద్ద బండరాయితో తలపై బలంగా మోదడంతో సుబ్రమణ్యం కిందపడిపోయాడు. సమీపంలో ఉన్న అతని అల్లుడు మోహన్.. కేకలు వేస్తూ అక్కడికి రావడంతో టీడీపీ నేతలు పరారయ్యారు. సుబ్రమణ్యాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో కె.సుబ్రమణ్యం వైఎస్సార్‌సీపీ బూత్ ఏజెంట్‌గా వ్యవహరించడంతో పాటు, ఇటీవల సోషల్ మీడియాలో చురుగ్గా పనిచేస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు ఇలా దాడికి తెగబడ్డారని అతని అల్లుడు మోహన్ పోలీసుల ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ వాళ్ల రక్తం తాగుతాం

పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామ కన్వీనర్‌గా అప్పసాని చంద్రశేఖర్ గ్రామంలో టీ తాగిన అనంతరం బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. అక్కడే ఉన్న తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు మోపర్తి సంజీవ్, మోపర్తి మణికాంత్‌లు బైక్ ఆపి ముందు చక్రం పట్టుకుని పైకి లేపి కింద పడేశారు. కమ్మ కులంలో పుట్టి వైఎస్సార్‌సీపీలో పనిచేయడానికి సిగ్గులేదా? ఈ సారి అధికారంలోకి వచ్చేది టీడీపీనే, వైఎస్సార్‌సీపీ వాళ్ల రక్తం తాగుతాం.. నీ అంతు చూస్తాం.. అంటూ ఘర్షణకు దిగారు. చంద్రశేఖర్ ఒంటిపై ఉన్న చొక్కా చింపి పిడిగుద్దులు గుద్ది కింద పడేసి కాలితో గొంతుపై తొక్కారు. అక్కడకు చేరుకున్న కిలారి రమేష్ వారి నుంచి చంద్రశేఖర్‌ను రక్షించి అనంతరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ చంద్రశేఖర్‌ను పోలింగ్ బూత్ నుంచి బయటకు పిలిచి దాడి చేశారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం చంద్రశేఖర్ ఇంటికి వెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ

కేసీఆర్‌వి స్వార్థ రాజకీయాలు

- దళితులను అన్నిరకాలుగా మోసం చేశారు
- బీఎస్పీ అధినేత్రి, యూపీ మాజీ సీఎం మాయావతి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ పేరుతో తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం స్వార్థ రాజకీయాలు చేస్తోందని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) జాతీయ అధ్యక్షురాలు మాయావతి మండిపడ్డారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలంటున్న కేసీఆర్.. ఆ మహానుభావుడి విగ్రహాల సాకుతో అణగారిన వర్గాలను మరోసారి ఏమార్చేందుకు వస్తున్నారని విమర్శించారు. బీఎస్పీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో 'తెలంగాణ భరోసా సభ' జరిగింది. మాయవతి ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను ఉత్తరప్రదేశ్ సీఎంగా ఉన్నప్పుడు భూమి లేని దళితులకు మూడెకరాల భూమిని ఉచితంగా ఇచ్చానని.. కేసీఆర్ ఆ పథకాన్ని కాపీకొట్టి ఎన్నికల హామీగా ఇచ్చారని మాయావతి చెప్పారు. కానీ కేసీఆర్ దళితులకు భూమి పంపిణీ చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఎస్పీ బలోపేతం అవడంతో కేసీఆర్‌కు భయం పట్టుకుందన్నారు. బిహార్‌లో తెలంగాణకు చెందిన దళిత ఐపీఎస్‌ను చంపిన హంతకుడిని అక్కడి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేస్తే.. సీఎం కేసీఆర్ కనీసం కూడా ప్రశ్నించలేదేమని నిలదీశారు. అంబేడ్కర్, కాన్షీరాం స్ఫూర్తితో బీఎస్పీ అణగారిన వర్గాలకు అండగా నిలిచిందని.. భవిష్యత్తులో తెలంగాణలో అధికారంలోకి వస్తే యూపీలో అమలుచేసిన సంక్షేమ పథకాలను ఇక్కడా అమలు చేస్తామని మాయావతి ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లోని పేదలు, రైతులు, కూలీలు, నిరుద్యోగులు, మైనారిటీవర్గాలతో పాటు ఉన్నత వర్గాల్లోని పేదలకు కూడా బీఎస్పీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో బీఎస్పీ అధికారంలోకి వస్తే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమారే ముఖ్యమంత్రి అని మాయావతి ప్రకటించారు.

మామిడిలో మారాజు

కొత్తపల్లి కొబ్బరి మామిడికి సాటి ఏదీ

- పీసందైన పండూరు మామిడిదీ అదే తీరు
- కాలం మారినా ఎప్పటికీ ఇవి మధుర ఫలాలే..



కొత్తపల్లిలో విరగకాసిన కొత్తపల్లి కొబ్బరి మామిడి చెట్టు



పిఠాపురం: కొత్తపల్లి నుంచి కొత్త ఢిల్లీ వరకు మారుమోగిన పేరు కొత్తపల్లి కొబ్బరి మామిడి. మామిడి ప్రియుల మనసు దోచుకున్న ఒకే ఒక్క మధుర ఫలం ఇది. మామిడిలో ఎన్నో రకాలు ఉన్నప్పటికీ రాష్ట్రంలో గోదావరి జిల్లాల్లో మాత్రమే పండే కొత్తపల్లి కొబ్బరి, పండూరు మామిడిలకు ఉన్న ప్రాముఖ్యత మరే రకానికి ఉండదంటే అతిశయోక్తి కాదు. ఈ రెండింటినీ మామిడి ఉత్పత్తుల్లో (హిడెన్ జెమ్స్) దాచుకున్న రత్నాలు, వజ్రాలుగా భావిస్తారు. ఏగ్రామాల్లో వీటి ప్రాముఖ్యతను గుర్తించి సంరక్షించారో ఆయా గ్రామాల పేరున ఇవి ప్రసిద్ధి చెందాయని ఇక్కడి రైతులు చెబుతున్నారు. రాజుల కాలం నుంచి ఉత్తమ లక్షణాలున్న ఫలాలుగా గుర్తింపు పొందడంతో వీటికి ప్రాధాన్యత పెరిగింది. పూర్వం ఆంధ్ర ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు తమ తోటల్లో వీటిని పెంచుకున్నారని తెలిసింది. తమ మిత్ర రాజులకు మామిడి పండ్లను కానుకలుగా పంపేవారు. రాజ సంస్థానాల్లో మాత్రమే ఉండే ఈ పళ్లను సాధారణ ప్రజానీకం కనీసం చూసే అవకాశం కూడా ఉండేది కాదని పలు కథనాలు ప్రచారంలో ఉన్నయి. ఇప్పటికీ ఈరకం మామిడి పండ్లను స్నేహితులకు, బంధువులకు, ప్రియతమ రాజకీయ నాయకులకు బహుమతిగా పంపించడంఆనవాయితీగా కొనసాగుతోంది.

కొత్తపల్లి కొబ్బరి

కొబ్బరి తరహా పీచు అధికంగా ఉండడంతో పాటు మేలిమి బంగారు రంగులో కొత్తపల్లి కొబ్బరి మామిడి మెరిసిపోతుంది. నోరూరించేలా సువాసనలు వెదజల్లుతుంటుంది. పూదోటలో సువాసనల మాదిరిగా ఈమామిడి పండ్లు ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యేక సువాసనలు ఆస్వాదించవచ్చు. ఈ మామిడి పండులో ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు కెరోటిన్, కాల్షియం, విటమిన్ ఏ, సీ ఎక్కువగా ఉంటాయి. తొక్క పలుచగా ఉంటుంది. పీచు చాలా ఎక్కువగా ఉంటుంది. పులుపు ఎక్కువగా ఉండడం వల్ల పచ్చి మామిడి మామూలుగా తినలేరు. పండు అయ్యాక రుచి అతి మధురంగా ఉంటుంది. ఈమామిడి కాయలు తక్కువ పరిమాణంలో ఉంటాయి. పండు చిన్నదే గాని ధరలో మాత్రం ఎక్కువగానే ఉంటుంది. కేవలం మామిడి సీజన్‌లో మాత్రమే పండుతాయి. పీచు ఎక్కువగా ఉండడం వల్ల పచ్చళ్లకు ఎక్కువగా ఉపయోగిస్తారు. ఆ మామిడితో పెట్టిన పచ్చళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. ఇవి తక్కువగా కాస్తాయి, గోదావరి జిల్లాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన మామిడి రకాల్లో దీనిదే ప్రథమ స్థానం.

50 ఏళ్ల క్రితం ఒక్క చెట్టే ఉండేది



50 ఏళ్ల క్రితం కొత్తపల్లిలో ఒకే ఒక్క కొబ్బరిమామిడి చెట్టు ఉండేది. అప్పట్లో పండ్లు ముగ్గబెట్టడం తప్ప వేరే మార్గం లేదు. పండు అయ్యే వరకు చెట్టు నుంచి కోయకుండావదిలేసేవారు. దీంతో ఆచెట్టు పండ్లు తయారవ్వగానే చెట్టు చుట్టు పక్కల సువాసనలు వచ్చేవి. రుచి చూసిన వారు కొత్తపల్లిలో మాత్రమే దొరకడంతో పాటు కొబ్బరి లాంటి రుచి, పీచుతో ఉండడంతో కొత్తపల్లి కొబ్బరి మామిడిగా పేరొందింది. అప్పట్లో కొత్తపల్లికి చెందిన అప్పటి కాంగ్రెస్ నేత రావు అచ్చారావు ఈ పండ్లను పంపిస్తే నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తిని మెచ్చుకున్నారు. చెట్టు కొమ్మలకు అంట్లు కట్టి మొక్కలు తయారు చేయడంతో సంతతి పెరిగింది. ఇప్పుడు వివిధ రకాల హైబ్రీడ్ మొక్కలు అందుబాటులోకి వచ్చినా పూర్వం నుంచి ఉన్న విత్తనం ద్వారా వచ్చిన చెట్ల మామిడి పండ్లే అసలైన రుచిని కలిగి ఉంటాయి.

– కాకి శ్రీరాములు, రైతు, వాకతిప్ప.

మియా జాకీ కంటే మధురమైనది



విదేశాల్లో రూ.లక్షలు పలికే మియా జాకీ మామిడి పండ్ల కంటే మధురమైనది కొత్తపల్లి కొబ్బరి మామిడి. విదేశాల్లో ప్రయోగాత్మకంగా వాటి విలువను చాటి చెప్పడం వల్ల ఎక్కువ ధర ఉంటుంది. ఎక్కడో విదేశాల మామిడిని మనం గొప్పగా చెప్పుకుంటున్నాం. వాటి కంటే విలువైన పోషకాలున్న అతి మధుర ఫలాలు మన కొత్తపల్లి కొబ్బరి, పండూరు మామిడి రకాలు. వీటిని తలదన్నే మామిడి రకాలు ఎక్కడా లేవనే చెప్పాలి. ఇప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రముఖులు ఈరెండు రకాల మామిడి పండ్లనే అడుగుతుంటారు. వీటిని శాస్త్రీయంగా మధుర ఫలంగా చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఓదూరి నాగేశ్వరరావు, మామిడి రైతు, చేబ్రోలు.

పండూరు మామిడి

మామిడి రకాల్లో పండూరు మామిడి అత్యంత పురాతనమైన రకం. ఈచెట్టు వంద అడుగుల ఎత్తు వరకు ఎదుగుతుంది. చెట్టు నిండా కాయలు ఉంటాయి. చూడడానికి పప్పులో వేసుకునే చిన్న మామిడి కాయలుగా మాత్రమే ఉంటాయి. పండ్లు కూడా పచ్చగానే ఉండడం వీటి విశేషం. వీటి గురించి ఈ ప్రాంతంలో రకరకాలుగా చెబుతారు. గతంలో ఉండ్రాజవరం మండలంలోని వెలగదురు గ్రామ పరిసరాల్లో కొందరు దొంగలు మామిడి పండ్లను సంస్థానంలో దొంగిలించారని.. తిన్నాక టెంకలను కోట అవతల పారేశారని చెబుతారు. వాటిని తీసి నాటగా ఎదిగిన చెట్టు ద్వారా పండూరు రకం మామిడి పండ్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయనేది ఇక్కడ ప్రచారం లో ఉంది.

కొల్లేరులో ఆగని చెరువుల దందా



ప్రత్తికోళ్లలంక వద్ద అభయారణ్యంలో పొక్లెయిన్‌తో తవ్వకాలు చేస్తున్న దృశ్యం

- అభయారణ్యంలో నిరాటంకంగా అక్రమ తవ్వకాలు
- అటవీ శాఖ అధికారుల తీరుపైనా అనుమానాలు

ఏలూరు రూరల్: కొల్లేరు అభయారణ్య పరిధిలో అక్రమార్కుల చెరువుల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. నేటికీ అభయారణ్యంలో చేపల చెరువుల అక్రమ తవ్వకాలు సాగుతుండటంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏలూరు మండల పరిధిలోని ఓ గ్రామ సర్పంచ్ వర్గీయులు అభయారణ్యంలో గుట్టుచప్పుడుగా తవ్వకాలు చేస్తున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపారా అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది. కొద్దిరోజుల క్రితం అధికారులు తవ్వకాలను అడ్డుకున్నా నేడు వీటివైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. అక్రమార్కులు శుక్ర, శని, ఆదివారం పెద్ద సంఖ్యలో కూలీలను ఏర్పాటు చేసుకుని తవ్వకాలు కొనసాగించారు. కైకలూరు, భీమవరం, విజయవాడ నుంచి యంత్రాలను లారీలపై అభయారణ్యంలోనికి తరలించారు. గతవారం ఈ యంత్రాలను అధికారులు మాధవాపురం చెక్‌పోస్టు వద్ద అడ్డుకుని వెనక్కి పంపించడం తెలిసిందే. మళ్లీ ఈ యంత్రాలన్నీ అభయారణ్యంలో ప్రత్యక్షం కావడం గమనార్హం. మరోపక్క తవ్వకాలు ఇతరులు కంటపడకుండా అక్రమార్కులు గ్రామ సరిహద్దుల వద్ద మనుషులను కాపలా పెట్టారు.

టీడీపీ హయాంలోనే చెరువుల తవ్వకం

ఈ వివాదాస్పద చెరువుల కారణంగా ఎనిమిదేళ్ల క్రితం గ్రామంలో ఘర్షణలు చెలరేగిన సంగతి తెలిసిందే. టీడీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో ఈ చెరువులు తవ్వించారు. 2014లో ఈ చెరువుల ద్వారా వచ్చే కోట్ల రూపాయలు ఆదాయంపై గ్రామస్తులు, సర్పంచ్ వర్గీయుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామప్రజలు నెలలు తరబడి దీక్షలు, ఆందోళన చేపట్టారు. సర్పంచ్‌ను శిక్షించాలని నాటి టీడీపీ మంత్రులకు సైతం ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోయింది.


త్వరలో జాతీయ చిత్రంగా 'జై బాలాజీ'

- దర్శకుడు ఉదయభాస్కర్ వెల్లడి

ఆకివీడు : తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడి ఏడుకొండలు ఎలా, ఎందుకు, ఎప్పుడు ఏర్పడ్డాయి అనే అంశం ప్రధాన ఇతివృత్తంగా 'జై బాలాజీ' చిత్రాన్ని జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నట్టు ప్రముఖ దర్శకుడు పువ్వాడ ఉదయభాస్కర్ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో ఆదివారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పౌరాణిక, సాంఘిక చిత్రాలు అనేకం నిర్మించానని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది అవార్డులు కూడా పొందానని తెలిపారు. వేంకటేశ్వరస్వామిని మన రాష్ట్రానికి, తమిళనాడు, సరిహద్దు రాష్ట్రాలకు ఏడుకొండలవాడుగా, శ్రీవారుగా, కలియుగ దైవంగా భావించి కొలుస్తామన్నారు. ఉత్తర భారతంలో మాత్రం వేంకటేశ్వరుడిని బాలాజీగానే కొలుస్తారన్నారు. అదే పేరుతో జాతీయ స్థాయిలో గోవర్దన్ సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రధాన తారాగణంగా అశుతోష్ రాణా, జయప్రద, జయసుధలు నటిస్తున్నారని వివరించారు. పూర్తి సెట్‌లతో నిర్మించే చిత్రంలోని నాలుగు పాటలను ఇండోనేషియాలోని బాలిలో చిత్రీకరించనున్నట్టు చెప్పారు. ఈ చిత్రం తరువాత 'శ్రీ పాద వల్లభ' అనే చిత్రాన్ని తీయనున్నట్టు తెలిపారు. పిఠాపురం శ్రీపాద వల్లభుని చరిత్ర, పిఠాపురం, కురుపురం ప్రాంతాల్లో చిత్రీకరిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో దర్శకత్వం వహించిన 'డిఫరెంట్' అనే ఆంగ్ల చిత్రం జూన్ తరువాత ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తామని ఉదయభాస్కర్ వివరించారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
సోమవారం ॥ 8-5-2023

సన్నిధి



మంచి మాట

మంచితనం; మానవ జాతి మొదలయిన రోజు నుంచి ప్రతిమనిషికి అతిముఖ్యంగా కావాల్సి వచ్చింది ఏదైనా ఉంది అంటే అది మంచితనం. ఒక మనిషి నుంచి మరొక మనిషికి జారి పోకుండా అందాల్సింది ఏది అని అంటే అది మంచితనం. మొత్తం మానవ జాతికి సర్వదా, సర్వథా క్షేమకరం అయిందీ, లాభకరం అయిందీ ఏదైనా ఉందీ అంటే అది మంచితనం.

ఉండాల్సిన లక్షణం

మానవజాతిలో మంచితనానికి ఆది నుంచీ కొరత ఉండడం కాదు అసలు మంచితనం మనలోకి, ప్రపంచంలోకి ఇంకా రానేలేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని మనం తెలుసుకోవాలి. అందువల్ల ఇకపైనైనా మనలో మంచితనం కోసం మంచి ప్రయత్నాలు మొదలు అవచ్చు.

మంచితనం అని మనం అనుకుంటోంది నిజానికి మంచితనం కాదు. మంచితనం అని మనం అనుకుంటోంది మంచితనమే అయి ఉంటే మన ప్రపంచంలో జరుగుతూ వస్తున్న హాని, విధ్వంసం, ప్రాణ, ఆస్తి నష్టాలు, ద్రోహాలు, దొంగతనాలు, కుట్రలు, మనుషుల బతుకులు అల్లకల్లోలం అవడమూ మనకు తెలుస్తూ ఉన్నంత తెలుస్తూ ఉండేవి కావు; ఇప్పటిలా మనం వాటివల్ల దెబ్బ తినేవాళ్లం కాము.

మంచితనానికి మంచి జరగలేదేమో? అందుకే మనలోకి, ప్రపంచంలోకి రావడానికి మంచితనానికి ఇంకా మంచిరోజు రాలేదేమో? మంచితనానికి మంచి జరిగే ఉంటే ఎంతో బావుండేది. మనకు నెమ్మది, మన బతుకులకు భరోసా ఉండేవి.

ఆది నుంచే లోకంలో మంచితనం లేదు కాబట్టే మాట వచ్చిన నాటి నుంచీ ప్రతిభాషా మంచితనం ఆవశ్యకతను పదేపదే చెబుతూనే ఉంది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోని యోగులు, గురువులు, కవులు, జ్ఞానులు అందరినీ మంచితనంవైపు మళ్లించే మాటలు చెప్పారు. ప్రపంచంలోని ప్రతి మతమూ మంచిగానూ, మంచితోనూ ఉండమని చక్కగా, చిక్కగా చెప్పింది.

ఎందుకో చెడు అబ్బినట్టుగా మనిషికి మంచి అబ్బలేదు. ఏమిటో మరి చెడుకు మాలిమి అయినట్టుగా మనిషి మంచికి మాలిమి అవలేదు. ఇందుకు కారణాలు తెలిసిపోతే మంచికి రోజులు వచ్చేస్తాయేమో? చెడుకు రోజులు చెల్లిపోతాయేమో?

మనిషి చెడుతోనే పుడతాడు. చెడు అన్నది ఎవరికైనా పుట్టుకతోనే వచ్చేస్తుంది. మనిషిలో చెడు సహజంగానే ఉంటుంది. మనిషి తనలో ఉన్న చెడును తొలగించుకుంటూ మంచిని అభ్యసిస్తూ ఆపై దాన్ని సాధించాల్సి ఉంటుంది. మనిషికి చెడు అన్నది లక్షణం; మంచి అన్నది లక్ష్యం. మనిషి తన లక్షణాన్ని వదులుకుని ఆ లక్ష్యాన్ని సాధించలేకపోతున్నాడు.

> ఆది నుంచే లోకంలో మంచితనం లేదు కాబట్టే మాట వచ్చిన నాటి నుంచీ ప్రతిభాషా మంచితనం ఆవశ్యకతను పదేపదే చెబుతూనే ఉంది. ప్రపంచంలోని ప్రతి మతమూ మంచిగానూ, మంచితోనూ ఉండమని చక్కగా, చిక్కగా చెప్పింది.

మనకు ప్రశాంతత కావాలి; అందుకు మంచితనం వచ్చి తీరాలి. మంచితనం వేగంగా రావాలి; మంచితనం నిజంగా రావాలి. కొత్తగా పుట్టిన నదిలా అది ఎప్పటికీ ఉండేలా మంచితనం మనలోకి ప్రవహించాలి.

'ఓ మంచితనమా, నువ్వు ఎక్కడ ఉన్నావ్? నువ్వు ఎక్కడ ఉన్నా నీకు ఇదే మా స్వాగతం; ఇంకా నువ్వు వేచి ఉండకు రా మాలోకి. రాయని కవితలా ఎక్కడో ఉండిపోకు; సరైన తరుణం ఇదే రా మాలోకి. మాకు నీ అవసరం చాలా ఉంది;

నువ్వు లేకపోవడం వల్ల మా ఈ లోకం అపాయకరం అయిపోతూ ఉంది. వెంటనే వచ్చేసెయ్ ఓ మంచితనమా, ఎదురు చూస్తూ ఉన్నాం రా మంచితనమా రా' అంటూ మనం అందరమూ మన క్షేమం కోసం మంచితనాన్ని మనసా, వాచా తప్పనిసరిగా ఆవాహన చెయ్యాల్సిన అవసరం ఉంది.

మంచితనం మనలో లేనందువల్ల మనం విరిగిపోయిన వాక్యాలం అయ్యాం; అందువల్ల మనం అనర్థదాయకం అయ్యాం. ఈ స్థితిని అధిగమించి మంచితనాన్ని సాధిద్దాం; మనుగడను సాత్వికం చేసుకుందాం.

– రోచిష్మాన్

గురువాణి

వాటిని ఎందుకు చదవాలి?

మనిషి జీవితంలో సంతరించుకోవలసిన గొప్ప గుణాలను గురించి గురజాడ అప్పారావుగారు ఒకచోట ఇలా అన్నారు... '' ఈవియుదియ్యని మాటయు / భావంబున జేయతగిన పనితెలియుటయున్ / తీవియగు ధైర్యభావము/ రావు సుమీ యొకని వలన రావలె తనతోన్''...

ఈవియు .. అంటే త్యాగం. మనిషి తనకుతాను సుఖపడితే తప్పుకాదు. మనిషి త్యాగంతో గొప్పవాడు అవుతాడు. ఇతరుల గురించి ఆలోచించి, వాళ్లను కష్టాల్లోంచి పైకి తీసుకురావడానికి.. తాను ఎంత శక్తిని వినియోగించుకోగలడో, అంత శక్తినీ, ఏ విధమైన గుర్తింపునీ కోరకుండా అది తన కర్తవ్యం అన్న భావనతో ప్రేమ



భావనతో చేయదగిన వ్యక్తి ఎవరున్నారో ఆయన త్యాగశీలి. అటువంటి మహానుభావులు ఎందరో పుట్టకపోతే అసలీ దేశానికి స్వాతంత్ర్యం ఎలా సిద్ధించి ఉండేది? మన దగ్గర విషయమే తీసుకుంటే... బెజవాడ గోపాలరెడ్డి గారు పుట్టుకతో శ్రీమంతుడయినా దేశంకోసం చాలా శ్రమించాడు, చివరకు జైళ్ళకు కూడా వెళ్ళాడు. ఆయనకేం కర్మ! అలాగే టంగుటూరి ప్రకాశం పంతులు గారు. ఆరోజుల్లో లక్షల సంపాదన ఉన్న న్యాయవాద వృత్తిని వదిలి దేశంకోసం సర్వస్వం ధారపోశారు. స్వాతంత్ర్యోద్యమ విశేషాలను, సందేశాలను ప్రజలకు చేరవేయడానికి తన స్వార్జితంతో 'స్వతంత్ర' పత్రిక నడిపారు. లక్షలు ఖర్చుపెట్టారు... అటువంటి వారిది త్యాగమయ జీవితం. అంటే... త్యాగం మనిషిని శాశ్వతమైన కీర్తికి అర్హుణ్ణి చేస్తుంది.

తియ్యని మాటలు మాట్లాడడం ఒక మంచి సంస్కారం. తిరస్కరించవలసి వచ్చిన సందర్భాల్లోనూ ఎదుటివారిని నొప్పించకుండా మృదువుగా మాట్లాడగల గాలి. హనుమ నూరు యోజనాల సముద్రాన్ని దాటిపోతున్నప్పుడు మార్గమధ్యంలో మైనాకుడు తన ఆతిథ్యం స్వీకరించి వెళ్ళాలని కోరితే... కటువుగా తిరస్కరించలేదు. ''నాయనా! రామకార్యం మీద పోతున్నాను. వేళ మించిపోతోంది. నీవు నాకు ఆతిథ్యం ఇచ్చినట్లే, నేను పుచ్చుకున్నట్లే...'' అంటూ మృదువుగా చేతితో స్పృశించి వెళ్ళాడు తప్ప... ఎక్కడా కటువుగా మాట్లాడలేదు. రామాయణ భారతాది కావ్యాలు ఎందుకు చదవాలంటే... మాట మధురంగా ఉండడం కోసం, సంస్కారవంతమైన వాక్కు తయారవడం కోసం, మాట పదిమందికి పనికొచ్చేదిగా ఉండడం కోసం చదువుకుంటారు. ఎవ్వరికీ ఉపకారం చేయలేకపోవచ్చు. మనం చెప్పే ఓదార్పు మాటలు ఎదుటి వాళ్ళకు స్వాంతన కలిగిస్తాయి. చెడు మార్గంలో ఉన్న వాళ్లను మంచిమార్గం వైపు మళ్ళిస్తాయి.

భావంబున చేయదగిన పనిచేయుటయున్... భావం మనోగతం. తాను ఏ పనిచేయాలో ఆ పనినే మనసు తనకు జ్ఞాపకం చేస్తూ ఉంటే ఆ వ్యక్తి గొప్ప శీలవంతుడవుతాడు. అటువంటి సౌశీల్యం ఉండాలి. తీవియగు ధైర్య భావము... తీవి అంటే వైభవం.. పిరికితనం చూపకుండా తెగువ, పోరాట పటిమ చూపే సందర్భంలో కాకుండా... ఇక్కడ ధైర్యం అంటే... ఎంత కష్టం కలిగినా ఓర్చుకుని నిలబడి ప్రయత్నాన్ని కొనసాగించి కృతకృత్యులు కావడం.. ఆయన ధైర్యశాలి. ఆ ధైర్యం వైభవోపేతం...

ఇటువంటి గొప్పగుణాలు జన్మతః లేకపోయినా ప్రతివారూ ప్రయత్నపూర్వకంగా అలవాటు చేసుకోవాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

మొక్కుబడి


ఇద్దరు గ్రామస్తుల మధ్యన తమలో ఎవరు గొప్ప భక్తుడనే వాదన మొదలయ్యింది. వందలాది పుణ్య క్షేత్రాలు తిరిగి వచ్చిన తను గొప్ప భక్తుడినని ఒక గ్రామస్తుడు వాదించాడు. ఎన్నో ఉపవాసాలు, వ్రతాలు, దీక్షలు చేసిన తానే నిజమైన భక్తుడని మరో గ్రామస్తుడు వాదించసాగాడు. వాదనలు తీవ్ర రూపం దాల్చడంతో గ్రామం గుండా పోతున్న ఓ గురువును వారు ఆశ్రయించారు.

''మా భక్తి నిరూపించుకోడానికి ఏమైనా చేస్తాం, ఎన్ని సాహసకార్యాలైనా చేయగలం'' అని గట్టిగట్టిగా అరిచి చెప్పారు. వారిద్దరి వాదనలూ ఓపికగా విన్నాడు గురువు.

చిన్న నవ్వు నవ్వి ''మీలో ఎవరు నిజమైన భక్తుడో సులభంగా తెలుసుకోవచ్చు. మీరు నాతోపాటు రండి, ఎన్నో మహిమలను చూపే దేవుడు మా ఆశ్రమంలో ఉన్నాడు. ఆ దేవుడికి మీలో ఎవరు తలనీలాలు సమర్పిస్తారో వారే నిజమైన భక్తులు'' అని సెలవిచ్చాడు.

''అదెంత పని?'' అని వారిద్దరూ ముందుకు వచ్చారు.

''అయితే మా దేవుడికి తలనీలాలు ఎవరైతే సమర్పిస్తారో వారికి ఆ తదనంతరం తలపైన ఒక్క వెంట్రుక కూడా మొలకెత్తదు. దానికి సంసిద్ధులైనవారు మాత్రమే నాతో రాగలరు'' అని గురువు చెప్పాడు.



అంతే... అప్పటిదాకా గొప్ప భక్తులమని చెప్పుకున్న ఇద్దరూ, చల్లగా అక్కడినుంచి జారుకోబోయారు.

వారిని ఆపిన గురువు ''భవిష్యత్తులో వెంట్రుకలు రావని చెప్పేసరికి మీరు తలనీలాలు ఇవ్వడానికే సుముఖత చూపడం లేదు. బాహ్య సౌందర్యంలో చిన్న మార్పుకు సైతం అంగీకరించని మీరు అంతః సౌందర్యంలో మార్పులకు అంగీకరిస్తారా..? నిజమైన భక్తుడు ఎప్పుడూ లాభనష్టాలు బేరీజు వేయడు. సంపూర్ణంగా తనను నమ్మి సర్వస్వ శరణాగతి కోరే వారి వెంటే దేవుడు సర్వకాల సర్వావస్థలలోనూ ఉంటాడు'' అని వివరించాడు.

తప్పు తెలుసుకున్న ఆ ఇద్దరు గ్రామస్తులు గురువును క్షమాపణ కోరారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

అమృత బిందువులు

- ఎవరికీ తల వంచనిది ఆత్మగౌరవం. ఎవరి ముందూ చేయి చాచనిది ఆత్మాభిమానం. ఎవరినీ కాదనలేనిది ఆత్మీయత.
ఈ మూడు ఆత్మలు కూడిన మనిషి జీవితం సఫలం.
- వేడినీరు ఒకటే... కాని కోడిగుడ్డును ఉడికిస్తే గట్టిపడుతుంది. ఆలుగడ్డను ఉడికిస్తే మెత్తబడుతుంది.
రాగద్వేషాలు ఒక్కటే కాని ... ఆనందం కలిగినప్పుడు ఆనంద బాష్పాలు అవే. దుఃఖం కలిగినప్పుడు కన్నీటి ఓదార్పులు అవే.

సినిమా



● వరుణ్ తేజ్

వైజాగ్ నేపథ్యంలో...

హీరో వరుణ్ తేజ్, దర్శకుడు కరుణకుమార్('పలాస' మూవీ ఫేమ్) కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వరుణ్‌కి ఓ కథను వినిపించారట కరుణకుమార్. స్క్రిప్ట్ నచ్చడంతో ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని సమాచారం. పీరియాడికల్ క్రైమ్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమా వైజాగ్ నేపథ్యంలో ఉంటుందట. ఈ మూవీ కోసం వరుణ్ స్పెషల్ మేకోవర్ కానున్నారని టాక్. సెప్టెంబర్‌లో ఈ చిత్రం షూటింగ్ స్టార్ట్ అవుతుందని భోగట్టా. త్వరలోనే ఈ సినిమాపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలున్నాయి. మరోవైపు 'గాండీవధారి అర్జున' సినిమా కోసం ప్రస్తుతం వరుణ్ తేజ్ బుడాపెస్ట్‌లో ఉన్నారు. అలాగే హిందీలో శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు వరుణ్ తేజ్.



● రజనీకాంత్

మాస్ జైలర్

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'జైలర్'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించారు. ఇందులో శివరాజ్ కుమార్, మోహన్‌లాల్, జాకీష్రాఫ్, సునీల్, రమ్యకృష్ణ, తమన్నా, మీర్నా మీనన్ కీలక పాత్రలు పోషించారు. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్‌పై రూపొందిన ఈ చిత్రం ఆగస్టు 10న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. కాగా ఆదివారం 'జైలర్' నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. స్టైల్‌గా కారులో కూర్చున్న రజనీ మాస్ లుక్ ఆకట్టుకుంటోంది. కాగా రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న 'లాల్‌సలామ్' సినిమా షూటింగ్ కోసం ప్రస్తుతం ముంబైలో ఉన్నారు రజనీకాంత్. అలాగే 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా షూటింగ్ కూడా త్వరలోనే మొదలు కానుంది.



● శ్రీనివాసా చిట్టూరి, ప్రియమణి, కృతీశెట్టి, నాగచైతన్య, వెంకట్ ప్రభు, పవన్ కుమార్

అందరూ నా కస్టడీలోకి రావాలి - నాగచైతన్య

''కస్టడీ' సినిమా తొలి 20 నిమిషాలు డైరెక్టర్ వెంకట్‌గారిలా కూల్‌గా వెళుతుంది. 40వ నిమిషం నుంచి ఫాస్ట్‌గా వెళుతుంది.. థియేటర్లో బ్లాస్టే. అద్భుతమైన యాక్షన్స్ సీక్వెన్స్ ఉన్నాయి. నిజంగా ఒక కొత్త చైతూని (నాగచైతన్య) చూడబోతున్నారు.. అలా నా పాత్రని తీర్చిదిద్దారు వెంకట్‌గారు. ఈ నెల 12న మీరందరూ (ప్రేక్షకులు, అభిమానులు) నా కస్టడీలోకి రావాలని, నా కస్టడీలోనే ఉండాలని కోరుకుంటున్నాను'' అని నాగచైతన్య అన్నారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీశెట్టి జంటగా నటించిన చిత్రం 'కస్టడీ'. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాసా చిట్టూరి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నాగచైతన్య మాట్లాడుతూ – ''కస్టడీ' కథని వెంకట్‌గారు నాకు చెప్పినప్పుడు తొలిసారి నేను పైకిలేచి వెంటనే ఆయన్ని హత్తుకున్నా.. నాకు అంత ఎగ్జైట్‌మెంట్ ఇచ్చింది ఈ కథ. ఎడిటింగ్ రూంలో చూసినప్పుడు కూడా అదే ఎగ్జైట్‌మెంట్ వచ్చింది. అదే నమ్మకంతో ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నా. అజిత్, సూర్య, కార్తీ, శింబుగార్లతో వెంకట్‌గారు సినిమాలు తీసి తమిళ్‌లో ఎన్నో పెద్ద హిట్స్ ఇచ్చారు. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి వచ్చిన ఆయనకు స్వాగతం. నా కెరీర్‌లో భారీ బడ్జెట్ మూవీ 'కస్టడీ' అని చెప్పగలను. ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతలు శ్రీనివాస్, పవన్‌గార్లకు కృతజ్ఞతలు'' అన్నారు.

వెంకట్ ప్రభు మాట్లాడుతూ– ''ఈ సినిమాలో చైతన్యగారి స్టైల్, యాక్షన్, నటన, ఫ్యామిలీ సెంటిమెంట్, మాస్... ఇలా అన్నీ ఉన్నాయి. ఈ మూవీలో మీకు ఓ పెద్ద సర్‌ప్రైజ్ ఉంటుంది. 'కస్టడీ' రెండో పార్ట్ కూడా ఉంటుంది'' అన్నారు. ''అందరూ థియేటర్స్‌కి వచ్చి 'కస్టడీ' చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు నటి ప్రియమణి. ఈ వేడుకలో కృతీశెట్టి, నటుడు ప్రేమ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

అలాంటి సినిమాలంటే చాలా ఇష్టం

- సందీప్ కిషన్



● కావ్య థాపర్, సందీప్ కిషన్

''డైరెక్టర్ ఆనంద్, నేను మంచి స్నేహితులం. 'ఊరు పేరు భైరవకోన' లాంటి సినిమాని ఆయన నాతో చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇలాంటి ఫాంటసీ, అడ్వెంచర్ సినిమాలంటే నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టం'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. వీఐ ఆనంద్ దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా, వర్ష బొల్లమ్మ, కావ్య థాపర్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ–''నా పుట్టినరోజున(ఆదివారం) ఈ మూవీ టీజర్ విడుదల కావడం స్పెషల్ మూమెంట్. తొలిసారి చండీయాగం చేసి టీజర్ రిలీజ్ చేయడం చాలా పాజిటివ్‌గా ఉంది. అనిల్ సుంకరగారు లేకపోతే ఈ సినిమా ఇక్కడి వరకూ వచ్చేది కాదు'' అన్నారు. ''టైగర్' సినిమా నుంచి సందీప్, నాకు స్నేహం మొదలైంది. మరోసారి కలసి సినిమా చేస్తే ఇంకా గ్రాండ్‌గా ఉండాలని 'ఊరు పేరు భైరవకోన' చేశాం'' అన్నారు వీఐ ఆనంద్. ''ఈ సినిమా సందీప్ కెరీర్‌లో మరచిపోలేని బహుమతి అవుతుందని మాట ఇస్తున్నా'' అన్నారు అనిల్ సుంకర. ''మహాచండీ యాగంతో టీజర్‌లాంచ్ చేయడం ఇండస్ట్రీలో ఇదే తొలిసారి. ఈ ఐడియా ఇచ్చిన సందీప్‌గారికి థ్యాంక్స్'' అన్నారు రాజేష్ దండా. హీరోయిన్ కావ్య థాపర్ మాట్లాడారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: రాజ్ తోట.

మైనస్ 15 డిగ్రీల చలిలో...



● రకుల్

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ ఓ సాహసం చేశారు. మైనస్ 15 డిగ్రీల చలిలో ఐస్‌బాత్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో, ఫోటోలను రకుల్ సోషల్ మీడియాలో షేర్ చేయగా వైరల్ అవుతున్నాయి. అయితే రకుల్ ఇలా చేసింది సినిమా కోసం కాదు. క్రయోథెరపీలో భాగంగా ఐస్‌బాత్ చేశారనే టాక్ వినిపిస్తోంది. కండరాల నొప్పి నివారణ, మెరుగైన చర్మ సౌందర్యం వంటి వాటికోసం క్రయోథెరపీని ఫాలో అవుతారట. ఇక కమల్ హాసన్ 'ఇండియన్ 2', శివ కార్తికేయన్ 'అలయాన్' సినిమాల్లో నటించారు రకుల్. 'అలయాన్' నవంబరులో విడుదల కానుంది. అయితే 'ఇండియన్ 2' రిలీజ్ డేట్‌పై అతి త్వరలో ఓ స్పష్టత రానుంది.

యాత్ర 2 ఉంటుంది - డైరెక్టర్ మహీ వి. రాఘవ్



''యాత్ర' సినిమాని ప్రేక్షకులు బాగా ఆదరించారు. ప్రస్తుతం 'యాత్ర 2' సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అయితే ఆ చిత్రంలోని పాత్రలకు తగ్గ నటీనటులు కుదరడం లేదు. పూర్తి కథ, నటీనటులు ఫైనల్ అయ్యాక 'యాత్ర 2' ని సెట్స్‌పైకి తీసుకెళతాం'' అని డైరెక్టర్ మహీ వి.రాఘవ్ అన్నారు. ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్య కృష్ణ, 'జోర్దార్' సుజాత, దేవయాని, పావని గంగిరెడ్డి, హర్షవర్ధన్ లీడ్ రోల్స్‌లో నటించిన వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్'. మహీ వి.రాఘవ్, ప్రదీప్ అద్వైతం షో రన్నర్స్‌గా తేజ కాకుమాను దర్శకత్వం వహించారు. మహీ వి.రాఘవ్, చిన్నా వాసుదేవరెడ్డి నిర్మించిన ఈ వెబ్ సిరీస్ ఏప్రిల్ 27నుంచి డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా మహీ వి.రాఘవ్ పంచుకున్న విశేషాలు...

- మంచి కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని 'సేవ్ ది టైగర్స్' నిరూపించింది. కుటుంబం అంతా కలిసి మా వెబ్ సిరీస్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.. దీంతో ఒక మంచి సిరీస్ తీశామనే తృప్తి ఉంది. ఇలాంటి చక్కని సిరీస్‌ని నిర్మించే అవకాశం మాకు కల్పించిన డిస్నీ హాట్‌స్టార్‌కి థ్యాంక్స్. త్వరలో 'సేవ్ ది టైగర్స్' రెండో సిరీస్ షూటింగ్ ప్రారంభిస్తాం.
- ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఎన్నికల సమయంలో 'యాత్ర 2' ని విడుదల చేయనున్నారని, ఆ సినిమా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నకి సపోర్ట్‌గా ఉంటుందని వినిపిస్తున్న మాటల్లో వాస్తవం లేదు. ఎందుకంటే సినిమా వల్ల ఓట్లు వస్తాయనుకోవడం అపోహ మాత్రమే. అలా అనుకుంటే ఇతర పార్టీల వారు కూడా నాలుగైదు సినిమాలు తీసుకోవచ్చు కదా? ఓటర్లందరూ నా 'యాత్ర' సినిమాని చూసుంటే 'బాహుబలి'లా పెద్ద సినిమా అయ్యేది. ఓటర్లందరూ సినిమాలు చూస్తారని అనుకోవడం లేదు.

జగన్ అన్న పాదయాత్రతో...

'యాత్ర 2' సినిమా జగన్ అన్న పాదయాత్ర నుంచి మొదలై ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే వరకూ ఉంటుంది. కథ మొత్తం పూర్తయ్యాక ఆ వివరాలు చెబుతాను. ప్రస్తుతం నేను దర్శకత్వం వహించిన 'సిద్ధా లోకం ఎలా ఉంది నాయనా?' అనే సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే 'సైతాన్' అనే కొత్త వెబ్ సిరీస్‌తో జూన్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను.

రంగుల ప్రపంచం

క్రాంతి హీరోగా, శ్రీలు హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రం 'కొత్త రంగుల ప్రపంచం'. నటుడు థర్టీ ఇయర్స్ పృథ్వీ ఈ సినిమాతో తొలిసారి మెగాఫోన్ పట్టారు. గుంటక శ్రీనివాస్ రెడ్డి, కె.కృష్ణారెడ్డి, పద్మ రేఖ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను నటుడు, నిర్మాత నాగబాబు విడుదల చేశారు. ''కొత్త రంగుల ప్రపంచం' వంటి మంచి కథలో నటించే అవకాశం కల్పించిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు క్రాంతి. ''మా నాన్న(పృథ్వీ) దర్శకత్వం వహించిన తొలి సినిమాతో నేను హీరోయిన్‌గా పరిచయమవడం సంతోషంగా ఉంది''అన్నారు శ్రీలు. ఈ కార్యక్రమంలో నటుడు సుమన్, చిత్రయూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



● క్రాంతి, శ్రీలు

మాడ్రిడ్ ఓపెన్ విజేత సబలెంకా



మహిళల టెన్నిస్ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)ను ఓడించి బెలారస్ స్టార్ సబలెంకా మాడ్రిడ్ ఓపెన్ డబ్ల్యూటీఏ ప్రీమియర్ టోర్నీలో రెండోసారి చాంపియన్‌గా నిలిచింది. 2021లో ఈ టైటిల్‌ను నెగ్గిన రెండో ర్యాంకర్ సబలెంకా ఈ ఏడాది ఫైనల్లో 6–3, 3–6, 6–3తో స్వియాటెక్‌పై గెలిచింది. సబలెంకా కెరీర్‌లో ఇది 12వ సింగిల్స్ టైటిల్. విజేతగా నిలిచిన సబలెంకాకు 11,05,265 యూరోల (రూ. 10 కోట్ల 12 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి.

అర్జున్‌కు రెండో విజయం



టెపి సెగెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్ మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ రెండో విజయం సాధించాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌తో ఆదివారం స్వీడన్‌లో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో అర్జున్ 38 ఎత్తుల్లో గెలుపొందాడు. నాలుగు రౌండ్ల తర్వాత అర్జున్ రెండు పాయింట్లతో ఐదో స్థానంలో, గుకేశ్ 2.5 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో ఉన్నారు.

గుజరాత్ పరుగుల ప్రవాహం



- 56 పరుగులతో లక్నోపై విజయం
- చెలరేగిన గిల్, సాహా

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ తమ జోరు కొనసాగిస్తోంది. అద్భుత బ్యాటింగ్‌తో భారీ విజయం సాధించిన జట్టు ప్లేఆఫ్స్ దశకు చేరువైంది. ఆదివారం జరిగిన పోరులో గుజరాత్ 56 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (51 బంతుల్లో 94 నాటౌట్; 2 ఫోర్లు, 7 సిక్స్‌లు), వృద్ధిమాన్ సాహా (43 బంతుల్లో 81; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 74 బంతుల్లోనే 142 పరుగులు జోడించడం విశేషం. అనంతరం కృనాల్ పాండ్యా సారథ్యంలోని లక్నో 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 171 పరుగులకే పరిమితమైంది. డి కాక్ (41 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), కైల్ మేయర్స్ (32 బంతుల్లో 48; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. సాహా, గిల్ చెలరేగడంతో గుజరాత్ వేగంగా దూసుకుపోయింది. మొహసిన్ ఓవర్లో సాహా 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో చెలరేగడంతో పవర్‌ప్లేలో స్కోరు 78 పరుగులకు చేరింది. సాహా 20 బంతుల్లో, గిల్ 29 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. లక్నో ఎట్టకేలకు 12వ ఓవర్లో తొలి వికెట్ భాగస్వామ్యాన్ని విడదీయగలిగినా... గిల్‌తో పాటు కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 25; 1 ఫోర్, 2 సిక్స్‌లు), మిల్లర్ (12 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) అదే జోరు కొనసాగించి స్కోరును 200 దాటించారు. ఛేదనలో మేయర్స్, ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన డికాక్ కూడా ప్రత్యర్థి తరహాలోనే పోటీ పడి పరుగులు సాధిస్తూ ఘనమైన ఆరంభాన్నందించారు. వీరిద్దరి జోరు చూస్తే హోరాహోరీ పోరు తప్పదనిపించింది. అయితే 9వ ఓవర్లో తొలి వికెట్‌గా మేయర్స్ వెనుదిరగ్గా...ఆ తర్వాత లక్నో పరిస్థితి అంతా ఒక్కసారిగా తలకిందులైంది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	0.951
చెన్నై	11	6	4	1	13	0.409
లక్నో	11	5	5	1	11	0.294
రాజస్తాన్	11	5	6	0	10	0.388
బెంగళూరు	10	5	5	0	10	-0.209
ముంబై	10	5	5	0	10	-0.454
పంజాబ్	10	5	5	0	10	-0.472
కోల్‌కతా	10	4	6	0	8	-0.103
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	10	4	6	0	8	-0.529

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



మైక్ హస్సీ, డేవిడ్ హస్సీ తర్వాత ఒక టి20 మ్యాచ్‌లో కెప్టెన్ హోదాలో అన్నదమ్ములు (కృనాల్, హార్దిక్ పాండ్యా) ప్రత్యర్థులుగా తలపడటం ఇది రెండోసారి మాత్రమే.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: వృద్ధిమాన్ సాహా (సి) (సబ్) ప్రేరక్ మన్కడ్ (బి) అవేశ్ ఖాన్ 81; శుబ్‌మన్ గిల్ (నాటౌట్) 94; హార్దిక్ పాండ్యా (సి) కృనాల్ పాండ్యా (బి) మొహసిన్ 25; మిల్లర్ (నాటౌట్) 21; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు)** 227. **వికెట్ల పతనం:** 1–142, 2–184. **బౌలింగ్:** మొహసిన్ 3–0–42–1, అవేశ్ ఖాన్ 4–0–34–1, కృనాల్ పాండ్యా 4–0–38–0, యశ్ ఠాకూర్ 4–0–48–0, రవి బిష్ణోయ్ 2–0–21–0, మేయర్స్ 1–0–16–0, స్వప్నిల్ 1–0–7–0, స్టొయినిస్ 1–0–20–0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) రషీద్ ఖాన్ (బి) మోహిత్ శర్మ 48; డికాక్ (బి) రషీద్ 70; దీపక్ హుడా (సి) రాహుల్ తెవాటియా (బి) షమీ 11; స్టొయినిస్ (సి) షమీ (బి) మోహిత్ శర్మ 4; నికోలస్ పూరన్ (సి) షమీ (బి) నూర్ అహ్మద్ 3; ఆయుశ్ బదోని (సి) నూర్ (బి) మోహిత్ శర్మ 21; స్వప్నిల్ (నాటౌట్) 2; కృనాల్ పాండ్యా (సి) మిల్లర్ (బి) మోహిత్ శర్మ 0; బిష్ణోయ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు)** 171. **వికెట్ల పతనం:** 1–88, 2–114, 3–130, 4–140, 5–153, 6–166, 7–166. **బౌలింగ్:** షమీ 4–0–37–1, హార్దిక్ పాండ్యా 3–0–37–0, రషీద్ ఖాన్ 4–0–34–1, నూర్ అహ్మద్ 4–0–26–1, మోహిత్ శర్మ 4–0–29–4, జోసెఫ్ 1–0–5–0.

సూపర్ రైజర్స్

- చివరి బంతికి అద్భుత విజయం
- 215 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన హైదరాబాద్
- మలుపు తిప్పిన ఫిలిప్స్
- 4 వికెట్లతో రాజస్తాన్ ఓటమి





జైపూర్: లక్ష్యం 215 పరుగులు... 17 ఓవర్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ స్కోరు 171 పరుగులు. గెలవాలంటే చివరి 3 ఓవర్లలో 44 పరుగులు కావాలి. అయితే 18వ ఓవర్లో కీలక బ్యాటర్లు రాహుల్ త్రిపాఠి, మార్క్‌రమ్‌లను చహల్ అవుట్ చేయడంతో రాజస్తాన్ రాయల్స్ పైచేయి సాధించింది. కానీ కుల్దీప్ యాదవ్ వేసిన తర్వాతి ఓవర్లో తొలి నాలుగు బంతులను 6, 6, 6, 4గా మలచి గ్లెన్ ఫిలిప్స్ మ్యాచ్‌ను మళ్లీ రైజర్స్ చేతుల్లోకి తెచ్చాడు. ఐదో బంతికి అతను అవుట్ కాగా, ఆఖరి ఓవర్లో సమీకరణం 17 పరుగులుగా మారింది. సందీప్ శర్మ వేసిన ఈ ఓవర్లో తొలి 5 బంతుల్లో 12 పరుగులు వచ్చాయి. చివరి బంతికి అబ్దుల్ సమద్‌ను అవుట్ చేసి సందీప్ శర్మ సంబరాలు చేసుకున్నాడు. అయితే అది నోబాల్‌గా తేలింది. సన్‌రైజర్స్ విజయానికి ఫోర్ అవసరం కాగా, సందీప్ మళ్లీ వేసిన ఆఖరి బంతిని సమద్ సిక్సర్‌గా మలిచాడు! దాంతో సన్‌రైజర్స్ శిబిరం సంబరాల్లో మునిగిపోగా, జైపూర్ స్టేడియం మూగబోయింది. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ 4 వికెట్ల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్తాన్ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. జోస్ బట్లర్ (59 బంతుల్లో 95; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా, కెప్టెన్ సంజు సామ్సన్ (38 బంతుల్లో 66 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 81 బంతుల్లోనే 138 పరుగులు జోడించడం విశేషం. అనంతరం హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 217 పరుగులు సాధించింది. అభిషేక్ శర్మ (34 బంతుల్లో 55; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ త్రిపాఠి (29 బంతుల్లో 47; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆఖర్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (7 బంతుల్లో 25; 1 ఫోర్, 3 సిక్స్‌లు), సమద్ (7 బంతుల్లో 17 నాటౌట్; 2 సిక్స్‌లు) మెరుపులు జట్టును గెలిపించాయి. కీలక క్యాచ్‌లు వదిలేసి, సునాయాస రనౌట్ అవకాశం చేజార్చుకొని రాజస్తాన్ తగిన మూల్యం చెల్లించుకుంది.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) నటరాజన్ (బి) జాన్సెన్ 35; బట్లర్ (ఎల్బీ) (బి) భువనేశ్వర్ 95; సామ్సన్ (నాటౌట్) 66; హెట్‌మైర్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు)** 214. **వికెట్ల పతనం:** 1–54, 2–192. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–44–1, జాన్సెన్ 4–0–44–1, నటరాజన్ 4–0–36–0, మార్కండే 4–0–51–0, అభిషేక్ 2–0–15–0, వివ్రాంత్ 2–0–18–0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అన్‌మోల్‌ప్రీత్ (సి) హెట్‌మైర్ (బి) చహల్ 33; అభిషేక్ (సి) చహల్ (బి) ఆర్.అశ్విన్ 55; త్రిపాఠి (సి) యశస్వి (బి) చహల్ 47; క్లాసెన్ (సి) బట్లర్ (బి) చహల్ 26; మార్క్‌రమ్ (ఎల్బీ) (బి) చహల్ 6; ఫిలిప్స్ (సి) హెట్‌మైర్ (బి) కుల్దీప్ 25; సమద్ (నాటౌట్) 17; జాన్సెన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 217. **వికెట్ల పతనం:** 1–51, 2–116, 3–157, 4–171, 5–174, 6–196. **బౌలింగ్:** సందీప్ శర్మ 4–0–48–0, కుల్దీప్ యాదవ్ 4–0–50–1, ఆర్. అశ్విన్ 4–0–35–1, చహల్ 4–0–29–4, మురుగన్ అశ్విన్ 3–0–42–0, మెకాయ్ 1–0–13–0.

క్వార్టర్స్‌లో హుసాముద్దీన్



తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ (57 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ 5–0తో సావిన్ ఎడువార్డ్ (రష్యా)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన దీపక్ (51 కేజీలు) సంచలన విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. రెండో రౌండ్‌లో దీపక్ 5–2తో 2021 ప్రపంచ చాంపియన్ బిబోసినోవ్ (కజకిస్తాన్)ను బోల్తా కొట్టించాడు. 75 కేజీల విభాగం రెండో రౌండ్‌లో సుమిత్ కుందు 1–3తో సోసులిన్ పావెల్ (రష్యా) చేతిలో... ప్లస్ 92 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో నరేందర్ 0–5తో అర్జోలా అలెజాంద్రో (క్యూబా) చేతిలో ఓడిపోయారు.

రజతం నెగ్గిన జెరెమి



జిన్‌జూ (దక్షిణ కొరియా): ఆసియా సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో రెండో పతకం చేరింది. పురుషుల 67 కేజీల విభాగంలో జెరెమి లాల్‌రినుంగా స్నాచ్ ఈవెంట్‌లో 141 కేజీలు బరువెత్తి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నాడు. అయితే మిజోరం రాష్ట్రానికి చెందిన 20 ఏళ్ల జెరెమి క్లీన్ అండ్ జెర్క్ ఈవెంట్‌లో తడబడి మొత్తం బరువును నమోదు చేయడంలో విఫలమయ్యాడు. మూడు క్లీన్ అండ్ జెర్క్ అవకాశాల్లోనూ జెరెమి నిర్ధారిత బరువును ఎత్తలేకపోయాడు. శనివారం జరిగిన మహిళల 55 కేజీల విభాగంలో బింద్యారాణి భారత్‌కు రజత పతకం అందించిన సంగతి తెలిసిందే.

ఆసియా క్రీడలకు భారత బ్యాడ్మింటన్ జట్ల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లలో చైనాలో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత బ్యాడ్మింటన్ జట్లను ప్రకటించారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్–20లో ఉన్న వారిని నేరుగా ఎంపిక చేయగా... మిగతా బెర్త్‌లను ఆదివారం ముగిసిన సెలక్షన్ ట్రయల్స్ టోర్నీ ద్వారా ఖరారు చేశారు. **భారత పురుషుల జట్టు:** ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్య సేన్, మిథున్ మంజునాథ్, సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిల–ఎంఆర్ అర్జున్, రోహన్ కపూర్, సాయిప్రతీక్. **మహిళల జట్టు:** పీవీ సింధు, అష్మిత, అనుపమ, మాళవిక, గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టో, సిక్కి రెడ్డి.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ, గుంటూరులో 46 పోస్టులు

గుంటూరులోని లామ్‌లో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ సీఏఎస్ స్కీమ్‌లో భాగంగా తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 46
» పోస్టుల వివరాలు: ఫీల్డ్ సూపర్‌వైజర్-05, స్టాటిస్టిషియన్-01, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ -34, కంప్యూటర్ స్టాఫ్-03, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్-03.
» అర్హత: పోస్టులను అనుసరించి డిగ్రీ,బీసీఏ, బీఈ, బీటెక్, ఎంఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: కంప్యూటర్ స్టాఫ్/జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించకూడదు. ఇతర పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: andhrapradeshcss@gmail.com
» దరఖాస్తులకు చివరితేది: 10.05.2023.
» వెబ్‌సైట్: www.angrau.ac.in

ఇండియన్ నేవీలో 227 ఎస్ఎస్‌సీ ఆఫీసర్ పోస్టులు


కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవీ ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2024, జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 227
» పోస్టులు: జనరల్ సర్వీస్–50, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్–10, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్–20, పైలట్–25, లాజిస్టిక్స్–30, నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్–15, ఎడ్యుకేషన్ –12, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)–20, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)–60.
» అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీఏ,ఎంసీఏ,పీజీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100, ఇతర అలవెన్సులు.
» ఎంపిక విధానం: విద్యార్హతలతో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 14.05.2023.
» వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

ఇలా చేస్తే.. టాప్ ర్యాంక్ ఖాయం

ఇంజనీరింగ్.. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం! ఇందుకోసం ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులు అధిక శాతం మంది ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా తెలంగాణలో టీఎస్ ఎంసెట్, ఆంధ్రప్రదేశ్‌లో ఈఏపీసెట్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల సంఖ్య భారీగా ఉంటోంది. అలాగే ఇంటర్మీడియెట్ బైపీసీ విద్యార్థులు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో చేరేందుకు వీలుగా ఈ ఎంట్రెన్స్‌లు రాస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో త్వరలో ఈ ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. బెస్ట్ ర్యాంకుకు నిపుణుల సలహాలు...

» మే 15 నుంచి ఏపీ ఈఏపీసెట్; మే 10 నుంచి టీఎస్ ఎంసెట్
» ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, అనుబంధ కోర్సుల్లో ప్రవేశం
» తెలంగాణలో బీఎస్సీ (నర్సింగ్)కు కూడా ఎంసెట్ ర్యాంకే ఆధారం
» కాన్సెప్ట్‌లపై పట్టుతోనే బెస్ట్ ర్యాంకు అంటున్న నిపుణులు



ఇంటర్మీడియెట్ (ఎంపీసీ/బైపీసీ) అర్హతగా బీటెక్, అగ్రికల్చర్ అనుబంధ కోర్సులు, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్, అగ్రిలకల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీసెట్)గా; తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎంసెట్)గా ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

జేఈఈకి పోటీ పడుతున్న విద్యార్థులు సైతం ఈఏపీసెట్, ఎంసెట్‌లకు సన్నద్ధమవుతుంటారు. దీంతో పోటీ కూడా తీవ్రంగానే ఉంటోంది. పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే మంచి ర్యాంకు సొంతం చేసుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

ఏపీలో కోర్సులు ఇవే

- ఏపీలో ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో..ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బీటెక్ (డైరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్),బీటెక్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో.. బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ, బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్సెస్ కోర్సులు ఉన్నాయి.
- ఫార్మసీ విభాగంలో.. బీ-ఫార్మసీ, ఫార్మ్-డి కోర్సులున్నాయి.

తెలంగాణలో కోర్సులు

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో.. బీఈ/బీటెక్, బీటెక్ బయో టెక్నాలజీ, బీటెక్(డైరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నారు.
- అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్‌లో.. బీఎస్సీ అగ్రికల్చర్(ఆనర్స్), బీఎస్సీ హార్టికల్చర్ (ఆనర్స్), బీఎస్సీ ఫారెస్ట్రీ, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, ఫార్మ్ డి కోర్సులున్నాయి.
- తెలంగాణలో ఈ ఏడాది నుంచి బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఎంసెట్‌లో అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్ ర్యాంకును పరిగణనలోకి తీసుకోనున్నారు.
- ఫార్మసీ కోర్సులకు సంబంధించి 50 శాతం సీట్లను ఇంజనీరింగ్ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా, మరో 50 శాతం సీట్లను ఫార్మసీ/మెడిసిన్ స్ట్రీమ్ ర్యాంకుతో భర్తీ చేస్తారు.

పరీక్ష సిలబస్

ఈ ఏడాది ఈఏపీసెట్, ఎంసెట్‌కు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సిలబస్‌లో 70 శాతం సిలబస్‌నే ఎంట్రన్స్ సిలబస్‌గా పేర్కొన్నారు. 2021-22లో మొదటి సంవత్సరం విద్యార్థులకు కోవిడ్ కారణంగా 30 శాతం సిలబస్‌ను తగ్గించిన విషయం తెలిసిందే. దానికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు.

మొత్తం 160 మార్కులకు పరీక్ష

- ఏపీ ఈఏపీసెట్, టీఎస్ ఎంసెట్.. ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మసీ స్ట్రీమ్‌లకు వేర్వేరుగా.. మొత్తం 160 మార్కులకు నిర్వహించనున్నారు.
- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో.. మ్యాథమెటిక్స్ నుంచి 80; ఫిజిక్స్ నుంచి 40; కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే జరుగుతుంది.
- అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్‌లో..బయాలజీ(బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు.

ప్రిపరేషన్ ఇలా

మ్యాథమెటిక్స్‌కు 50 శాతం వెయిటేజీ

ఇంజనీరింగ్ స్ట్రీమ్ ఎంట్రన్స్‌లో 50 శాతం వెయిటేజీ ఉన్న సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్. కాబట్టి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తొలుత ప్రాథమిక సూత్రాలపై పట్టుసాధించాలి. త్రికోణమితిలో సూత్రాలు ఎక్కువగా ఉంటాయి. వాటిని గుర్తుపెట్టుకొని సరైన చోట అన్వయించగలిగేలా ప్రిపరేషన్ సాగించాలి. దీంతోపాటు విద్యార్థులు వేగం, కచ్చితత్వంపై దృష్టి సారించాలి.

ముఖ్య చాప్టర్లు: ఇంటర్ మ్యాథ్స్ సిలబస్‌ను ఆల్‌జీబ్రా, కాల్కులస్, జామెట్రీ, వెక్టార్ ఆల్‌జీబ్రా, ట్రిగనోమెట్రీగా విభజించొచ్చు. విద్యార్థులు బోర్డు పరీక్షల కోణంలో లిమిట్స్ అండ్ కమ్యూనిటీ, డిఫరెన్షియేషన్, అప్లికేషన్స్ ఆఫ్ డెరివేటివ్స్, ఇంటిగ్రేషన్స్, డెఫినెట్ ఇంటిగ్రల్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్‌పై దృష్టిపెట్టి ఉంటారు. జామెట్రీలో 2డీ, 3డీ జ్యామెట్రీ, లోకస్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ యాక్సెస్, స్ట్రైట్ లైన్స్, సర్కిల్, సిస్టమ్ ఆఫ్ సర్కిల్స్, పారాబోలా, ఎల్లిప్స్, డైరక్షన్ కొసైన్స్, డైరక్షన్ రేషియోస్, ప్లేన్ తదితరాలు కీలక అంశాలుగా ఉంటాయి. అదే విధంగా ఆల్‌జీబ్రాలో ఫంక్షన్లు, మ్యాథమెటికల్ ఇండక్షన్, మ్యాట్రిసెస్, కాంప్లెక్స్ నంబర్స్, డిమోవియర్స్ థీరమ్, క్వాడ్రాటిక్ ఎక్స్‌ప్రెషన్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్ తదితరాలపై ఫోకస్ పెట్టాలి. ట్రిగనోమెట్రిలో ట్రిగనోమెట్రి రేషియోస్ అప్‌టు ట్రాన్స్‌ఫర్మేషన్స్, ట్రిగనోమెట్రిక్ ఈక్వేషన్స్, ఇన్వెర్స్ ట్రిగనోమెట్రిక్ ఫంక్షన్స్, హైపర్‌బోలిక్ ఫంక్షన్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్ టాపిక్స్‌ను సమగ్రంగా ప్రిపేర్ కావాలి. వెక్టర్ ఆల్‌జీబ్రా నుంచి ఐదు లేదా ఆరు ప్రశ్నలు వస్తున్నాయి. అడిషన్ ఆఫ్ వెక్టర్స్, ప్రొడక్ట్ ఆఫ్ వెక్టర్స్, మెజర్స్ ఆఫ్ డిస్పెర్షన్ అండ్ ప్రాబబిలిటీలో.. మెజర్స్ ఆఫ్ డిప్రెషన్, ప్రాబబిలిటీ, ర్యాండమ్ వేరియబుల్స్, ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్స్‌పై పట్టు సాధించాలి.

–ఎం.ఎస్.రావు, సబ్జెక్ట్ నిపుణులు

ఫిజిక్స్‌పై పట్టు కీలకం

ఈ విభాగంలో కొంచెం ఎక్కువ వెయిటేజీ ఉన్న అంశం.. హీట్ అండ్ థర్మోడైనమిక్స్. ఈ చాప్టర్ నుంచి దాదాపు పది ప్రశ్నలు అడిగే అవకాశముంది. దీని తర్వాత వర్క్ ఎనర్జీ పవర్, సిస్టమ్ ఆఫ్ పార్టికల్స్ అండ్ రొటేషనల్ మోషన్, లాస్ ఆఫ్ మోషన్, మోషన్ ఇన్ ఎ ప్లేన్, మూవింగ్ చార్జెస్ అండ్ మ్యాగ్నటిజం చాప్టర్ల నుంచి ఐదు లేదా ఆరు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. గ్రావిటేషన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆసిలేషన్స్, వేవ్స్, ఎలక్ట్రోస్టాటిక్ పొటెన్షియల్ అండ్ కెపాసిటెన్స్‌పై నాలుగు ప్రశ్నల చొప్పున అడిగే అవకాశం ఉంది. వీటి తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఇండక్షన్, రే ఆప్టిక్స్, ఆల్టర్నేటింగ్ కరెంట్, వేవ్ ఆప్టిక్స్, మోషన్ ఇన్ ఎ స్ట్రైట్ లైన్, మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్, ఎలక్ట్రిక్ చార్జెస్ అండ్ ఫీల్డ్స్, డ్యూయెల్ నేచర్ ఆఫ్ రేడియేషన్ అండ్ మేటర్, న్యూక్లియై, సెమికండక్టర్ ఎలక్ట్రానిక్స్‌పై దృష్టిపెట్టాలి. పరీక్షలో అత్యధిక వెయిటేజీ ఉంటున్న మెకానిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆ తర్వాత ఎలక్ట్రిసిటీ, మోడ్రన్ ఫిజిక్స్ పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

–రవీంద్ర, సబ్జెక్ట్ నిపుణులు

కెమిస్ట్రీ కొంత సులభమే

విద్యార్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఫిజికల్ కెమిస్ట్రీలో.. సొల్యూషన్స్ చాప్టర్ నుంచి ప్రధానంగా ప్రాబ్లమ్ బేస్డ్ ప్రశ్నలు అడుగుతున్నారు. దీంతోపాటు రౌల్ట్స్ లా, ఐడియల్, నాన్ ఐడియల్ సొల్యూషన్స్, సొల్యుబిలిటీ, మొలారిటీ, మొలాలిటీ, వేపర్ ప్రెజర్ ఆఫ్ లిక్విడ్ సొల్యూషన్స్ తదితరాలపై దృష్టిపెట్టాలి. సాలిడ్‌స్టేట్‌లో క్లాసిఫికేషన్ ఆఫ్ క్రిస్టలైన్ సాలిడ్స్, ఎక్స్‌రే క్రిస్టలోగ్రఫీ, బ్యాండ్ థియరీ ఆఫ్ మెటల్స్, మ్యాగ్నెటిక్ ప్రాపర్టీస్, ఎలక్ట్రోకెమిస్ట్రీ చాప్టర్‌లో నెర్న్స్ ఈక్వేషన్‌పై ప్రాబ్లమ్ బేస్డ్ ప్రశ్నలు, ఎలక్ట్రాలసిస్ రిలేటెడ్ ప్రాబ్లమ్స్‌పై ఫోకస్ పెట్టాలి. గ్రూప్ మూలకాలు, బాయిలింగ్, మెల్టింగ్ పాయింట్లు, ఎలక్ట్రోపాజిటివిటీ, ఎలక్ట్రోనెగిటివిటీ, ఫస్ట్ ఆర్డర్ రియాక్షన్, టైప్స్ ఆఫ్ ఎలిమెంట్స్, స్టాండర్డ్ రిడక్షన్, పొటెన్షియల్ వాల్యూమ్ టాపిక్స్‌పై దృష్టిపెట్టాలి. బోరాక్స్, డైబోరేన్ స్ట్రక్చర్, ప్రిపరేషన్, ప్రాపర్టీస్, డైమండ్, గ్రాఫైట్ స్ట్రక్చర్లు, సిలికాన్ల గురించి క్షుణ్నంగా చదవాలి. వీటితోపాటు డి, ఎఫ్–బ్లాక్ ఎలిమెంట్లు, స్టాండర్డ్ రిడక్షన్ పొటెన్షియల్ వాల్యూ, వెర్నర్ థియరీ తదితరాలపై ఫోకస్ పెట్టాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీని జనరల్, హైడ్రోకార్బన్లు, హాలో కాంపౌండ్లుగా విభజించుకొని చదవాలి. ఇందులో హైడ్రోకార్బన్లు, ఆల్కేన్లు, ఆల్కైన్లు, హోమోజినైజేషన్, రియాక్షన్ విత్ బేయర్స్ రియేజెంట్, హాలోజన్, ఎస్ఎల్ మెకానిజమ్స్, యాసిడ్ స్ట్రెంత్ ఆఫ్ ఫీనాల్స్, కార్బాక్సిలిక్ యాసిడ్స్, అమైన్స్‌పై దృష్టిపెట్టాలి. కెమిస్ట్రీని ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలుగా విభజించుకొని చదవాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి దానిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

–విజయ్ కిశోర్, సబ్జెక్ట్ నిపుణులు

బోటనీ

డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్(మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రోబయాలజీ (బ్యాక్టీరియా, వైరస్), జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయో టెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

–బి.రాజేంద్ర, సబ్జెక్ట్ నిపుణులు

జువాలజీ

డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటొజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనేటా అమెరికానా, ఎకోలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీ అంశాలపై దృష్టి పెట్టాలి.

–కె.శ్రీనివాసులు, సబ్జెక్ట్ నిపుణులు

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తూ

- ఎంసెట్, ఈఏపీసెట్‌లకు ప్రిపరేషన్ సాగించే క్రమంలో విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు దానికి సంబంధించిన సూత్రాలపై అవగాహనతో అడుగులు వేయాలి.
- ఒక కాన్సెప్ట్‌కు చెందిన ప్రశ్నను భిన్న కోణాల్లో సాధించేందుకు కృషి చేయాలి.
- ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్‌కు ప్రిపరేషన్ సమయం కేటాయించాలి.
- విద్యార్థులు ప్రతి చాప్టర్‌లోని సినాప్సిస్‌పై పట్టు సాధించాలి.

ఏపీ ఈఏపీసెట్-2023 ముఖ్య తేదీలు

- ఈఏపీ–సెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష తేదీలు: మే 15 నుంచి మే 19 వరకు;
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్ష తేదీలు: మే 22, 23
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in

టీఎస్ ఎంసెట్ 2023-ముఖ్య సమాచారం

- టీఎస్ ఎంసెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష తేదీలు: మే 12, 13, 14
- అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్ పరీక్ష తేదీలు: మే 10, 11 తేదీల్లో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://eamcet.tsche.ac.in/

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	695	61,054
నిఫ్టీ ▽	187	18,069

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,235	△	269
డోజోన్స్	33,674	△	547
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,778	△	76
డాక్స్	15,961	△	227
షాంఘై	3,334	▽	16
నికాయ్ (మంగళవారం ముగింపు)	29,158	△	35

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

రాబడులు చూసి మోసపోవద్దు!



- పెట్టుబడి చేసిన వెంటనే రాబడి ఆశించొద్దు
- ఫలితాలను ఇచ్చే వరకు ఓపిక పట్టాలి
- పనితీరుకు బెంచ్ మార్క్ కీలకం
- ఏడాది, రెండేళ్ల రాబడులను చూడొద్దు
- ఈక్విటీలు ఐదేళ్లకు మించిన కాలానికే
- రాబడులు, రిస్క్ ఆధారంగా పెట్టుబడులు
- అప్పుడే ఆశించిన మేర ఫలితాలు

మ్యూచువల్ ఫండ్స్ పనితీరుపై ఏటా సంవత్సరం ఆరంభంలో పలు సంస్థలు విశ్లేషణా నివేదికలను ప్రకటిస్తుంటాయి. మంచి రాబడులు ఇచ్చినవి, బలహీన, చెత్త పనితీరు చూపించిన వివిధ విభాగాల్లోని మ్యూచువల్ ఫండ్స్‌పై ఇన్వెస్టర్లకు సమగ్ర సమాచారాన్ని అందిస్తుంటాయి. నిజానికి ఈ సమాచారం ఇన్వెస్టర్లు ఫోమో (మంచి పనితీరు చూపించే వాటిని కోల్పోతామనే వెర్రి) బారిన పడేందుకు దారి తీసే ప్రమాదం లేకపోలేదు. వివిధ విభాగాల్లో మంచి పనితీరు చూపించిన టాప్ మ్యూచువల్ ఫండ్స్ సమాచారం చూసినప్పుడు.. ఇన్వెస్టర్లలో తమ పోర్ట్‌ఫోలియోలోని బలహీన రాబడులు ఇచ్చిన పథకాలపై సమీక్ష మొదలవుతుంది. 2020 మార్చి కనిష్టాల నుంచి చూసినప్పుడు 200 శాతానికి పైగా రాబడులు ఇచ్చిన పథకాలను గుర్తించొచ్చు. అటువంటప్పుడు ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలో కేవలం 20-40 శాతం రాబడులనే ఇచ్చిన పథకాలను చూస్తే అసహనానికి గురికావచ్చు. ఇది ఆకర్షణీయమైన పథకంలోకి పెట్టుబడులను మళ్లించేలా ప్రేరణ కల్పించొచ్చు. తక్కువ రాబడులు ఇచ్చిన పథకాలు లేదా స్టాక్స్ నుంచి మీ పెట్టుబడులను వెనక్కి తీసేసుకుని, గడిచిన ఏడాది, రెండేళ్లుగా మంచి రాబడులతో దూసుకుపోతున్న పథకాలు లేదా స్టాక్స్ వెంట పడడం ఫోమోనే అవుతుంది. ఇలా ఒక పథకం లేదా స్టాక్స్‌లో పెట్టుబడులను విక్రయించే ముందు ఇన్వెస్టర్లు కేవలం రాబడులనే ప్రామాణికంగా తీసుకోకూడదు. పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే ముందు పరిగణనలోకి తీసుకోవాల్సిన కీలక అంశాలను వివరించే కథనం ఇది...

పెట్టుబడులను తరచూ మదింపు వేయడం మంచి విధానం కాదు. పెట్టుబడి పెట్టిన తర్వాత కొన్ని నష్టాలు చూడొచ్చు. కొన్ని వెంటనే లాభాల క్రమంలో నడవొచ్చు. ఇలా నష్టాలు చూపిస్తున్నవి సరైన ఎంపిక కాదని భావించి వాటిని విక్రయించి చేసి, లాభాలు చూపిస్తున్న వాటిల్లోకి పెట్టుబడులు మళ్లించే ఇన్వెస్టర్లు చాలా మందే ఉంటారు. కొన్ని సందర్భాల్లో ఇలా చేయడం వల్ల స్వల్పకాలంలో మంచి లాభాలను కళ్లజూస్తారు. కానీ ఆచరణలో ఇలా తరచుగా (ఏడాది, రెండేళ్లలోపు) చేయడం అది అంతిమంగా నష్టాలకు దారితీయవచ్చు. అప్పటి వరకు నష్టాలు చూపించిన వాటిని వదిలించుకుని, లాభాలు కురిపిస్తున్న వాటిల్లోకి ప్రవేశించడం వల్ల ఒక రిస్క్ ఉంది. ఒక ఫండ్ లేదా స్టాక్ అనేది ఎన్నో పరిణామాల ప్రభావంతో మార్కెట్లో ఆటుపోట్ల మధ్య ప్రయాణం చేస్తుంటుంది. కొంత కాలం ర్యాలీ చేయడం కొంత కాలం దిద్దుబాటుకు గురికావడం లేదంటే కొంత కాలం ఒక శ్రేణి పరిధిలో స్థిరీకరణ చెందడం సర్వ సాధారణం. ఒక ఒక వర్గం ఇన్వెస్టర్లు కొంత ర్యాలీ చేసిన ఫండ్స్ లేదా స్టాక్స్‌లో లాభాలను స్వీకరిస్తుంటారు. వీరు ఎక్కువ కాలం పాటు కొనసాగరు. వీరి చర్యతో ఆ ఫండ్ లేదా స్టాక్ అమ్మకాల ఒత్తిడితో అక్కడి నుంచి నష్టపోతుంది. అమ్మకాల ఒత్తిడి తగ్గిన తర్వాత స్థిరీకరణ చెందుతాయి. కొంత కాలం స్థిరీకరణ తర్వాత కనిష్ట స్థాయిల వద్ద వాటిల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ముందుకు రావడం వల్ల అవి తిరిగి ర్యాలీ బాట పడతాయి.



ర్యాలీ చేస్తున్నాయని చెప్పి పెట్టుబడులు అన్నింటినీ తీసుకెళ్లి బుల్లిష్ మూమెంటమ్ ఉన్న వాటిల్లో పెట్టేశారనుకోండి. ఆ తర్వాత అవి కరెక్షన్‌కు లోనైతే అప్పుడు అవి కూడా నష్టాలను చూపిస్తాయి. నష్టాలకు ఓర్చుకోని తత్వం వల్ల ఇన్వెస్టర్లు వాటిని కూడా విక్రయించేందుకు మొగ్గు చూపొచ్చు. ఇలా విక్రయించిన మ్యూచువల్ ఫండ్స్ లేదా స్టాక్స్ ఆ తర్వాత ఏదో ఒక సందర్భంలో తిరిగి ర్యాలీ చేయడం మొదులు పెడతాయి. అందుకని లాభాలనే ప్రామాణికంగా తీసుకుని తరచూ పోర్ట్‌ఫోలియోలో మార్పులు, చేర్పులు చేయకూడదు. దీన్ని ప్రణాళిక లేని పెట్టుబడిగా పేర్కొంటారు. మరో రకం ఇన్వెస్టర్లు కొంత లాభానికే (షార్ట్ టర్మ్ ఇన్వెస్టర్లు) విక్రయాలు చేస్తుంటారు. దీనివల్ల లాభంపై 15 శాతం మూలధన లాభాల పన్ను చెల్లించాలన్న విషయాన్ని వారు మర్చిపోతుంటారు. పెట్టుబడులు ఎప్పుడూ కూడా నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి. పైగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ లేదా స్టాక్స్ అనేవి ఐదేళ్లు అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసమే ఎంపిక చేసుకోవాలని నిపుణులు తరచూ సూచిస్తుంటారు. దీర్ఘకాలం కోసం ఎంపిక చేసుకున్నవి స్వల్పకాలంలో మార్కెట్లలో అస్థిరతల వల్ల నష్టాలను చూపించొచ్చు. అటువంటప్పుడు స్థిరత్వాన్ని ప్రదర్శించాలి. అంతేకానీ, తరచూ పోర్ట్‌ఫోలియోను గందరగోళంగా మార్చేయకూడదు. 2020 మార్చి నుంచి ఇలా మార్పులు చేసిన వారికి చేదు ఫలితాలు ఎదురయ్యాయి. చేసిన తప్పుకు మూల్యం కూడా చెల్లించాల్సి వచ్చింది.



ఉదాహరణకు యాక్సిస్ బ్లూచిప్ ఫండ్ 2021లో 21 శాతం రాబడులను ఇవ్వగా, 2022లో 6 శాతం నష్టాలను ఇచ్చింది. గడిచిన ఏడాది కాలంలో ఈ ఫండ్ ఎలాంటి రాబడులు ఇవ్వలేదు. కానీ, గత మూడేళ్లలో సగటున చూస్తే వార్షికంగా 15 శాతం రాబడులు ఇచ్చింది. అందుకే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులు వృద్ధి చెందడానికి తగినంత సమయం ఇవ్వాలి. నేడు పెట్టుబడులు పెట్టి రేపు లేదా వచ్చే నెల సమీక్షిస్తామంటే అది సరైన విధానం అనిపించుకోదు. అదే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వ్యాల్యూ డిస్కవరీ ఫండ్ 2020లో 22 శాతం రాబడులు ఇవ్వగా, 2021లో 37 శాతం, 2022లో 15 శాతం చొప్పున రాబడులు తెచ్చి పెట్టింది. హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీక్యాప్ పథకం పనితీరు బాగోలేదని చెప్పి 2021లో పెట్టుబడులు విక్రయించేసి ఉంటే, 2022లో విచారించాల్సి వచ్చేది. ఎందుకంటే 2022లో ఈ పథకం 17 శాతం రాబడులు తెచ్చి పెట్టింది. ఇలా ఒక్కో పథకం పనితీరు ఒక్కో మాదిరిగా ఉంటుంది. ప్రభుత్వరంగ సంస్థలు, ఇన్‌ఫ్రా కంపెనీలు 2020 వరకు ప్రతికూల రాబడులనే ఇచ్చాయి. కానీ, ఆ తర్వాత నుంచి ర్యాలీ చేస్తున్నాయి. గత పదేళ్లలో డైవర్సిఫైడ్ ఈక్విటీ విభాగంలో మంచి ఫండ్ ఏటా 21 శాతం కాంపౌండెడ్‌గా రాబడిని ఇవ్వగా, బలహీన పథకం ఏటా 11 శాతం రాబడిని తెచ్చి పెట్టింది. అంటే బలహీన పథకం కూడా దీర్ఘకాలంలో డెట్ సాధనాల కంటే మెరుగైన రాబడులు ఇచ్చినట్టు తెలుస్తోంది.

మినహాయింపులు...

బలహీన పనితీరు చూపించే మ్యూచువల్ ఫండ్స్ నుంచి పెట్టుబడులతో బయటకు రావాల్సిన సందర్భాలు కూడా ఉంటాయి. మీరు పెట్టుబడులు పెట్టడానికి ముందు ఆశించిన మేర రాబడులను మ్యూచువల్ ఫండ్ ఇవ్వడంలో విఫలమైతే (మూడేళ్లకు మించిన కాలంలో), లేదా బెంచ్ మార్క్ (సూచీ) పనితీరు కంటే మెరుగైన పనితీరు చూపించలేనప్పుడు ఆ పథకం నుంచి తప్పుకోవచ్చు. ఎందుకంటే బెంచ్‌మార్క్‌తో సమానంగా రాబడులు ఇచ్చే నిఫ్టీ 50, నిఫ్టీ నెక్ట్స్ 50, నిఫ్టీ 100 తదితర తక్కువ ఖర్చుతో వచ్చే ఇండెక్స్ పథకాలు నేడు ఎన్నో ఉన్నాయి. కనుక సూచీల కంటే తక్కువ రాబడులు ఇచ్చే పథకాల్లో కొనసాగాల్సిన అవసరం లేదు.





బెంచ్ మార్క్‌ను చూడాలి...

ఒక మ్యూచువల్ ఫండ్ రాబడులను సమీక్షించే సమయంలో, ఆయా మ్యూచువల్ ఫండ్ విభాగం అనుసరించే ప్రామాణిక సూచీ (బెంచ్‌మార్క్/ఇండెక్స్) పనితీరు ఎలా ఉందో గమనించాలి. బెంచ్‌మార్క్ కంటే తాను ఇన్వెస్ట్ చేసిన పథకం పనితీరు బాగోలేదా? అన్నది చూడాలి. ఆయా విభాగం వారీ సగటు రాబడులు అంత కచ్చితమైనవి కావు. ఒక పథకం అదే విభాగం సగటు రాబడులతో పోలిస్తే భిన్నమైన పనితీరు చూపించడానికి ఎన్నో కారణాలు ఉండొచ్చు. ఫండ్ మేనేజర్ పోటీ పథకాలతో పోలిస్తే తక్కువ రిస్క్ తీసుకోవచ్చు. లేదా మైక్రోకోర్యాప్ స్టాక్స్ లేదా మూమెంటమ్ బ్రేకవుట్ స్టాక్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఫండ్ మేనేజర్ నిర్ణయాలతో బుల్ మార్కెట్లో పరుగులు పెట్టిన ఫండ్స్.. మార్కెట్ కరెక్షన్లలో అంతే మేర నష్టపోతుంటాయి. ఒకవేళ మీరు ఇన్వెస్ట్ చేసిన మ్యూచువల్ ఫండ్ లార్జ్‌క్యాప్ కంపెనీలకు ఎక్కువ కేటాయింపులు చేసి, పోర్ట్‌ఫోలియో కాన్సంట్రేషన్ తక్కువగా ఉంటే (అధిక పెట్టుబడులు ఒకే చోట పెట్టకపోవడం) లేదా మార్కెట్లు పట్టించుకోని స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసి ఉంటే గనుక, ఈ రిస్క్ తగ్గించే విధానాల ఫలితంగా బుల్ మార్కెట్లో ఆయా పథకాలు మంచి రాబడులు తెచ్చి పెడతాయి. 2021 వరకు కాంట్రేరియన్, వ్యాల్యూ ఫండ్స్ గ్రోత్ ఫండ్స్‌తో పోలిస్తే రాబడుల విషయంలో ఎంతో వెనుక ఉన్నాయి. వడ్డీ రేట్లు రికార్డు కనిష్టాలకు చేరడం గ్రోత్ స్టాక్స్‌కు ఎంతో అనుకూలించింది. కానీ, వడ్డీ రేట్లు తిరిగి పెరగడం మొదలైన తర్వాత అప్పుడు వ్యాల్యూ, కాంట్రేరియన్ ఫండ్స్‌కు కలిసొచ్చింది. అవి మంచి పనితీరు చూపించడం ఆరంభమైంది. ఇలా ఒక తరహా పథకాల నుంచి మరో తరహా పథకాల మధ్య పెట్టుబడులు మారుస్తూ ఉండడం కంటే, ఇన్వెస్టర్ తన రాబడుల ఆకాంక్షలు, రిస్క్ సామర్థ్యాలకు అనుకూలమైన పథకాలు లేదా కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన విధానం అవుతుంది. అంతేకాదు, అవి రాబడులు ఇచ్చే వరకూ ఓపిక పట్టాలి. ఓ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టే ముందు ఫండ్ మేనేజర్‌ను కూడా చూడాలి. ఎన్నో మార్కెట్ సైకిల్స్ (బుల్, బేర్) చూసిన ఫండ్ మేనేజర్ అయితే ఆ పథకం స్వల్ప కాలంలో వెనుకబడ్డా.. ఆ తర్వాత రాబడుల్లో మెరుగైన స్థానానికి తిరిగి చేరుకోగలదు. ఆయా సందర్భాల్లో నిపుణుల సూచనలూ తీసుకోవాలి.



ఉదాహరణకు ఏటా 15 శాతం కాంపౌండెడ్ వార్షిక రాబడి (సీఏజీఆర్) ఆశించి ఒక ఫ్లెక్సీక్యాప్ పథకంలో ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. అప్పుడు మీ పథకం గత మూడేళ్ల కాలంలో 20 శాతం సీఏజీఆర్ రాబడిని ఇచ్చింది. కానీ అదే కాలంలో 38 శాతం సీఏజీఆర్ రాబడిని ఇచ్చిన క్వాంట్ ఫ్లెక్సీక్యాప్ పథకం చూసి ఆందోళన చెందకూడదు.

లక్ష్యాలకు అనుకూలం

ఎందుకంటే మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం ఇచ్చిన 20 శాతం సీఏజీఆర్ రాబడి అనేది బీఎస్‌ఈ 500 రాబడి కంటే ఎక్కువ. పైగా మీరు ఆశించిన దానికి మించిన పనితీరును పథకం చూపించింది. కనుక పోర్ట్‌ఫోలియో కోసం ఎంపిక చేసుకున్న మ్యూచువల్ ఫండ్స్ అనుకున్న విధంగా మంచి పనితీరు చూపిస్తున్నప్పుడు.. ఇతర పథకాల పనితీరు చూసి వాటిని విక్రయించే నిర్ణయం తీసుకోవడం సరైనది అనిపించుకోదు. ఒక పథకం నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకునే ముందు పాయింట్ టు పాయింట్ వాస్తవ రాబడులను చూడాలి. సరైన రాబడులు ఇస్తున్నప్పుడు ఆ పెట్టుబడిని ఏమీ చేయకుండా వదిలి పెట్టడమే మంచి నిర్ణయం అవుతుంది. మీ లక్ష్యాలకు, మీ ఆకాంక్షలకు అనుగుణంగా ఫండ్ పనితీరు ఉందా, లేదా అన్నదే ముఖ్యం కానీ, మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం టాప్‌లోనే ఉండాలని కోరుకోవద్దు.

కోల్ ఇండియా లాభం డౌన్

- క్యూ4లో రూ. 5,528 కోట్లు
- షేరుకి రూ. 4 డివిడెండ్



న్యూఢిల్లీ: మైనింగ్ రంగ పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా గత ఆర్థిక సంవత్సరం (2022-23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 18 శాతం క్షీణించి రూ. 5,528 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 6,715 కోట్లు ఆర్జించింది. ఉద్యోగుల వేతన సవరణ కారణంగా ప్రొవిజన్లు పెరగడం లాభాలను ప్రభావితం చేసింది. యూనియన్లతో ఒప్పందం నేపథ్యంలో నాన్‌ఎగ్జిక్యూటివ్స్ జీతాలు 2021 జులై నుంచి సవరించడంతో రూ. 5,870 కోట్లు కేటాయించినట్లు కంపెనీ పేర్కొంది. అంతక్రితం ఏడాది ఇవి రూ. 475 కోట్లు మాత్రమే. వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున తుది డివిడెండు ప్రకటించింది.

అమ్మకాలు జూమ్

క్యూ4లో కోల్ ఇండియా మొత్తం అమ్మకాలు మాత్రం రూ. 29,985 కోట్ల నుంచి రూ. 35,161 కోట్లకు ఎగశాయి. బొగ్గు ఉత్పత్తి 7 శాతం పుంజుకుని 224.16 మిలియన్ టన్నులకు చేరింది. విక్రయాలు 180.25 ఎంటీ నుంచి 186.88 ఎంటీకి పెరిగాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-5-2023	
విశాఖ	470–00
చిత్తూరు	488–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470–00
విజయవాడ	470–00
రిటైల్ ధర (డజను)	72.00
7-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	435–00
వరంగల్	437–00
రిటైల్ ధర	4.95

ఐసీఐసీఐ బ్యాంక్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 927 టార్గెట్: రూ. 1,210

ఎందుకంటే: తాజా త్రైమాసికం(క్యూ4)లో ఈ ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం) త్రైమాసికవారీగా 0.25 శాతం బలపడి 4.9 శాతాన్ని తాకాయి. ఇందుకు రుణాలపై వడ్డీ రేట్ల పెంపు సవరణలు సహకరించాయి. రుణాల నాణ్యత సైతం మెరుగుపడింది. స్లిప్పేజీలు తగ్గడంతో త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు(జీఎన్‌పీఏ) 3.07 శాతం నుంచి 2.81 శాతానికి దిగివచ్చాయి. పునర్వ్యవస్థీకరించిన రుణాలు 0.5 శాతం నుంచి 0.4 శాతానికి తగ్గాయి. 1 శాతం తక్కువగా రుణ వృద్ధి 19 శాతం, కార్పొరేట్(ఐబీపీసీసహా) రుణాలు 14 శాతానికి చేరాయి. అయితే నికర వడ్డీ ఆదాయం వార్షికంగా 40 శాతం జంప్‌చేసింది. వార్షిక ప్రాతిపదికన పీవోపీ 34 శాతం పురోగమించింది. ఇందుకు 7 శాతం పుంజుకున్న ఇతర ఆదాయం దోహదపడింది. అధిక రికవరీలు, చౌక రుణ వ్యయాల కారణంగా గత కొన్నేళ్ల నుంచి రిటర్న్ రేషియోలు మెరుగుపడ్డాయి. వెరసి ఆర్‌వోఏ 2.4 శాతాన్ని తాకింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాది(2022–23)కి నికర వడ్డీ మార్జిన్లు 0.52 శాతం పుంజుకుని 4.5 శాతానికి చేరాయి. ఇవి బ్యాంక్ చరిత్రలోనే అత్యధికంకాగా.. నిధుల సమీకరణ వ్యయాలు పెరుగుతూ వస్తున్నాయి. క్యూ4లో త్రైమాసికవారీగా 0.34 శాతం పెరిగాయి. దీంతో భవిష్యత్‌లో ఎన్ఐఎంపై ప్రతికూల ప్రభావం పడే వీలుంది. మాతృ సంస్థకు రూ. 1,081, అనుబంధ సంస్థలకు రూ. 129 చొప్పున విలువను పరిగణించి టార్గెట్ ధర నిర్ణయించాం.


స్టాక్స్ వ్యూ



మ్యాక్రోటెక్ డెవలపర్స్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 896 టార్గెట్: రూ. 1,262

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం(2022–23)లో రియల్టీ రంగ దిగ్గజం మ్యాక్రోటెక్ డెవలపర్స్(లోధా గ్రూప్) రూ. 12,060 కోట్ల విలువైన అమ్మకాల బుకింగ్స్‌ను సాధించింది. కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. 34 శాతం పురోభివృద్ధిని అందుకుంది. వెరసి ఏడాది ప్రారంభంలో కంపెనీ ప్రకటించిన బుకింగ్స్ అంచనాలు రూ. 11,500 కోట్లను అధిగమించింది. అంతేకాకుండా దేశీయంగా కంపెనీ నికర రుణ భారం వార్షికంగా రూ. 2,230 కోట్లు తగ్గింది. మార్చికల్లా రూ. 7,070 కోట్లకు పరిమితమైంది. గతేడాది బిజినెస్‌లోనూ మంచి పురోగతిని సాధించింది. 12 ప్రాజెక్టుల ద్వారా రూ. 15,000 కోట్ల స్థూల అభివృద్ధి విలువ(జీడీవీ)ను జత చేసుకుంది. తద్వారా కంపెనీ తొలి జీడీవీ అంచనాలు రూ. 15,000 కోట్లను అధిగమించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో వార్షికంగా అమ్మకాల బుకింగ్స్‌లో 20 శాతం వృద్ధిని ఆశిస్తోంది. రూ. 14,500 కోట్ల బుకింగ్స్‌ను అంచనా వేస్తోంది. ఇందుకు ముంబై, పుణే కొత్త ప్రాజెక్టులతోపాటు.. బెంగళూరులో చేపట్టిన రెండు కొత్త ప్రాజెక్టులు సహకరించనున్నాయి. ఈ నేపథ్యంలో వడ్డీకి ముందు రూ. 6,000 కోట్ల నిర్వహణ క్యాష్ ఫ్లో మిగులును సాధించగలమని భావిస్తోంది. ఈ బాటలో రానున్న రెండేళ్ల(2024–26)లో 20 శాతం సాలుసరి వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. రెసిడెన్షియల్ హౌసింగ్‌కు డిమాండు దీర్ఘకాలం కొనసాగగలదన్న అంచనాల నడుమ కొత్త ప్రాజెక్టులను జత చేసుకుంటూ 2026కల్లా రూ. 21,000 కోట్ల అమ్మకాల బుకింగ్స్‌ను ఆశిస్తోంది.



ఫండ్స్‌కు పనితీరు ఆధారిత ప్రోత్సాహం: సెబీ



ముంబై: మ్యూచువల్ ఫండ్స్‌కు పనితీరు ఆధారిత ప్రోత్సాహం ఇచ్చే విధానాన్ని సెబీ త్వరలోనే ప్రవేశపెట్టనుందని సెబీ ఈడీ మనోజ్ కుమార్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే సంప్రదింపుల పత్రంతో ముందుకు వస్తామన్నారు. టెక్నాలజీ పరమైన మార్పులతో వచ్చే ప్రయోజనాలను ఫండ్స్ పరిశ్రమ ఇన్వెస్టర్లకు బదిలీ చేయడాన్ని సెబీ ప్రోత్సహిస్తుందని చెబుతూ.. పరిశ్రమలోని కొన్ని వర్గాలు దీన్ని స్వాగతించడం లేదన్నారు. సంప్రదింపులు చేపట్టిన అనంతరం ఎలాంటి ప్రోత్సాహక నిర్మాణం ఏర్పాటు చేయగలమో చూడాల్సి ఉందన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని రకాల ప్రోత్సాహకాలు వాంఛనీయం కాదన్నారు. మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమకు సంబంధించి స్వీయ నియంత్రణను సెబీ కోరుకుంటున్నట్లు మనోజ్‌కుమార్ చెప్పారు. యాంఫీ పరిశ్రమ కార్యకలాపాలను బలోపేతం చేసే యాంఫి 2.0 కార్యాచరణతో సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలో పథకాల వారీగా భిన్నరకాల ఎక్స్‌పెన్స్ రేషియో (ఇన్వెస్టర్ల పెట్టుబడిపై వసూలు చేసే కమీషన్) అమల్లో ఉంది.

బీమా ప్రకటనల నిబంధనలు కఠినతరం

ఐఆర్‌డీఏఐ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: ప్రకటనల విషయంలో బీమా సంస్థలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా నిబంధనలను కఠినతరం చేయడంపై బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ దృష్టి సారించింది. ఇందులో భాగంగా పథకాల ప్రచార కార్యక్రమాల రూపకల్పన, ఆమోదం విషయంలో సీనియర్ మేనేజ్‌మెంటుకు మరిన్ని బాధ్యతలు కట్టబెట్టేలా బీమా నిబంధనలకు సవరణలను ప్రతిపాదించింది. వీటిపై పరిశ్రమ వర్గాలు మే 25లోగా తమ అభిప్రాయాలను ఐఆర్‌డీఏకి తెలియజేయాల్సి ఉంటుంది. ఐఆర్‌డీఏఐ ప్రతిపాదనల ప్రకారం ప్రతి సంస్థ ఒక అడ్వర్టైజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. మార్కెటింగ్, యాక్చువేరియల్, నిబంధనల అమలు విభాగాల నుంచి తప్పనిసరిగా ఒక్కో ప్రతినిధి ఉండాలి.

ఎస్‌సీఎస్‌ఎస్ ముందే రద్దు చేసుకుంటే?

నాకు సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్)లో రూ.4 లక్షల పెట్టుబడులు ఉన్నాయి. మూడేళ్ల తర్వాత నా పెట్టుబడిని వెనక్కి తీసుకుంటే పెనాల్టీ చెల్లించాలా? ఇందుకు అనుసరించాల్సిన ప్రక్రియ ఏది?
– ధీరజ్ సన్యాల్

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ కాల వ్యవధి ఐదేళ్లు. 8 శాతం వార్షిక రాబడిని (హామీతో కూడిన) మూడు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తారు. ఈ పథకం వడ్డీ రేటును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తుంటారు. కానీ డిపాజిట్ చేసిన రోజు ఉన్న రేటే ఐదేళ్ల కాలానికి అమలవుతుంది. అంటే కొత్తగా ప్రారంభించే ఖాతాలకే సవరించిన రేటు అమల్లో ఉంటుంది. ఈ పథకం కాల వ్యవధి ఐదేళ్లే అయినా, ఫారమ్–2 సమర్పించడం ద్వారా ముందుగానే ఖాతాను మూసివేయవచ్చు. కాకపోతే ఇన్వెస్ట్ చేసిన కాలవ్యవధి ఆధారంగా పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్ చేసిన ఏడాది లోపు వెనక్కి తీసుకుంటే ఎలాంటి వడ్డీ చెల్లించరు. అప్పటికే మూడు నెలలకు ఒకసారి చెల్లించిన వడ్డీ మొత్తాన్ని అసలు నుంచి మినహాయించుకుంటారు. ఏడాది నుంచి రెండేళ్ల మధ్య డిపాజిట్‌ను రద్దు చేసుకుంటే పెట్టుబడిలో 1.5 శాతాన్ని జరిమానా కింద చెల్లించాల్సి వస్తుంది. ఇక రెండు నుంచి ఐదేళ్ల మధ్యలో డిపాజిట్ రద్దు చేసుకుంటే అప్పుడు పెట్టుబడిపై 1 శాతం జరిమానా పడుతుంది. మూడేళ్ల తర్వాత మీ డిపాజిట్‌ను వెనక్కి తీసుకోవాలని అనుకుంటున్నారు కనుక మీరు మీ పెట్టుబడి మొత్తం రూ.4 లక్షలపై ఒక శాతం చొప్పున రూ.4,000 పెనాల్టీ మినహాయించుకుని, మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తారు. మొదటి ఐదేళ్ల కాలానికే ఈ నిబంధనలు అమలవుతాయి. ఎస్‌సీఎస్‌ఎస్ పథకాన్ని ఐదేళ్ల తర్వాత మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. ఇలా పొడిగించి కాలంలో ఏడాది నిండిన తర్వాత, అంటే మొత్తంగా ఆరేళ్ల తర్వాత ఎప్పుడు ముందస్తుగా రద్దు చేసుకున్నా, ఎలాంటి పెనాల్టీ పడదు.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయసు 74 ఏళ్లు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ త్వరలోనే గడువు తీరి (మెచ్యూరిటీ) రూ.25 లక్షలు చేతికి రానున్నాయి. నేను ఈ మొత్తాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకుంటే మెరుగైన రాబడులు వస్తాయి? ప్రభుత్వ పథకాలు అయిన సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్), ప్రధాన మంత్రి వయవందన యోజన (పీఎంవీవీవై), పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (ఎంఐఎస్)లో పూర్తి స్థాయిలో నాకు పెట్టుబడులు ఉన్నాయి.
– ఎస్.అరుణ్



ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రాబడులు మెరుగ్గా ఉండవు. కనుక మీరు మెరుగైన రాబడుల కోసం ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎఫ్‌డీలతో పోలిస్తే ఈక్విటీ ఫండ్స్ అస్థిరతలతో ఉంటాయి. కాకపోతే అచ్చమైన ఈక్విటీ ఫండ్స్‌లో మాదిరిగా అస్థిరతలు ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌లో ఉండవు. ఇవి 15–30 శాతం వరకు ఈక్విటీల్లో, మిగిలిన మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, ఆర్బిట్రేజ్ అవకాశాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. స్వల్పకాలంలో ఈ ఫండ్స్‌లోనూ రిస్క్ ఎక్కువే ఉంటుంది. అయితే మూడు నుంచి ఐదేళ్లు అంతకుమించిన కాలానికి రిస్క్ అని నేను అనుకోను. షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ మరోక ఆప్షన్. ఫిక్స్‌డ్ డిపాజిట్ మాదిరే షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లోనూ రాబడులు ఉంటాయి. వీటిల్లో లిక్విడిటీ ఎక్కువ. పోస్టాఫీసు ఎంఐఎస్, ఎస్‌సీఎస్‌ఎస్, పీఎంవీవీవై పథకాల్లో పెట్టుబడులు ఉన్నాయి కనుక క్రమం తప్పకుండా ఆదాయం వస్తుంటుంది. ఈ పథకాల నుంచి రాబడి తీసుకుంటూ ఉంటారు. కనుక పెట్టుబడి విలువ పెరగదు. కనుక మీకు ఉన్న వాటిల్లో ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ మెరుగైన ఆప్షన్ అవుతుంది. ఈక్విటీ వద్దనుకుంటే షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌కు వెళ్లొచ్చు.

విమాన చార్జీలు నిర్ణయించేది కేంద్రమే

- హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజమ్



కడప (కార్పొరేషన్): విమాన యాన టికెట్ల ధరలను నిర్ణయించేది కేంద్రమే తప్ప రాష్ట్ర ప్రభుత్వం కాదని ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజమ్ అన్నారు. ఆదివారం కడపలో మీడియాతో మాట్లాడుతూ.. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం అన్ని రాష్ట్రాల హజ్ కమిటీలు నడుస్తాయన్నారు. ఈ ఏడాది విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి హజ్ యాత్రకు వెళ్లాలంటే విమాన చార్జీలు ఎవరూ ఊహించని విధంగా రూ.80 వేలకు పైగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి.. ధరలు తగ్గించాల్సిందిగా కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి స్మృతి ఇరానీని కోరామని చెప్పారు. ధరలు తగ్గించలేని పక్షంలో ఏపీ నుంచి వెళ్లే యాత్రికులను హైదరాబాద్, బెంగళూరు మీదుగా పంపాలని కోరామన్నారు. ఇవన్నీ తెలుసుకోకుండా కొంతమంది టికెట్ ధరలను ప్రభుత్వం పెంచినట్టు మాట్లాడటం సరికాదన్నారు. విమాన చార్జీల తగ్గింపు కోసం డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ మిథున్‌రెడ్డి ద్వారా కేంద్రంతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. గతంలోనూ చార్జీలు పెరగ్గా డిప్యూటీ సీఎం అంజద్ బాషా ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి రూ.3 లక్షల్లోపు ఆదాయం గల వారికి రూ. 60 వేలు, ఆపై ఆదాయం కలిగిన వారికి రూ. 30 వేలు ఆర్థిక సాయం అందించారన్నారు. ఈ సాయం మరే ఇతర రాష్ట్రంలోనూ ఇవ్వలేదన్నారు.

నిద్రపోయినా.. ఏడ్చినా జీతమిస్తారు..!

పని చేస్తే జీతమిస్తారు ఎక్కడైనా. కానీ.. పరుపులపై నిద్రపోవడం.. క్యూలైన్‌లో నిలబడటం.. శవం దగ్గర ఏడ్వటం లాంటి పనులు చేస్తే కాసుల వర్షం కురుస్తోంది. వివిధ దేశాల్లో ఇలాంటి చిత్ర విచిత్రమైన పనులెన్నో చేసేస్తూ డబ్బులు గడిస్తున్న వారు చాలామందే ఉన్నారు. ఇలాంటి ఉద్యోగాలు కూడా ఉంటాయా అని ఆశ్చర్యపోకండి. అవేంటో చూసేద్దాం పదండి.

కార్యాలయం లేదా పనిచేసే చోట నిద్రపోతే ఉద్యోగం ఊడిపోతుంది. కానీ.. బాగా నిద్రపోయే వారికి మాత్రం అక్కడ జీతాలు ఇస్తారు. 'ప్రొఫెషనల్ స్లీపర్స్' పేరిట ఇలాంటి ఉద్యోగాలను పరుపుల తయారీ కంపెనీలు, కొన్ని ప్రముఖ హోటళ్లు సైతం ఆఫర్ చేస్తున్నాయి. ఫిన్లాండ్‌లోని ఒక హోటల్ ప్రొఫెషనల్ స్లీపర్స్‌ను నియమించుకుంది. ఆ హోటల్‌లోని బెడ్‌లలో రోజూ ఏదో ఒక బెడ్‌పై పడుకుని అవి సౌకర్యంగా ఉన్నాయా.. లేదా అనేది చెక్ చేసి నివేదిక ఇవ్వడమే ప్రొఫెషనల్ స్లీపర్ పని. ఇందుకోసం వీరికి నెలకు రూ.లక్షల్లో జీతాలిస్తున్నారు. అంతేకాదు.. బెడ్‌లు, పరుపుల తయారీ కంపెనీలు సైతం వాటి నాణ్యతను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ప్రొఫెషనల్ స్లీపర్స్‌ను నియమించుకుంటున్నాయి. న్యూయార్క్‌లో పరుపులు తయారు చేసే కాస్పెర్ కంపెనీ బిజినెస్ పెంచుకునేందుకు కొత్తగా ఆలోచించి 'స్లీపర్స్' కావాలని ఈ మధ్యే ఒక ప్రకటన చేసింది. తమ కంపెనీ పరుపు మీద పడుకుంటే కంటినిండా నిద్రపడుతుందని చెప్పడం ద్వారా మార్కెట్ పెంచుకునేందుకు 'ప్రొఫెషనల్ స్లీపర్స్' కోసం వెతుకుతోంది ఆ కంపెనీ. అభ్యర్థులకు ఎక్కువసేపు నిద్రపోవాలనే కోరిక ఉండాలట. చుట్టూ ఏం జరిగినా ఏమీ పట్టనట్టు హాయిగా పడుకోగలగటం ప్రత్యేకత. జాబ్‌లో చేరిన వారు కాస్పెర్ పరుపుల పైపడుకుని బాగా నిద్రపోవడంతోపాటు వారి అనుభవాలను టిక్‌టాక్ వీడియోలు, రీల్స్, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయాలని ఆ కంపెనీ నిబంధనలు విధించింది.

- సాక్షి, అమరావతి

క్యూలో నిలబడినా నెలనెలా ఆదాయమే

ఫిన్లాండ్‌లో ప్రొఫెషనల్ స్లీపర్స్

మెట్రో రైలులో 'ప్యాసెంటర్ పుషర్'లకూ..

చైనా, ఆఫ్రికాలో దుఃఖితులకు డబ్బులు

అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఒకరికి బదులు మరొకరు క్యూలో నిలబడితే చాలు డాలర్లే



బెంగళూరులోనూ ఉందో కంపెనీ

నిద్రపోతే చాలు జీతమిస్తామంటోంది మన దేశంలోని బెంగళూరుకు చెందిన 'వేక్‌ఫిట్' సంస్థ. 'రోజూ రాత్రి 9 గంటలపాటు శుభ్రంగా పడుకోండి. నెలకు రూ.లక్ష జీతం ఇస్తాం' అంటోంది. అంతేకాదు.. ఈ జాబ్‌లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు కూడా అవకాశం కల్పించింది. ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనే అభ్యర్థులకు బాగా నిద్రపోయేలా స్లీప్ ఎక్స్‌పర్ట్స్, న్యూట్రిషనిస్టులు, ఇంటీరియర్ డిజైనర్లు, ఫిట్‌నెస్ నిపుణులు పలు సూచనలు కూడా ఇస్తారట. అభ్యర్థులందరినీ ఒక ప్రత్యేక వాతావరణంలో ఉంచి వారందరూ గాఢంగా, ఎక్కువ సేపు నిద్రపోయేలా వివిధ రకాల వ్యూహాలను అమలు చేస్తారు. ఇందులో పాల్గొనే వారికి ఏదైనా డిగ్రీ ఉండాలి. బెడ్ పైకి వెళ్లగానే 10–20 నిమిషాల్లో నిద్రలోకి జారుకునే లక్షణం కలిగి ఉండాలి.

అక్కడ ఏడిస్తే డబ్బులిస్తారు



కొన్ని దేశాల్లో ఎవరైనా చనిపోతే ఏడ్చేందుకు వెళ్లి డబ్బులు సంపాదించుకోవచ్చు. చైనా, ఆఫ్రికా, యూకే వంటి దేశాల్లో మతపరమైన సంప్రదాయంలో ప్రత్యేకంగా దుఃఖితులను నియమించుకుని డబ్బులిస్తారు. వీరంతా ఏడవడంతోపాటు బాధిత కుటుంబ సభ్యులను కూడా ఓదారుస్తారు. ఇందుకోసం ఒక్కో ఈవెంట్‌కు సుమారు రూ.9 వేల నుంచి రూ.16 వేల వరకు చెల్లిస్తారు.

క్యూలో నిలబడితే డబ్బిస్తారు



క్యూలో గంటల తరబడి నిలబడటం ఎవరికైనా ఇబ్బందే. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, వయసు పైబడిన వారు, చిన్న పిల్లల తల్లులు, పిల్లలు క్యూలైన్‌లో నిలబడటం కష్టం. ఇందుకు ప్రత్యామ్నాయంగా అనేక దేశాలు 'లైన్ స్టాండర్' పద్ధతిని అనుసరిస్తున్నాయి. లైన్‌లో మీరు నిలబడలేకపోతే మీకు బదులుగా అక్కడి ఉద్యోగులు నిల్చుంటారు. అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఈ తరహా లైన్ స్టాండర్లు ఎక్కువగా కనిపిస్తుంటారు. ముఖ్యంగా షాపింగ్ మాల్స్‌లో ఫెస్టివల్ ఆఫర్లు ప్రకటించినప్పుడు.. మార్కెట్లో కొత్త ప్రొడక్ట్స్ విడుదలైనప్పుడు వీరికి ఫుల్ డిమాండ్ ఉంటుంది.

ప్రయాణికుల్ని తోసేస్తే జీతం



పండగలు, పర్వదినాల్లో కిక్కిరిసిన రైలు, బస్సుల్లో జనం గుమ్మాల దగ్గర వేలాడటం చూస్తుంటాం. మెట్రో రైలులో ఇలాంటి పరిస్థితి వస్తే తలుపులు మూసుకోకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు విదేశాల్లో ప్రత్యేకంగా 'పాసింజర్ పుషర్స్'ను నియమిస్తున్నారు. జపాన్ రాజధాని టోక్యోతోపాటు వివిధ దేశాల్లోని మెట్రో రైళ్లలో 'పాసింజర్ పుషర్స్' డ్యూటీలో చేరుతున్నారు. మెట్రో రైలు లోపలికి ప్రయాణికులను నెట్టేసి రైలు తలుపులు మూసుకునేలా చేయడమే వీరి పని. ఇందుకోసం వారికి నెలకు మన కరెన్సీలో చూస్తే రూ.70 వేల నుంచి రూ.75 వేల వరకు జీతం ఇస్తున్నారు.

మరిన్ని చిత్రమైన కొలువులున్నాయ్!

ఓటీటీ సంస్థలు ప్రత్యేకంగా మూవీ వాచర్లను నియమించుకుంటున్నాయి. సినిమా ప్రసారం కావడానికి ముందే సినిమా ఎలా ఉంది.. రీచింగ్ బాగా ఉంటుందా.. లేదా.. ఎలాంటి ట్యాగ్స్ ఇవ్వాలనే దానిపై కొందర్ని నియమించుకుని జీతాలిస్తున్నాయి. విడుదలకు ముందే వెబ్ సిరీస్, మూవీలను చూసి సమీక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. వాటి ఆధారంగానే రిలీజ్ ఆధారపడి ఉంటుంది. కాగా, ఇంటికి వేసిన రంగు (కలర్) ఎంత సమయంలో ఆరుతుందో చెప్పడానికి ప్రత్యేకంగా రంగుల తయారీ కంపెనీలు పెయింట్ డ్రైయింగ్ వాచర్ పేరిట సిబ్బందిని నియమించుకుంటున్నాయి. పెయింట్ ఎంతసేపట్లో ఆరుతుంది.. చేతికి అంటుకుంటుందా అనే వివరాలతో రిపోర్ట్ తయారు చేసి మేనేజర్లకు ఇవ్వడమే వీరి పని. కాగా.. గోల్ఫ్ గేమ్‌లో కొట్టిన బంతిని దూరం నుంచి తిరిగి తేవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఆ సమయాన్ని ఆదా చేసేలా బాల్ డ్రైవర్‌ను నియమించుకుని జీతాలిస్తారు. కాగా, చివరకు కండోమ్ తయారీ సంస్థలు వాటిని మార్కెట్లో విడుదల చేయడానికి ముందు సౌకర్యంగా ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు కూడా కండోమ్ టెస్టర్స్‌ను నియమించుకుంటాయి. వారికి జీతం ఏడాదికి ఇండియన్ కరెన్సీ ప్రకారం చూస్తే.. ఏకంగా రూ.10 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు చెల్లిస్తున్నాయి.

ప్రశాంతంగా ముగిసిన 'నీట్'

ప్రశ్నపత్రం మధ్యస్థం నుంచి కఠినంగా ఉందన్న విద్యార్థులు

కటాఫ్ తగ్గుతుందా.. లేదా.. అని సందిగ్ధం

సాక్షి, అమరావతి/ఒంగోలు: ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య విద్య యూజీ కోర్సుల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్–యూజీ) ప్రశాంతంగా ముగిసింది. ఈ ఏడాది ప్రశ్నపత్రం మధ్యస్థం నుంచి కఠినంగా ఉన్నట్టు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. గత నాలుగేళ్లలో ఈ ఏడాది ప్రశ్నపత్రం కఠినంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. కరోనా కారణంగా గతేడాది వరకు కొంతమేరకు సులభంగా ఉన్న పేపర్, ఈసారి కాస్త కఠినతరం చేశారని చెబుతున్నారు. కెమిస్ట్రీ విభాగం కఠినంగా ఉందని తెలిపారు. కెమిస్ట్రీలో ఆర్గానిక్, ఫిజికల్, ఇన్‌ఆర్గానిక్ విభాగాలు ఉంటాయి. ఫిజికల్‌లో ప్రాబ్లమ్స్, ఆర్గానిక్‌లో ఈక్వేషన్లు, ఇన్ ఆర్గానిక్‌లో థియరీ బిట్లు వస్తాయి. మెమరీ బేస్డ్‌గా ఉంటాయి. థియరీ ప్రశ్నలు ఎక్కువగా ఉండటంతో సహజంగా విద్యార్థులు థియరీ పార్ట్‌ను నిర్లక్ష్యం చేస్తారు. దీంతో ఇది కఠినంగా మారిందని తెలుస్తోంది. ఇక ఫిజిక్స్‌లో గతేడాదితో పోల్చినా సులభంగానే ఉంది. అయితే, నాలుగైదు ప్రశ్నలు తికమకగా ఉన్నాయి. అన్ని ఆప్షన్లు చదివి సమాధానం పెట్టాలి. ఈ విభాగంలో ఒక ప్రశ్నకు ఇచ్చిన నాలుగు ఆప్షన్‌లు కరెక్ట్‌గా లేవు. కాబట్టి దానికి బోనస్ మార్కు కలిసే అవకాశం ఉంది. బోటనీ, జువాలజీ విభాగాలు సులభంగా ఉన్నాయని అంచనా వేశారు. గత ఏడాదితో పోలిస్తే బోటనీలో స్టేట్‌మెంట్ రూపంలో సమాధానాలు తగ్గాయని, మ్యాచింగ్‌లో ఎక్కువగా ఉన్నాయని నిపుణులు తెలిపారు.



విజయవాడలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

కటాఫ్ తగ్గేనా?

ఈసారి నీట్ ప్రశ్నపత్రం మధ్యస్థం నుంచి కఠినంగా ఉండటంతో గత ఏడాదితో పోలిస్తే కటాఫ్‌లో తగ్గుతుందా... లేదా..? అనే సందిగ్ధం నెలకొంది. గడిచిన మూడు సంవత్సరాలుగా పరిశీలిస్తే కటాఫ్ స్కోర్ తగ్గుతూ వచ్చింది. 2020లో జనరల్ కేటగిరీలో కట్ ఆఫ్ మార్క్ 147 స్కోర్ ఉండగా, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల్లో 113 ఉంది. ఆ మరుసటి సంవత్సరం నీట్‌లో జనరల్ కటాఫ్ మార్క్ 138, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కటాఫ్ 108గా ఉంది. గత సంవత్సరం జనరల్ కటాఫ్ మార్క్ 117, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విభాగాల్లో కటాఫ్ 93కే పరిమితమైంది.

ఆలస్యం మిగిల్చిన ఆవేదన

పరీక్షకు ఆలస్యంగా వచ్చిన ఓ విద్యార్థినికి ఆవేదన మిగిలింది. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు నీట్ పరీక్ష ప్రారంభమైంది. ఒంగోలు రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్ష కేంద్రం వద్దకు ఓ విద్యార్థిని 1.47 గంటలకు రాగా, పోలీసులు లోపలికి అనుమతించలేదు. దీంతో 'కాళ్లు పట్టుకుంటానయ్యా... నా బిడ్డను పరీక్షకు అనుమతించండి' అని విద్యార్థిని తల్లి ప్రాథేయపడింది. ట్రాఫిక్ వల్ల ఆలస్యమైందని విద్యార్థిని కన్నీటిపర్యంతమైంది. సమయం దాటిపోవడంతో తామేమీ చేయలేమని పోలీసులు చెప్పడంతో వారు ఆవేదనతో వెనుదిరిగారు.



పరీక్షకు ఆలస్యంగా వచ్చిన తన కూతురిని లోపలికి అనుమతించాలని గేటు వద్ద ఎస్‌ఐను వేడుకుంటున్న తల్లి

లేటు వయసులోనూ నీట్ రాశారు

- 69 ఏళ్ల వయసులో నీట్ రాసిన విశ్రాంత ప్రొఫెసర్
- వైద్య వృత్తి చేపట్టి పేదలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పం



డీకేపీఎస్ ప్రసాద్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): పేదలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో 69 ఏళ్ల వయసులోనూ ఎంబీబీఎస్ చేసేందుకు సంకల్పించారు విశ్రాంత ప్రొఫెసర్ డీకేపీఎస్ ప్రసాద్. సేవా భావం ముందు వయసు ఎప్పుడూ చిన్నదేనంటున్న ప్రసాద్ విజయనగర్‌లోని కేంద్రీయ విద్యాలయం కేంద్రంలో ఆదివారం నీట్ పరీక్ష రాశారు. ఎంబీఏ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన ప్రొఫెసర్ ప్రసాద్ అవంతి ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపకునిగా పనిచేశారు. కరోనా సమయంలో అధ్యాపక వృత్తికి స్వస్తి చెప్పారు. హోమియో వైద్యంపై కొంత అవగాహన ఉన్న ప్రొఫెసర్ ప్రసాద్ పేదలకు వైద్య సేవలందిస్తున్నారు. ప్రతి ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ.. హోమియో మందులను ఉచితంగా ఇస్తున్నారు. ఎంతో అభిమానం, అభిరుచి గల వైద్య వృత్తిని కొనసాగించాలంటే ఆయనకు పట్టా లేదు. ఎంబీబీఎస్ చదవకుండా వైద్య వృత్తి చేయడం ఇబ్బందికరంగా ఉంటుందన్న ఆలోచనతో ఆయన నీట్‌కు దరఖాస్తు చేశారు.

వయో పరిమితి ఎత్తివేయడంతో..

నీట్ పరీక్ష రాయడానికి ఇప్పుడు వయసు నిబంధనలేవీ లేవు. గతంలో 21 సంవత్సరాలలోపు వయసు వారికి మాత్రమే నీట్ పరీక్షకు అనుమతి ఉండేది. నేషనల్ మెడికల్ కమిషన్ గతేడాది నీట్ అర్హత కోసం వయోపరిమితిని ఎత్తివేయడంతో.. వైద్యుడు కావాలన్న ఆకాంక్షను తీర్చుకునే గొప్ప అవకాశం ప్రొఫెసర్ ప్రసాద్‌కు లభించింది. ఆయన దరఖాస్తు చేసిన వెంటనే హాల్‌టికెట్ రాగా.. ఆదివారం పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష బాగా రాశానని.. తనకున్న అనుభవం వల్ల పరీక్షలో ర్యాంక్ సాధిస్తానన్న నమ్మకం ఉందని చెప్పారు. వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిపోయిన తరుణంలో.. తాను పట్టా తీసుకుంటే పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించే అవకాశం దక్కుతుందన్న ఆలోచనతో పరీక్ష రాశానన్నారు.

న్యాయం హక్కుగా మారాలి

- అప్పుడే అందరికీ కనీస సౌకర్యాలు
- ఏ ఒక్కరూ ఆర్థిక, సామాజిక పరిస్థితుల వల్ల అన్యాయానికి గురి కాకూడదు
- ఏపీఎస్ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి



డీఎల్ఎస్ఏ సేవాసదన్ మందిరాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి. పక్కన జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ మల్లికార్జునరావు తదితరులు

ఆల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్): ప్రతి ఒక్కరికీ న్యాయం హక్కుగా మారాలని, అప్పుడే దేశంలో పుట్టిన అందరికీ కూడు, గూడు వంటి కనీస సౌకర్యాలు సాధ్యమవుతాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (ఏపీఎస్ఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యాలయంలో ఆధునికీకరించిన న్యాయ సేవాసదన్ సమావేశ మందిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి మాట్లాడుతూ దేశంలోని ఏ ఒక్కరూ ఆర్థిక, సామాజిక పరిస్థితుల కారణంగా అన్యాయానికి గురి కాకూడదని చెప్పారు. జాతీయ లోక్ అదాలత్, న్యాయ సేవాధికారసంస్థ ఏర్పాటు ద్వారా సత్వర న్యాయం సాధ్యమవుతోందన్నారు. జిల్లా పరిపాలన జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ మాట్లాడుతూ చట్టాలు, హక్కులపై అవగాహన లేకపోవడంతో చాలామంది న్యాయం పొందలేకపోతున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ లీగల్ లిటరసీ కలిగి ఉండాలన్నారు. హైకోర్టు మరో న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మాట్లాడుతూ న్యాయం కోసం ఎదురు చూసే వారికి, అర్హులకు సమర్థంగా, వినూత్న ఆలోచనలతో సత్వర న్యాయం అందించాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థపై ఉందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత గంధం మాట్లాడుతూ కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన తొమ్మిది మంది పిల్లలను జిల్లా యంత్రాంగం ద్వారా గుర్తించి ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున అందజేస్తున్నామని తెలిపారు. ఈ మొత్తం డిపాజిట్ చేసిన బాండ్లను లబ్ధిదారులకు న్యాయమూర్తులు అందజేశారు. న్యాయమూర్తులు ఎం.నాగేశ్వరరావు, పీఆర్ రాజీవ్, యాయా ప్రసాద్, ఎ.గాయత్రీదేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి, జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీయూవీబీ రాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆడిట్ షురూ

- సర్వే కోసం ఇప్పటికే ప్రత్యేక శిక్షణ
- మౌలిక వసతులపై 15 ప్రశ్నలతో ఫార్మాట్
- నాడు–నేడు పనులపై ప్రధాన దృష్టి



సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునిక ఆలయాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో వాటి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది. ఇందుకోసం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖతోపాటు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని రంగంలోకి దించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్ సౌకర్యాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి నివేదించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ల (పీడీ)కు ఆదేశాలందాయి. సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాలపై ఆడిట్ నిర్వహించేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించిన సర్వే ఎలా చేయాలి, ఏం చేయాలి, ఏయే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలనే విషయమై సచివాలయ సిబ్బందికి ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించారు. సర్వేను సమర్థవంతంగా నిర్వహించి సమగ్ర సమాచారం సేకరించేలా ప్రత్యేకంగా 'నిర్వహణ సూచిక (యూజర్ మాన్యువల్)ను స్థిరమైన రిథమ్స్ అప్లికేషన్(యాప్)'ను కూడా అందజేశారు.

వసతులపై 15 ప్రశ్నలతో ఫార్మాట్

నాడు–నేడు ద్వారా చేపట్టిన పనులు, ఇంకా చేయాల్సిన పనులు గుర్తించేందుకు అంగన్‌వాడీ ఆడిట్‌కు శ్రీకారం చుట్టారు. ఆడిట్ నిర్వహణలో యూజర్ మాన్యువల్‌లోని దశలవారీ సూచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరిస్తున్నారు. మౌలిక వసతుల సమాచారాన్ని 15 ప్రశ్నలతో కూడిన ఫార్మాట్‌లో నింపుతున్నారు. నాడు–నేడు ద్వారా ఏయే అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు చేపట్టారు, ఎన్ని పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని కేంద్రాల్లో చేపట్టాల్సి ఉందనే సమాచారం సేకరిస్తున్నారు. ఏపీలో మొత్తం 55,607 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. వాటిలో 21,176 సెంటర్లకు సొంత భవనాలున్నాయి. మరో 10,662 సెంటర్లు అద్దెలేని ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. 23,769 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా బోధనా పద్ధతిలో సమన్వయాన్ని తీసుకువచ్చేందుకు, పిల్లల మెరుగైన అభ్యాస ఫలితాల కోసం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలతో కలపడం చేస్తున్నారు. దీంతో ఇవి ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా పనిచేస్తున్నాయి. పాఠశాల విద్యాశాఖలో మన బడి నాడు–నేడు ఫేజ్–2లో 546 పాఠశాలల్లో గల 576 అంగన్‌వాడీలకు ఒక్కొక్క దానికి రూ.2.50 లక్షల చొప్పున ఫర్నిచర్ అందించారు. మరో 1,791 పాఠశాలల్లోని 1,815 అంగన్‌వాడీల మరమ్మతులు, సామాగ్రి కోసం ఒక్కొక్క దానికి రూ.5 లక్షల చొప్పున అందించారు. నాడు–నేడు ద్వారా 51,184 అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు, ఫర్నిచర్, ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. రూ.1,337.64 కోట్లతో మూడు దశల్లో ఆ పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకు తాజా సర్వే కీలకం కానుంది.

ప్యారెట్స్.. పేరెంట్స్


ఐదేళ్లుగా నిత్యం రెండు పూటలా పక్షులకు మేత పంపిణీ

650 చిలుకలు, 100 పిచ్చుకల ఆకలి తీరుస్తున్న వైనం

కైకలూరులోని ఈశ్వరరావు, పార్వతి దంపతుల ఔదార్యం



ఉదయం, సాయంత్రం వేళల్లో రామచిలుకలు, పిచ్చుకల కిలకిలరావాలతో ఆ వీధి ఆహ్లాదకరంగా మారుతుంది. వందల సంఖ్యలో అక్కడి విద్యుత్ తీగలపై వాలి ఆహారం కోసం నిరీక్షిస్తుంటాయి. ఉదయం 7.30, సాయంత్రం 4 గంటలకు ఠంచనుగా ఈశ్వరరావు, పార్వతి దంపతులు అందించే మేతను ఆరగిస్తాయి. ఐదేళ్లుగా రామచిలుకలు, పిచ్చుకల ఆకలి తీరుస్తూ పక్షులపై తమ ప్రేమను చాటుతున్నారు కైకలూరుకు చెందిన ఈశ్వరరావు, పార్వతి దంపతులు. ప్రతి రోజూ సుమారు 650 రామచిలుకలు, 100 బంగారు రంగు పిచ్చుకలకు ఆహారాన్ని అందిస్తున్నారు. కైకలూరులోని వైఎస్సార్ నగర్‌లో ఉంటున్న ఈశ్వరరావు ఇంటి సమీపంలో ఉండే విద్యుత్ తీగలపై వాలి పచ్చటి తోరణాలను తలపిస్తాయి. పూటకు పది కేజీల చొప్పున బియ్యాన్ని కడిగి డాబాపై నాలుగు వరుసల్లో చిన్న చిన్న ముద్దలుగా ఉంచుతారు. పిచ్చుకలు తిన్న తరువాత ఒక్కసారిగా రామచిలుకలు గుంపుగా వచ్చి మేతను ఆరగిస్తాయి. గతంలో ముఠా పనిచేసి కొంతకాలంగా టీమాస్టర్‌గా పనిచేస్తున్న ఈశ్వరరావు ఇటీవల వైఎస్సార్ నగర్‌లో ఇంటిని నిర్మించుకున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు కాగా, వీరి సాయంతో రోజూ రూ.200 ఖర్చుతో చిలుకలకు ఆహారంగా ఒక్కో రోజు బియ్యంతో పాటు కొర్రలు, జామకాయలు అందిస్తున్నారు. చిలుక జాతులలో మూడింట ఒక వంతు అంతరించే ప్రమాదంలో ఉందని ఇటీవల అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సమితి రెడ్‌లిస్టులో వెల్లడించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామచిలుకలకు ప్రతిరోజూ మేతను అందిస్తున్న ఈశ్వరరావు, పార్వతి దంపతుల సేవను పలువురు అభినందిస్తున్నారు. – కైకలూరు



చిలుకలను దేవతలుగా భావిస్తాం



అరుణాచలం దేవాలయానికి వెళ్లినప్పుడు రెండు చిలుకలు మా తలలపై తిరిగాయి. మా మామ మరణించే చివరి ఘడియల్లో గోడపై చిలుక బొమ్మ ముద్రించారు. ఈ ఘటనలతో చిలుకలను దేవతలుగా భావిస్తూ రోజూ మేతను అందిస్తున్నాం. వాటి సవ్వడులు మాకు ఎంతో ఆనందాన్నిస్తాయి. ప్రతిరోజూ 20 కేజీల బియ్యాన్ని సమకూర్చడం కష్టతరమవుతోంది. దాతలు బియ్యం అందించి సహకరించాలి. బియ్యం, మేత సాయం చేసే దాతలు 63048 72868, 93818 93450 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

– కొల్లి ఈశ్వరరావు, పార్వతి దంపతులు

ఏటిగట్టు పటిష్టతకు శ్రీకారం

- రూ.27 కోట్లతో పనులు
- గోదావరి వరద ముంపు నుంచి రక్షణ

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో బలహీనంగా ఉన్న గోదావరి ఏటిగట్టును శాశ్వతంగా పటిష్ట పరిచే పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఏటిగట్టు శాశ్వత రక్షణకు ప్రభుత్వం రూ.26.32 కోట్లు మంజూరు చేసింది. గతేడాది ఆగస్టులో వచ్చిన వరదల సమయం నుంచి నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు ముంపు భయంతో ఉన్నారు. దీంతో ప్రభుత్వం రూ.56.60 లక్షలతో పట్టణంలోని పొన్నపల్లి వద్ద పనులు చేపట్టింది. అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేశారు. జీఓ 2085 ద్వారా రూ.26.32 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు పనులు ప్రారంభం కాగా వేసవి ముగిసేలోపు పనులు పూర్తిచేయాలని ఆదేశాలిచ్చారు.

వర్షాకాలం.. భయం భయం

గోదావరి గట్టు పొడవునా ఉన్న గ్రామాలు, పట్టణవాసులు వర్షాకాలంలో భయంతో గడపాల్సిన పరిస్థితి. గతేడాది జూలై, ఆగస్టులో వచ్చిన వరదలతో ఈ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత టీడీపీ పాలకులు ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్యను పట్టించుకోలేదు. వైఎస్సార్ హయంలో జరిగిన డెల్టా ఆధునికీకరణ పనులతో సమస్య కొంత వరకూ తీరని, తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకులు పట్టించుకోకపోవడంతో సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. గతేడాది వరదలతో పట్టణంలోని పల్లపు ప్రాంతాలు నీటమునగడంతో పాటు పొన్నపల్లి ప్రాంతంలో ఏటిగట్టు కోతకు గురయ్యింది. గోదావరి వెంబడి ఫుట్‌పాత్, రెయిలింగ్ నీటి ప్రవాహానికి జారిపడ్డాయి. ఈ ప్రాంతంలో గండి పడితే పట్టణంతో పాటు పరిసరాల గ్రామాలు నీటమునిగే ప్రమాదం ఏర్పడింది. దీంతో అప్పట్లో చీఫ్ విప్ ముదునూరి ప్రత్యేక పర్యవేక్షణలో రక్షణ చర్యలు చేపట్టడంతో ప్రమాదం తప్పింది. మరలా ఇలాంటి పరిస్థితి రాకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపడుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

నరసాపురం పట్టణ పరిధిలో పొన్నపల్లి నుంచి వలంధర్‌రేవు వరకూ ఏటిగట్టును శాశ్వతంగా పటిష్ట పరిచే పనులు మొదలు పెట్టాం. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేస్తాం. వేసవి ముగిసి, వర్షాలు పడే నాటికి పనులు పూర్తి చేయాలనే దిశగా పర్యవేక్షిస్తాం. గతేడాది రూ 56.60 లక్షలతో చేసిన తాత్కాలిక మరమ్మతు పనులు కూడా ఫలితాన్ని ఇచ్చాయి.
–కేవీ సుబ్బారావు, కన్జర్వెన్సీ ఏఈ, నరసాపురం

400 మీటర్లు మేర కాంక్రీట్ వాల్

పొన్నపల్లి ఏటిగట్టు పొడవునా వలంధర్ రేవు వరకు 400 మీటర్ల మేర గట్టును పటిష్టం చేస్తున్నారు. ప్లస్ 1, ప్లస్ 4 పద్ధతిలో కాంక్రీట్ వాల్ నిర్మిస్తున్నారు. అలాగే గోదావరి పొడవునా స్లూయిస్ మరమ్మతులకు రూ.8.65 కోట్లు మంజూరయ్యాయి. దర్భరేవు, చిట్టవరం, గొంది స్లూయిస్‌లు, ఈ ప్రాంతాల్లో పాడైన లాకులు మరమ్మతుల పనులు కూడా త్వరలో చేపట్టనున్నారు. దీంతో పాటు ఐదు తూములు, ఇసుక ర్యాంపు వద్ద లాకులు పటిష్టత, స్లూయిస్‌ల గేట్ల మరమ్మతులకు రూ.45 కోట్లతో గత ఏడాది ప్రతిపాదనలు చేశారు. ఆ నిధుల మంజూరుకు కూడా ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రయత్నిస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.